# కొమురం భీము

## (జీవితం - పోరాటం)

కాసుల ప్రతాపరెడ్డి

నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభల ప్రచురణ

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రాష్ట్ర సాంస్కృతికశాఖ, సాంస్కృతిక మండలి

తెలుగు అకాడమి, హైదరాబాదు

Blank Page

తెలుగు అకాడమి ప్రచురణ

లఘు గ్రంథం (మోనోగ్రాఫ్)

# కొమురం భీము

## (జీవితం - పోరాటం)

రచయిత

**కాసుల ప్రతాపరెడ్డి**

సంపాదకులు

దట్స్ తెలుగు డాట్ కామ్

హైదరాబాదు

**4వ ప్రపంచ తెలుగు మహాసభలు**

**27,28,29 డిశంబరు, 2012**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

రాష్ట్ర సాంస్కృతిక శాఖ, సాంస్కృతిక మండలి

తెలుగు అకాడమి, హైదరాబాదు

*komuram bhiimu*

*a monograph published on the occasion of 4th World Telugu Conference*

***Author***

Kasula Pratap Reddy

First Edition : 2012

Pages : Pp. xvi + 72 + iv

©

Telugu Akademi, Hyderabad

Copies : 5000

Price : Rs. 20/-

Published by TELUGU AKADEMI, Hyderabad- 500 029 (Andhra Pradesh) under the Centrally Sponsored Scheme of Production of Books and Literature in Regional Languages at the University level of the Goverment of India in the Ministry of Human Resource Development, New Delhi.

*All rights whatsoever in this book are strictly reserved and no portion of it may be reproduced by any process for any purpose without the written permission of the copyright owners.*

***Published, Printed & Distributed by***

**Telugu Akademi**
**Hyderabad**

***Laser Typeset at***

Telugu Akademi, Hyderabad

***Printed in India***

Printed at M/s. Anu Printers, Hyderabad

యన్. కిరణ్ కుమార్ రెడ్డి

హైదరాబాదు

# ముఖ్యమంత్రి
## ఆంధ్రప్రదేశ్

---

## సందేశం

ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారిని ఒక్క వేదికపైకి తీసుకువచ్చేందుకు, తెలుగు ప్రభలను దశదిశలా వ్యాపింపజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం డిశంబరు 27 నుంచి 29 వరకు ఏడుకొండలవాడి ఆవాసమైన తిరుపతి పుణ్యక్షేత్రంలో అత్యున్నత స్థాయిలో తెలుగు మహాసభలను ఏర్పాటు చేసింది. రాష్ట్రంలోనూ, దేశంలోనూ, ఇతర దేశాల్లోనూ ఉన్న తెలుగువారందరూ పరస్పరం భావ వినిమయం చేసుకోవడానికీ, తెలుగువారు తమ గత చరిత్రను సంస్మరించుకొంటూ, ఉత్కృష్టమైన భవిష్యత్తును నిర్మించుకోవడానికీ ఈ మహాసభలు ఎంతోగానో దోహదం చేస్తాయని మేము విశ్వసిస్తున్నాం.

తొలి ప్రపంచ తెలుగు మహాసభలు జరిగి 37 సంవత్సరాలు గడిచాయి. అయితే ఇంతవరకూ ఏ రాష్ట్ర ప్రభుత్వమూ ప్రపంచ సభలను నిర్వహించడానికి చొరవ చూపలేదు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ ప్రజాజీవితాల్ని ఎలా మెరుగుపరచాలీ తెలుగు వారి వైభవాన్ని ఎలా పరిరక్షించాలి అనే దృష్టితో పనులు చేపడుతోంది. తెలుగువారి నిర్వహణ సామర్థ్యాన్ని ఇటీవల జరిగిన జీవవైవిధ్యసదస్సులో కూడ ప్రభుత్వం నిరూపించింది. ఈ నేపథ్యంలో ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించడానికి సమాయత్తమైంది.

ఇటీవలి కాలంలో ప్రపంచవాప్తంగా ఎన్నో రాజకీయ, సామాజిక, సాంస్కృతిక పరిణామాలు సంభవించాయి. వీటి నేపథ్యంలో బహుభాషా దేశమైన మన భారతదేశంలో తెలుగు భాష, సాహిత్యం, చరిత్ర, సంస్కృతి, కళలు మొదలైన

విషయాల్లో జరిగిన కృషి గురించి, జరగవలసిన కృషి గురించి మనం చర్చించవలసింది ఎంతో ఉంది. ప్రపంచీకరణ నేపథ్యంలో మన తెలుగు భాష ఉనికిని కోల్పోకుండా పరిరక్షించేందుకు, తెలుగు ఔన్నత్యాన్ని పలుదిశలా చాటేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. నిత్యం ప్రజల హితం కోరి, ప్రజల అభీష్టాలను నెరవేర్చేందుకు, తెలుగు జాతి దేశవిదేశాల్లో తలెత్తుకు తిరిగేలా చేసేందుకు అవిరళ కృషి చేస్తున్న మా ప్రభుత్వం, తెలుగు తేజం కాంతులు వెదజల్లేలా ఈ మహోజ్వలమైన సభల నిర్వహణకు సమాయత్తమైంది. ఈ సభలలో సదస్సులు, తెలుగువారి కళా ప్రదర్శనలు, చేతివృత్తుల ప్రదర్శనలు, లలితకళా వైభవాన్ని చాటే కార్యక్రమాలు, రాష్ట్రేతర, విదేశాంధ్రుల సమావేశాలు మొదలైన ఎన్నో అంశాలతో పాటు, పుస్తక ప్రచురణ కూడ పెద్ద ఎత్తున చేపడుతున్నాం. అందులో భాగంగానే ఈ లఘుగ్రంథాల ప్రచురణ జరుగుతున్నది.

ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సమావేశాల సందర్భంగా ప్రచురించే లఘుగ్రంథాలు పాఠకుల ఆదరణ పొందగలవని ఆశిస్తున్నాము.

కిరణ్ రెడ్డి

(యన్. కిరణ్ కుమార్ రెడ్డి)

సి. దామోదర రాజనరసింహ

# ఉపముఖ్యమంత్రి
## ఆంధ్రప్రదేశ్

## అభినందన

**ఏ దేశమేగినా, ఎందుకాలిడినా**
**పొగడరా నీతల్లి భూమి భారతిని**
**నిలపరా నీజాతి నిండు గౌరవము**

అన్న మహాకవి రాయప్రోలు వాక్కులు ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారు నిత్యం స్మరించుకోతగినవి. దేశంలోని అన్ని రాష్ట్రాలలోనూ, ప్రపంచంలోని అన్ని దేశాలలోనూ తెలుగు ప్రజలు తమ ప్రతిభా పాటవాలను నిరూపించుకుంటూ ప్రశంసలు పొందుతున్న ఈ సమయంలో నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభలు ప్రపంచ ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతిలో మన రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్నది. ఇది తెలుగు భాషాభిమానులకూ, కళా సాంస్కృతిక రంగాలలో కృషి చేస్తున్నవారికీ ఒక పండగ.

ప్రపంచీకరణ నేపథ్యంలో మాతృభాషలను, మాతృసంస్కృతిని పరిరక్షించుకోవడం మనందరి బాధ్యత. ఈ సందర్భంలో తెలుగు భాష, జాతి వికాసం కోసం నిరంతరంగా కృషిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగు భాషా సంస్థ అయిన తెలుగు అకాడమికి 150 లఘుగ్రంథాలను(మోనోగ్రాఫ్‌లను) రాయించి పుస్తకాలుగా తెచ్చే అవకాశం కల్పించాం. తెలుగు భాష, సంస్కృతి, చరిత్ర, సంప్రదాయాలు, తెలుగుభాషోద్యమాలు, సాహిత్యకారులు, సంఘసంస్కర్తలు, కథ, నవల, వ్యాసం, కవిత్వం లాంటి వివిధ సాహిత్య ప్రక్రియలు, ఛందస్సు, ప్రకృతివైద్యం, ప్రాచీన ఆధునిక సాహిత్య సాంస్కృతిక విషయా లన్నింటిపై, సాహిత్యచరిత్రలపై పుస్తకాలు రాయించి ముద్రిస్తున్న తెలుగు అకాడమిని అభినందిస్తున్నాను. కొద్ది సమయంలో పుస్తకాలు రాయించి ముద్రించడం అనేది ఓయజ్ఞంగా భావించి చేస్తేనే తప్ప ఈ పని పూర్తి కాదు, ఆ పనిని తెలుగు అకాడమి విజయవంతంగా నిర్వహిస్తున్నది.

ఇప్పుడు నిర్వహిస్తున్న ప్రపంచ తెలుగు మహాసభలు, ఈ సందర్భంగా ప్రచురిస్తున్న పుస్తకాలు మన భాషను, జాతిని, సంస్కృతిని, చరిత్రను సమున్నతంగా నిలబెట్టే యజ్ఞంలో, తెలుగు భాషా పరిరక్షణలో ఎంతో ఉపయోగపడతాయని ఆశిస్తున్నాను. తెలుగు భాష పరిరక్షణకోసం, ఔన్నత్యం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా జరుగుతున్న ఈ ప్రపంచ తెలుగు మహాసభలను ఆహ్వానిస్తూ, ఇన్ని పుస్తకాలు ముద్రిస్తున్న తెలుగు అకాడమి సంచాలకులకు, రచయితలకు మరియు అకాడమి సిబ్బందికి అభినందనలు తెలుపుతూ ప్రపంచంలో ఉన్న 18 కోట్ల మంది తెలుగు ప్రజల అభ్యున్నతి కోరుతూ.. మరోసారి అందరికీ నాహృదయ పూర్వక శుభాకాంక్షలు తెలుపుతున్నాను.

<u>"తల్లి నుడికంటె పరమామృతంబుకలదె"</u>

(సి. దామోదర రాజనరసింహ)

**V. VASANT KUMAR,** B.Sc.(Ag.); M.B.A
Minister for Tourism & Culture,
Archgology & Museums,
Archives & Youth Services & Sports, N.C.C.
Government of Andhra Pradesh

Room No. 501, 5th Floor,
J-Block, A.P. Secretariat
Hyderabad - 500 022
Phone : 040-23454168,
23450541
Fax :040-23450899

# ప్రస్తావన

తెలుగువారు తెలుగు నేలపై 37 ఏళ్ళ విరామం తరవాత చేసుకుంటున్న పండుగ ప్రపంచ తెలుగు మహాసభలు, మన సంస్కృతిని నలుదిశలా వ్యాపింపజేస్తున్న తెలుగు వారందరూ ఒక్కచోట చేరి, తెలుగు దనాన్ని పంచుకునేందుకు, తెలుగు పరిమళాలు వెదజల్లేందుకు ఉద్దేశించిన సన్నివేశం ప్రపంచ తెలుగు మహాసభలు, తెలుగు వారి సంస్కృతి బహుముఖీయమైంది. అందులో భాష, సాహిత్యం, చరిత్ర, లలితకళలు, జానపద, గిరిజన విజ్ఞానం వంటి ఎన్నో అంశాలున్నాయి. వీటన్నిటి గురించి విశ్లేషించుకొని, వాటిని పరిరక్షించడం, పోషించడం, పరివ్యాప్తి చేయడం ప్రభుత్వం తన విద్యుక్త ధర్మంగా భావిస్తున్నది.

ఈ బృహత్తరమైన బాధ్యతని నెరవేర్చే సంకల్పంలో భాగంగానే 'ప్రపంచ తెలుగు మహాసభల' నిర్వహణకు ప్రభుత్వం నడుము కట్టింది. అతి తక్కువ వ్యవధిలో అత్యంత సమున్నత స్థాయిలో తలపెట్టిన ఈ మహాసభలకు దేశ విదేశాల నుంచి తెలుగువారు స్వాగతం పలుకుతున్నారు. అత్యధిక సంఖ్యలో ఈ సభలో పాల్గొంటున్నారు.

తెలుగు వారందరూ ఒక్కచోట సమకూడి, తమ గురించి చర్చించుకుని, భవిష్యత్తుకు బాటలు వేసుకునే క్రమంలో మన గురించి మనం మరోసారి తెలుసుకునేందుకు, వివిధ రంగాల్లో మనం సాధించిన దాన్ని పునశ్చరణ చేసేందుకు ఈ సభల సందర్భంగా సదస్సులు, లఘుగ్రంథాల ప్రచురణ, ప్రత్యేక సంచికల పునశ్చరణ, వివిధ అంశాల్లో ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతున్నది.

తెలుగువారిది ఘనమైన చరిత్ర, అత్యున్నత సంస్కృతి, అయితే కాలంతో పాటు అభివృద్ధి పథంలో నడుస్తున్న తెలుగువారు ఎప్పటికప్పుడు తమ సంస్కృతిలోకి కొత్త నీరును ఆహ్వానించడం సహజం. ఈ "పాతకొత్తల మేలు కలయికే"ఒక జాతిని నిత్యచైతన్యంతో నింపుతుంది. ఈ విధంగా కొత్త దనాన్ని ఆహ్వానిస్తూనే, మన గతవైభవాన్ని విస్మరించకుండా కాపాడుకోవలసిన బాధ్యత మన మీద ఉంది. ఇవన్నీ ఈ ప్రపంచ తెలుగు మహాసభల్లో చర్చకు రానున్నాయి. అందరం కలిసి, తెలుగుదనాన్ని పరిరక్షించుకునే ప్రయత్నం చేయవలసిన తరుణం ఆసన్నమైంది.

వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకుని తెలుగువారి భాష, సాహిత్యం, సంస్కృతి పౌరజీవనం తదితర అంశాలపై లఘుగ్రంథాలను నిష్ణాతుల చేత రచింపజేసి ప్రచురించే గురుతర బాధ్యతను పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, తెలుగు అకాడమి, రాష్ట్ర సాంస్కృతిక శాఖ నిర్వర్తిస్తున్నాయి. తెలుగు ప్రజలు కలకాలం ఉపయోగించుకునే విధంగా ఈ పుస్తక ప్రచురణ జరుగుతోంది. వీటిని పాఠకులు, తెలుగు భాషాభిమానులు, పండితులు ఆదరిస్తారని విశ్వసిస్తున్నాను.

పి. వసంతకుమార్

పట్టి వసంతకుమార్

# భూమిక

1968లో ప్రభుత్వం అప్పటి విద్యాశాఖమంత్రి మాన్యశ్రీ పి.వి. నరసింహారావు గారు తొలి అధ్యక్షులుగా స్థాపించిన తెలుగు అకాడమి తెలుగు భాషా వికాసం కోసం చేస్తున్న కృషి అపరిమితం. పాఠ్యపుస్తకాలు, పోటీ పరీక్షల పుస్తకాలు, మోనోగ్రాఫ్‌లు, నిఘంటువులు, మాండలిక పదకోశాలతో పాటు భాష, సాహిత్యం, సంస్కృతికి సంబంధించిన అనేక పుస్తకాలు ప్రచురిస్తూ తెలుగుభాషకోసం అకాడమి చేస్తున్న సేవలు అద్వితీయం. తెలుగు భాష, జాతి, సంస్కృతి ప్రేమికుడయిన మాన్యశ్రీ సి. దామోదర రాజనరసింహ గారు అధ్యక్షులుగా తెలుగు అకాడమి తన పరిధిని మరింత విస్తరించుకొని తెలుగు భాషలో శాశ్వతంగా మిగిలిపోగల అనేక పుస్తకాలను తీసుకువస్తున్నది. మహాకవి గుర్రం జాషువా పరిశోధన కేంద్రం నెలకొల్పి తద్వారా ప్రతి ఏటా సాహిత్యరంగంలో విశిష్టసేవ చేసిన ముగ్గురిని ఎంపిక చేసి ఒక్కొక్కరికి రెండు లక్షల రూపాయల చొప్పున నగదు పురస్కారాలు ఇవ్వడం సాహిత్యవేత్తలకు, తెలుగు భాషకు చేస్తున్న సేవకు నిదర్శనం. తెలుగు వారి చరిత్రలోనే ఇది ప్రథమం. అకాడమి ప్రచురించే పుస్తకాలతో పాటు ఇటీవలి కాలంలో గురజాడ సాహిత్యసర్వస్వం, జాషువా పరిశోధన కేంద్రం తరఫున పుస్తకాలు ప్రచురించింది. తన 45 సంవత్సరాల చరిత్రలో దాదాపు 3500 శీర్షికలతో వివిధ గ్రంథాలను ప్రచురించి భారతదేశంలోని అకాడమిలన్నింటిలో తెలుగు అకాడమి అగ్రస్థానంలో నిలబడటం తెలుగు వారి కృషికి గర్వకారణం. రాష్ట్రవ్యాప్తంగా సదస్సులు, సభలు, చర్చాగోష్ఠులు నిర్వహించడంతో పాటు ఇటీవల జాషువా జయంతి సందర్భంగా "శతకవితావసంతం" నిర్వహించి రాష్ట్రవ్యాప్తంగా కవితాచైతన్యానికి, కవులకు ప్రోత్సాహాన్నిచ్చింది తెలుగు అకాడమి.

2012 డిశంబర్ 27,28,29 తేదీల్లో తిరుపతిలో జరగనున్న నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ప్రభుత్వం అకాడమి పై ఉన్న నమ్మకంతో 150లఘు గ్రంథాలను (మోనోగ్రాఫ్‌లను)రాయించి ప్రచురించే బాధ్యతను అప్పగించింది. తెలుగు భాష, సాహిత్యం, చరిత్ర, సామాజిక శాస్త్రాలు, విజ్ఞాన శాస్త్రాలు, జాతి, సంస్కృతి ఒక్కటేమిటి తెలుగుకు సంబంధించిన వివిధ అంశాలను తీసుకొని పుస్తకాలు రాయించడం జరిగింది. తెలుగు భాషా, సాహిత్యాలలో లబ్ధ ప్రతిష్ఠులైనవారితో పాటు ఆయారంగాల్లో నిపుణులైన వాళ్ళతో పుస్తకాలు తయారు

చేయించి ప్రచురిస్తున్నాం. తెలుగు భాషను, సాహిత్య సంస్కృతులను, సమస్త విషయాలను సమున్నతంగా నిలబెట్టగలమన్న నమ్మకంతోనే ఈ కృషి చేస్తున్నాం. తెలుగు సాహిత్యంలో అనర్ఘరత్నాలనదగిన, జాతి సంపదనదగిన పుస్తకాలను ప్రచురించే ఈ సువర్ణ అవకాశం మాకు కల్పించడమేగాక ఆర్థిక వనరులను అందించి ప్రోత్సహించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారికి, సాంస్కృతిక శాఖ, సాంస్కృతికమండలివారికి కృతజ్ఞతలు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి **మాన్యశ్రీ యన్. కిరణ్ కుమార్ రెడ్డి** గారికి; ఉపముఖ్యమంత్రి, ఉన్నత విద్యాశాఖా మంత్రి తెలుగు అకాడమి అధ్యక్షులు **మాన్యశ్రీ దామోదర రాజనరసింహ గారికి;** సాంస్కృతిక శాఖామాత్యులు **మాన్యశ్రీ వట్టి వసంతకుమార్ గారికి** కృతజ్ఞతాభివందనాలు.

4వ ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణకుగాను ప్రభుత్వం నియమించిన ఉన్నతస్థాయి సంఘం సభ్యులు :

**శ్రీ ఆర్. వి. రమణమూర్తి,** అధ్యక్షులు, సాంస్కృతిక మండలి

**శ్రీ మండలి బుద్ధప్రసాద్,** రాష్ట్ర అధికారభాషా సంఘం అధ్యక్షులు

**డా. జె. బాపురెడ్డి,** ఐ.ఏ.ఎస్.,(రి)

**శ్రీ కె.వి. రమణాచారి,** ఐ.ఏ.ఎస్.,(రి) సాంస్కృతిక శాఖ, సలహాదారులు

**శ్రీ వి. భాస్కర్,** ఐ.ఏ.ఎస్. ముఖ్య కార్యదర్శి, ఆర్థిక శాఖ, ఆం.ప్ర.

**శ్రీ ఎల్. వి. సుబ్రహ్మణ్యం,** ఐ.ఏ.ఎస్. కార్యనిర్వహణాధికారి, తిరుమల తిరుపతి దేవస్థానం

**శ్రీమతి చిత్రా రామచంద్రన్,** ఐ.ఏ.ఎస్., ముఖ్య కార్యదర్శి, రెవెన్యూ శాఖ (దేవదాయ)

**ఆచార్య ఎల్లూరి శివారెడ్డి,** ఉపాధ్యక్షులు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

**శ్రీ జి. బలరామయ్య,** ఐ.ఏ.ఎస్., ప్రభుత్వ కార్యదర్శి, సాంస్కృతిక శాఖ

**శ్రీ జి. ఎన్. రావు,** ఐ.ఏ.ఎస్.(రి) ప్రత్యేకాధికారి, శిల్పారామం

**ఆచార్య కె. యాదగిరి,** సంచాలకులు, తెలుగు అకాడమి

**డా. రాళ్లబండి కవితా ప్రసాద్,** సంచాలకులు, సాంస్కృతిక శాఖ

ప్రపంచ తెలుగు మహాసభల రూపకల్పనతో పాటు లఘుగ్రంథాల తయారీలో తమ సహాయ సహకారాలు అందించినందుకు ఈ కమిటీ వారికి ధన్యవాదాలు తెలుపుతున్నాం.

4వ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ప్రచురిస్తున్న ఈ మోనోగ్రాఫ్‌లను అత్యంత స్వల్ప వ్యవధిలో తయారుచేయించడం జరిగింది. ఈ గ్రంథాల్లో ఏవైనా దోషాలు, పొరపాట్లు దొర్లినట్లు పాఠకులు గమనిస్తే సహృదయంతో వాటిని మా దృష్టికి తీసుకొని వస్తే మలి ముద్రణలో సవరించగలమని తెలియజేస్తున్నాం.

**ధర్మమనుడు, తత్త్వమనుడు, యోగమనుడు**
**ప్రాణిసాధింపగల సకలపరమార్థములకు**
**తల్లిభాషప్రధాన సూత్రంబయగుట**
**భాషకంటె నవ్వులకు తపస్సులేదు**

**ఆచార్య కె. యాదగిరి**
సంచాలకులు

Blank Page

# తెలుగు అకాడమి సమన్వయ సంఘం

ఆచార్య కె. యాదగిరి
సంచాలకులు

డా॥ ఎం. మాణిక్యలక్ష్మి
ఉపసంచాలకులు

డా॥ ఎన్. యోగిబాబు

డా॥ టి. అరవింద

శ్రీ టి. రాజేందర్ కుమార్

శ్రీ ఎం. వెంకటేశం

శ్రీమతి సి. శ్రీవిద్య

శ్రీ ఎస్. భూపాల్‌రెడ్డి

శ్రీమతి కె. గీతాంజలి

డా॥ ఎం. శైలజ

శ్రీమతి ఎస్.ఎ.టి. రాజ్యలక్ష్మి

శ్రీమతి వి. అరుంధతి

శ్రీ ఎస్. వేదవ్యాస్

---

* *ఈ గ్రంథంలో ప్రచురితమైన విషయాలకు, వివరాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలు/రచయిత్రులే బాధ్యులు.*

Blank Page

# ప్రవేశిక

కొమురం భీము మీద మోనోగ్రాఫ్ రాయాలని అడిగినప్పుడు అనాలోచితంగా సరే అన్నాను గానీ తీరా రాయడానికి ప్రయత్నాలు ప్రారంభించేసరికి అది ఎంత కష్టమైన పనో అర్థమైంది. చీమలు దూరని చిట్టడవిలోకి ప్రవేశించినట్లు ఉంది. సాహు, అల్లం రాజయ్య రాసిన 'కొమురం భీము' నవల ఉంది. ఆ తర్వాత పిల్లల కోసం భూపాల్ రాసిన నవల కనిపించింది. ఆ తర్వాత ప్రాణ్ రావు రాసిన నవలను దొరకబట్టాను. విడుదలకు ముందే అల్లాణి శ్రీధర్ దర్శకత్వంలో వచ్చిన కొమురం భీము సినిమా చూసిన అనుభవం ఉంది. వీటితో కొమురం భీము జీవిత చరిత్రను ఏమైనా నిర్మించగలమా అనే సందేహం ఉదయించింది. అవన్నీ సృజనాత్మక ప్రక్రియలు. వాటిలో వాస్తవం ఎంత, కల్పితం ఎంత అనే సందేహం పీడిస్తూ వచ్చింది.

ఆ నవలను ప్రధానంగా ముందు పెట్టుకుని, నా వద్ద ఉన్న సమాచారంతో పోల్చుకుంటూ కొమురం భీము జీవితాన్ని, పోరాటాన్ని నిర్మించే ప్రయత్నం చేశాను. సాహు, అల్లం రాజయ్య ఆ నవల రాయడానికి విస్తృతమైన అధ్యయనం చేశారు, క్షేత్ర పరిశీలన కూడా చేశారు. వారి అధ్యయన పద్ధతిని, వారు పరిశీలించిన పత్రాల జాబితాను వారు నవల ముందుమాటలో వివరించారు. అయితే, కల్పన ఏ మేరకు ఉందనే విషయాన్ని తేల్చుకోవడానికి నాకు మళ్లీ అధ్యయనం అవసరం అయింది. నవల కాల్పనిక సాహిత్యం కాబట్టి ఆ స్వేచ్ఛ రచయితలకు ఉంటుంది. జీవిత చరిత్ర రాసే నాకు ఆ స్వేచ్ఛ లేదని తెలుసు. అందుకే నాకు మరోసారి అధ్యయనం అమసరమైంది.

నిజానికి, కొమురం భీముపై, ఆయన పోరాటంపై సూటిగా నలుగురికి అందేలా వచ్చిన రచన లేదని నాకు అనిపించింది. ఆ లోటును ఈ పుస్తకం తీరుస్తున్నందనే విశ్వాసం నాకు ఉంది. ఒక రకంగా ఈ పుస్తకం రాయడం సాహసమే. ఆ సాహసాన్ని అర్థం చేసుకుని, ఇందులోని లోటుపాట్లను మన్నిస్తారని ఆశిస్తాను.


నాకు ఈ మోనోగ్రాఫ్ రాయడానికి అవకాశం ఇచ్చిన తెలుగు అకాడమీ సంచాలకులు యాదగిరిగారికి కృతజ్ఞతలు.

**కాసుల ప్రతాపరెడ్డి**

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | కొమురం భీము బాల్యం - కుటుంబం | 3 |
| 2. | కొమురం భీము తిరుగుబాటుకు పూర్వం | 10 |
| 3. | సిద్దిఖి హత్యోదంతం | 12 |
| 4. | రహస్య ఉద్యమకారుడు విటోభాతో సాహచర్యం | 16 |
| 5. | చెల్లా చెదురైన కుటుంబం | 19 |
| 6. | అస్సాంలో కొమురం భీము | 20 |
| 7. | అస్సాం నుంచి వెనక్కి.. | 21 |
| 8. | 12 గ్రామాల ఏర్పాటు కథ | 25 |
| 9. | భీము ముఖ్య అనుచరుడు సూరు | 28 |
| 10. | తుడుం మోగింది | 29 |
| 11. | ఆ ముగ్గురు | 35 |
| 12. | ధిక్కారం ప్రారంభం | 42 |
| 13. | అంతిమపోరు | 48 |
| 14. | అనుబంధం | 52 |

# కొమురం భీము



కొమురం భీము గిరిజన ఆత్మగౌరవానికి ప్రతీక. ఆయన ఆదిలాబాద్ జిల్లాకు చెందిన గిరిజనోద్యమ నాయకుడు. పలు గిరిజన ఉద్యమాలకు స్ఫూర్తిని అందించిన నాయకుడు. ఆయన ఉద్యమం జల్ - జమీన్ - జంగిల్. ఆయన గిరిజన గోండు తెగకు చెందిన కొమురం చిన్నూమ్, సోంబాయి దంపతులకు 1900 సెప్టెంబర్ 27వ తేదీన ఆదిలాబాద్ జిల్లా ఆసిఫాబాద్ మండలం సంకేపల్లిలో జన్మించాడని ఉంది. కానీ నిర్దిష్టంగా అతని జన్మ తేదీ అదే అని చెప్పడానికి తగిన ఆధారాలు లేవు.

ఆసిఫాబాద్ పరిసర ప్రాంతాలు, జోడెఘాట్, బాబేఝరి గుట్టలు కేంద్రంగా నిజాం సైన్యాలపై గెరిల్లా పోరాటం నడిపించాడు. కుర్దు పటేల్ అనే నమ్మకద్రోహి సహాయంతో నిజాం సైన్యం 1940 సెప్టెంబర్ 1వ తేదీన కొమురం భీము స్థావరాన్ని ముట్టడించింది. అతనితో పాటు 12 మందిని హతమార్చింది. అది గిరిజనులు పవిత్రంగా భావించే ఆశ్వియుజ మాసం. దాంతో అప్పటి నుంచి గిరిజనులు ఆ తిథి రోజునే కొమురం భీము వర్ధంతిని జరుపుకుంటారు.

తమకు జీవనాధారమైన అడవి నుంచి తరిమేసే ప్రభుత్వ విధానాలకు, చట్టాలకు వ్యతిరేకంగా పోరాడారు. తమ భూములను గిరిజనేతరులు ఆక్రమించుకునే ప్రయత్నాలకు వ్యతిరేకంగా గిరిజనులు పోరాటం చేశారు. కొమురం భీము పోరాటం ప్రధానంగా గిరిజనులను తమ భూముల నుంచి బేదఖలు చేసే ప్రయత్నాలకు వ్యతిరేకంగా సాగింది.

తమను దోచుకోవడానికి, తమ భూములను ఆక్రమించుకోవడానికి జరిగిన ప్రయత్నాలను అడ్డుకోవడానికి గిరిజనులు ఉద్యమించారు. అడవిని నరికివేస్తే జంగ్లాత్ భూమి అని, లేదంటే రెవెన్యూ భూమి అని గోండులను తరిమేయసాగారు. పంటలను ధ్వంసం చేశారు, జరిమానాలు వేశారు. ఈ వేధింపులకు, అణచివేతలకు వ్యతిరేకంగా గోండులు, కోలామ్‌లు పోరు బాట పట్టారు. మా ఊర్లో మా రాజ్యం అంటూ 12 గూడాలు బాబేఝరి లొద్దుల్లో తుడుం మోగించారు. ఈ గోండులకు కొమురం భీము నాయకత్వం వహించాడు.

కొమురం భీము పోరాటం ఇతర ప్రాంతాలకు విస్తరించే లోపే నిజాం సేనలు యుద్ధం ప్రకటించాయి. ఆ సమయంలో ఇరు పక్షాలకు మధ్య పోరాటం సాగింది. కొమురం భీము పోరాటం అసంపూర్ణంగా ముగిసింది.

కొమురం భీము జన్మించిన గోండుగూడెం సంకెనపల్లి ప్రస్తుత అదిలాబాద్ జిల్లాలో ఉంది. పూర్వం పదహారవ శతాబ్దంలో బీజాపూర్ రాజ్యం ఉండేది. ఆ రాజ్యానికి అలీఅహ్మద్‌షా రాజు అతను తన తండ్రి తర్వాత 22 ఏండ్లు రాజ్యాన్ని పాలించాడు. 23వ ఏట శత్రువులు కుట్రపన్ని అతన్ని హత్యచేశారు. అతని హత్య జరిగేనాటికి అతని కొడుకు ఇబ్రహీం అదిల్‌షాకు తొమ్మిదేళ్ళు మాత్రమే. దాంతో అలీఅహ్మద్‌షా కొలువులో ఉన్న ఆర్థిక మంత్రి రాజ్యాన్ని భారాన్ని వహించాడు. అతను మరాఠీ బ్రహ్మణుడు. ఆ మంత్రి చేసిన సహాయానికి సంతోషించి పెద్దవాడైన తర్వాత ఇబ్రహీం అదిల్‌షా అప్పటి అదిలాబాద్ ప్రాంతాన్ని అతని జాగీర్‌గా ఇచ్చాడు. అదిల్‌షా పేరు మీదనే ఆదిలాబాద్‌గా స్థిరపడిపోయింది.

ఈ ఆదిలాబాద్ మహారాష్ట్ర దిగువన ఉంది. నిరంతరం ప్రవహించే నదులు ఈ జిల్లాకు సరిహద్దులుగా ఉన్నాయి. దక్షిణాన గోదావరి, తూర్పున ప్రాణహిత ఉన్నాయి. ఉత్తర, పడమర దిక్కులుగా పెన్‌గంగా వార్ధానాలతో మహారాష్ట్రను ఆనుకొని ఉంది. ఈ జిల్లా విస్తీర్ణంలో 40% అడవులే.

దానికితోడు జిల్లాలోని అడవులు, వాగులు, వంకలు, గిరులు, కొండలతో విస్తరిల్లి ఉంది. కుంటాల, స్వర్ణ, సాత్నాల, పొత్సర, గాయత్రి లాంటి జలపాతాలు ఎన్నో ఉన్నాయి. ఇటువంటి అడవి ప్రాంతంలోనే కొమరం భీమ్ పుట్టిన గోండు గూడెం సంకెనపల్లి ఉంది. ఈ సంకెనపల్లి అప్పటి జనగాం (ఆసీఫాబాద్) పరిధిలో ఉంది. నైజాం పాలనలో ఆ ప్రాంతానికి ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంగా ఉంది. వరంగల్ సుబేదారుగా ఉండేది.

## కొముురం భీము బాల్యం - కుటుంబం

సంకెనపల్లి గూడెం పెద్దగా కొమరంభీమ్ తండ్రి చిన్ను వ్యవహరిస్తు ఉండేవాడు. కొమురం భీముకు సోము, బొజ్జు అనే ఇద్దరు అన్నలు ఉండేవారు. వీరిలో పెద్దవాడైన సోము నాగలిపట్టి వ్యవసాయం చేసేవాడు. బొజ్జు, భీమ్ అతనికి సహకరిస్తుండేవారు.

భీము తండ్రికి ఇద్దరు తమ్ముళ్ళు కొమురం కుర్దు, కొమరం యశ్వంత్. ఈ యశ్వంత్‌నే అందరు ఏసు అని పిలిచేవారు. కొమురం కుర్దుకు ఐదుగురు కొడుకులు వారిలో సుద్దు, జంగు భీమ్ కన్నా పెద్దవాళ్ళు, రఘు, సోము కొంచెం అటు ఇటుగా భీమ్ వయసువాళ్ళే బాదు చిన్నవాడు. కొమురం ఏసుకు ముగ్గురు కొడుకులు లచ్చు, రాము, రాజు.

కొమరంభీమ్ తండ్రి చిన్ను విష జ్వరంతో అకాల మరణం పొందుతాడు. అప్పటికే జంగ్లాత్‌వాళ్లతో గోండులు, కోలామ్‌లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మోతీరామ్ తాతతో కొమరం భీముకు సాన్నిత్యం. **తాము రాజుల వంశానికి చెందినవాళ్ళమని ఈ అడవికంతా తామే రాజులమని మోతీరామ్ భీమ్‌కు చెప్తూ ఉండేవాడు. పంచపాండవుల్లో రెండవవాడైన భీముడి వంశానికి చెందినవాళ్ళమని నమ్ముతుండేవాళ్ళు. భీముడు హిడింబి అనే స్త్రీని పెళ్లిచేసుకున్నాడని, భీముడిద్వారా హిడింబికి ఇద్దరు పుత్రులు జన్మించారని వారిలో పెద్దవాడు ఘటోత్కచుడు అని చెప్తారు. ఘటోత్కచుడి సంతానమే గోండులని, అతని తమ్ముడి కుమారులు కోలామ్‌లని నమ్ముతుంటారు. ఈ ప్రాంతంలో ఆ రెండు తెగలవాళ్ళే ఎక్కువగా ఉంటారు. భీముడు హిడింబితో కొంత కాలం కాపురం చేసి వెళ్లిపోయారని కథనం.**

**అసిఫాబాద్ (జనగాం) ప్రాంతమంతా హైదరాబాద్ రాజ్యంలో భాగంగా నిజామ్ ఏలుబడిలో ఉండేది. హైదరాబాద్ రాజ్యాన్ని అప్పుడు ఆసఫ్‌జాహీ వంశానికి చెందిన మహబూబ్ అలీఖాన్ కుమారుడు ఏడవ** నిజాం ఉస్మాన్ అలీ ఖాన్ (1911 - 1948) పాలించాడు. ఆయన పాలనలో ఆసిఫ్‌బాద్ ప్రాంతంలోని గోండులు, కోలామ్‌లు అడవిలో పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవించేవాళ్ళు. పూర్వం నుంచి గోండులు పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రాజ్యం ప్రత్యక్ష నియంత్రణలో వారు లేరు. ఆదివాసుల భూముల పరిరక్షణకోసం అంటూ నిజాం ప్రభుత్వం 1917లో తెచ్చిన చట్టం వారి జీవితాలను అల్లకల్లోలం చేసింది. అంతకు పూర్వం ఆ భూములపై ప్రభుత్వానికి హక్కు ఉండేది కాదు. ఈ చట్టంతో ఆ

భూములపై హక్కును భుక్తం చేసుకుంది. సిపాయి జమా బంది (పన్నులు లేకుండా దున్నుకునే భూములు) కింద ఆ అడవి ప్రాంతంలో భూములన్ని ఉండేవి. చట్టం తెచ్చిన తర్వాత 1918లో ఉట్నూరులో మొదటి తాసీల్ ఆఫీస్ ఏర్పడింది. అప్పటికే మహారాష్ట్ర నుంచి చుట్టుపక్కల జిల్లాల నుంచి గిరిజనేతరులు ఆ అటవి ప్రాంతానికి చేరుకున్నారు.

ఇప్పటి ఆదిలాబాద్ జిల్లాలోని సిర్పూర్ కాగజ్‌నగర్ ప్రాంతంలో 1935 ప్రాంతంలో పేపర్ మిల్లు ఏర్పడి విశాలమైన అడవి ప్రాంతం పేపరు మిల్లు అవసరాల కోసం స్వాధీనం చేసుకున్నారు. గోండులు చాలా మంది ఫ్యాక్టరీ కార్మికులుగా మారిపోయారు.

గిరిజనేతర్లంతా గోండులు, కోలామ్‌లు అడవులను నరికి సాగు చేసుకుంటున్న భూములపై కన్నేశారు. అధికార యంత్రాంగాన్ని అడ్డం పెట్టుకొని ఆ చట్టం ఆసరాతో ఆ భూములను కబ్జా చేయడానికి ప్రయత్నించారు. అధికారుల సహాయంతో గోండులు, కోలామ్‌లు అడవులు నరికి సాగు చేసిన భూములకు తామే పట్టాదారులమంటూ ఎవరెవరో వచ్చేవారు. చట్టం పేరు చెప్పి ఆ భూములను తమ ఆధీనంలోకి తీసకునేవారు. గోండులు, కోలామ్‌లు తమ భూముల్లో తామే కౌలుదార్లుగా మారాల్సి వచ్చేది. లేదంటే భూములు వదిలిపోవాల్సి వచ్చేది. అలా వదిలిపెట్టినవాళ్లు మరెక్కడికో వెళ్లి అడవులు నరికి వ్యవసాయం చేయడం, అదే సమస్య ఎదురు కావడం సర్వసాధారణంగా మారింది. ఈ క్రమంలోనే గోండులు, కోలామ్‌లపై అధికారులు కేసులు పెట్టేవారు. కేసుల కోసం అదాలత్‌ల చుట్టూ తిరుగుతూ గిరిజనులు వేసారిపోయేవారు. మరోవైపు, షావుకార్లు అప్పులు ఇచ్చి వడ్డీ మీద వడ్డీ కట్టుకుని పండించిన పంటనంతా తీసుకుని వెళ్తుండేవారు. పంట ఎంత పండించినా, తినడానికి తిండి కూడా ఉండేది కాదు. ఇక్కడే గోండులకు బతుకుతెరువు సమస్య ఎదురైంది. (భూ సంరక్షణ చట్టం తేవడానికి ముందు అప్పటికే వ్యవసాయం చేసుకుంటున్న గోండులు, కోలామ్‌లకు పట్టాలు ఇచ్చి ఉంటే ఈ సమస్య వచ్చి ఉండేది కాదేమో).

అంతకుముందే బ్రిటిష్ ప్రభుత్వం తన ప్రత్యక్ష ఏలుబడిలో ఉన్న ఆంధ్రప్రాంతంలో ఇటువంటి చట్టాన్నే అమలుచేసింది. అప్పట్లో ఉత్తరాంధ్ర ప్రాంతంలో గిరిజనులు ఇటువంటి సమస్యనే ఎదుర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు నాయకత్వంలో గిరిజనులు ఏకమై బ్రిటిష్ ప్రభుత్వంపై సాయుధ పోరాటం చేశారు. ఆ సాయుధ పోరాటం విఫలమైంది. ఈ నేపథ్యమంతా కొమురం భీములో వయసు పెరుగుతున్న కొద్దీ అసహనాన్ని పెంచుతూ వచ్చింది. గుండెను పిండేసే వేదనతో కుమిలిపోతూ ఉండేవాడు. ఏం చేయాలో అర్థమయ్యేది కాదు. దాన్ని మరిచిపోవడానికి పాటలు పాడుతుండేవాడు. మోతీరాం చెప్పే కథలు వింటుండేవాడు. వయసు మళ్లిన వ్యక్తి మడావి మహదు చెప్పే విషయాలను ఆలకిస్తూ ఉండేవాడు. పంచె కట్టుకుని నెత్తికి పాగా చుట్టుకునేవాడు. ఒంటి మీద చొక్కా ఉండేది కాదు. బాల్యం నుంచి గోండుల కష్టాలు కడగండ్లు చూస్తూ, అనుభవిస్తూ వాటితో పాటే పెరుగుతూ వచ్చాడు. మడావి మహదు పోరాటంలో భీము వెంట చివరిదాకా ఉన్నాడు.

## కొమురం భీము బాల్యంపై పడిన ప్రభావాలు

ఆ క్రమంలోనే కొమురం భీము పిల్లవాడిలా పశువులను మేపుతూ బుక్కా గులాల్ అమ్మే అయ్యవారి నుంచి చదువు నేర్చుకున్నాడు. తనకు సన్నిహితుడైన మడావి మహదు ద్వారా దోపిడీ వర్గాలకు ఎదురునిలిచి పోరాడిన గోండురాజుల వీర శౌర్యాలను వినేవాడు. ప్రధాన్‌లు భీము వ్యక్తిత్వం రూపుదిద్దుకోవడంలో ప్రధాన పాత్ర వహించారు. ప్రధాన్‌లు గోండుల కవులు, గాయకులు, పురోహితులు. వీళ్ళు గోండురాజుల వీరగాథలను గోండు సంస్కృతిని, ఆచార వ్యవహారాలను గేయాలుగా కట్టి ఆలపించేవారు. భీమ్ భిలాల్ సింగ్, భీమ్ భిలాల్‌షా, కేసరిసింగ్, రామ్ సింగ్ ధ[illegible]ర్, అంకంరాజు కథలు భీమ్‌ని వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దాయి. భీముని విశేషంగా ఆకర్షించి, అతనికి ప్రేరణనిచ్చిన పోరాటం రామ్‌జీ గోండుది.

గోండులనూ కోలామ్‌లను బతకనిచ్చేట్లు లేరనే కసి భీములో పేరుకుపోతూ వచ్చింది. దాంతో అసహనం, తెగింపు అతనిలో చోటు చేసుకున్నాయి. చిన్నప్పటి నుంచే ధైర్యసాహసాలు ప్రదర్శిస్తూ వచ్చాడు. తన సందేహాలను తీర్చుకోవడానికి వదిన కుకూబాయిని అడుగుతూ ఉండేవాడు. కానీ, ఆమె చెప్పే సమాధానాలు సంతృప్తిని ఇచ్చేవి కావు. కుకుబాయి భీము పెద్దన్న సోము భార్య.

కౌమారదశలోనే భీము చాలా బలిష్టంగా తయారయ్యాడు. కోటు దీరిన ముక్కు, విశాలమైన నుదురు చూడగానే ఆకర్షించే విధంగా ఉండేవాడు. శారీరకంగా బలంగా రూపుదిద్దుకుంటూ వచ్చాడు. చిన్నప్పటి నుంచే ధైర్యసాహసాలు ప్రదర్శిస్తూ వచ్చాడు.

వదిన చెప్పిన కొన్ని సంఘటనలు కూడా భీము వ్యక్తిత్వాన్ని రూపుదిద్దినట్లు కనిపిస్తాయి. తన తల్లిగారింటి వద్ద ఎలుగుబంటితో పోరాడిన జంగుదాదా గురించి చెబుతుంది. అడవి జంతువులతో గిరిజనులు నిత్యం పోరాడాల్సి వచ్చేది. అడవి జంతువుల నుంచి పంటలను కాపాడుకోవాల్సి వచ్చేది. విప్పపూలు ఏరడం గిరిజనులకు ప్రధానమైన కార్యకలాపం. విప్పపూలు ఏరడానికి వెళ్లినప్పుడు ఎదురయ్యే జంతువుల నుంచి తప్పించుకోవాల్సి వచ్చేది.

ఆ కథను భూపాల్ తాను పిల్లల కోసం రాసిన తన కొమురం భీము నవలలో వివరించారు. ఆ కథ ఇలా ఉంది - ఓ ఉదయం పూట అందరి మాదిరిగానే జంగు దాదా కూడా విప్పపూలు ఏరడానికి అడవికి వెళ్లాడు. అక్కడ లొద్దికి తూర్పున విప్ప చెట్టు కింద పూలు ఏరుతున్నాడు. ఎలుగుబంటి దగ్గరగా వచ్చేంత వరకు జంగుదాదా చూడలేదు. దగ్గరగా ఎలుగుబంటిని చూసి వణికిపోయాడు. వీపును గోర్లతో గీరసాగింది. చేసేది లేక అతను ఎదురు తిరిగాడు. చేతిలో ఉన్న కర్రతో బాదాడు. దాంతో మరింత ఆగ్రహంతో దాడికి దిగింది. దాని కోపం గుర్తించి జంగుదాదా

పరుగు లంకించుకున్నాడు. అలా పరుగెత్తి ఓ చెట్టు ఎక్కాడు. అయినా అది వదిలిపెట్టలేదు. పైకి పాకే ప్రయత్నం చేయసాగింది. అది గమనించి జంగుదాదా ఓ కొమ్మ మీదుగా పాకి కిందకు దూకాడు. చెట్టుపైకి పాకుతున్న ఎలుగు బంటి ముందటి రెండు కాళ్లను పట్టుకున్నాడు. ఒక వైపు జంగు దాదా, మరో వైపు ఎలుగుబంటి, మధ్యలో చెట్టు. రెండు చేతులతో దాన్ని చెట్టుకేసి గుద్దసాగాడు. అది ప్రతిఘటిస్తూనే ఉన్నది. చెట్టుకు తల గుద్దుకుని ఎలుగుబంటి నోట్లోంచి రక్తం కారసాగింది. ఇంతలో ఊళ్లోంచి చాలా మంది కర్రలతో వచ్చారు. దాన్ని వెనక నుంచి కొట్టసాగారు. జంగుదాదా దాన్ని వదిలిపెట్టాడు. అది తన పళ్లతో అందరినీ భయపెట్టి అడవిలోకి పారిపోయింది.

ఎలుగుబంటి వస్తే అన్నయ్య కొట్లాడుతాడా అని భీము అడిగితే ఎందుకు కొట్లాడడు, కొట్లాడుతాడు. నువ్వు కూడా కొట్లాడగలవు అని చెబుతుందట.

భీము ధైర్యసాహసాలను చెప్పడానికి మరో కథ కూడా చెప్తారు. దీన్ని అల్లం రాజయ్య, సాహు తమ కొమురం భీము నవలలో రికార్డు చేశారు. చిన్నన్న బొజ్జు, భీము పంటకు కావలిగా ఓ మంచె మీద పడుకుని ఉంటారు. కాపురం పెట్టడంతో సోము వేరేచోటికి వెళ్లిపోతాడు. సోము భార్యనే కొమురం భీము వదిన కుకూబాయి. తెల్లవారడానికి రెండు జాములుందనగా మంచె వద్ద చప్పుడవుతుంది. దాంతో భీముకు నిద్ర చెదిరిపోయింది. మంచె మీది నుంచి చప్పుడవుతున్న వైపు చూశాడు. భీము అడవి దద్దరిల్లేట్లు అరిచాడు. రేకుపీపాను తీసుకుని బాదాడు. కొద్ది సేపటికే అన్ని మంచెల వద్ద మొత్తుకోళ్లు... కొమురం భీము మంచె దిగి చప్పుడవుతున్న వైపు పరుగు తీశాడు. అడవి పందుల గుంపు జొన్నచేనులో పడింది. భీము ఓ అడవి పంది వెంట పడ్డాడు. సోము గొడ్డలితో పరుగెత్తుకొచ్చాడు. భీము వెంట పడడంతో అడవి పంది అడవిలోకి పరుగెత్తింది. తీగలను, పొదలను తప్పించుకుంటూ రాళ్లు తాకినా లెక్క చేయకుండా దాన్ని వెంబడించాడు.

అడవి పంది అలసిపోయి పరుగెత్తలేక పడిపోయింది. అది లేవబోయే సరికి ఈటెను దాని పక్కలోకి గుచ్చాడు. ఈటతో దాన్ని పొడుస్తూ పోతాడు. పంది రక్తం చిమ్మిచ్చి కొడుతుంది. అది తాకి ఉంటే భీము పడిపోయి ఉండేవాడే. కానీ ఒడుపుగా తప్పించుకుంటాడు. దాని నుంచి ఒడుపుగా తప్పించుకుంటూ దాడి సాగిస్తుంటాడు. ఇంతలో అన్న సోము అక్కడికి చేరుకుంటాడు. అన్నదమ్ములిద్దరు కలిసి దాన్ని చంపేస్తారు. దాంతో ఆ అడవిపంది మాంసంతో గూడెం పండుగ చేసుకుంటుంది. కొమురం భీము పట్టుదలను, ధైర్యసాహసాలను, తెగువను చెప్పడానికి ఈ కథను చెప్తారు.

## పూర్వరంగం

నిజానికి, ఆదిలాబాద్ జిల్లాలోని గోండులు, కోలామ్‌లు ఎప్పుడు కూడా ఒక రాజ్యభావనలో ఇమిడిలేరని, పోడు వ్యవసాయం చేసుకుంటూ, అటవీ సంపదపై ఆధారపడి జీవించే స్వేచ్ఛాప్రియులని అంటారు. అయితే, గోండ్వానా రాజ్యం ఒకటి ఉండేదని డా॥ సుంకిరెడ్డి నారాయణ రెడ్డి చెబుతూ దాని గురించి వివరించారు (తెలంగాణ చరిత్ర).


ఐతరేయ బ్రాహ్మణంలో ఆంధ్రజాతితో పాటు పేర్కొన్న పుళిందులే గోండులు వ్యవహరింప బడుతున్నారని ఆయన చెప్పారు. బస్తర్, మహారాష్ట్ర జిల్లాలతో పాటు ఆదిలాబాద్ జిల్లాలో వీరు వ్యాపించి ఉన్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని సిర్పూర్, ఆసిఫాబాద్, ఉట్నూరు, చెన్నూరు ప్రాంతాలు గోండ్వానా రాజ్యంలో అంతర్భాగాలుగా ఉన్నాయి.

గోదావరి–చంబల్ లోయ ప్రాంతాన్ని గోండు రాజులు పాలించారు. ఈ గోండ్వానా గురించి లూసీ స్మిత్, గెజిటీర్ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్, ఆదిలాబాద్ పుస్తకం (పేజీ 23)లో క్రీ.శ. 870 నుంచి సుమారు తొమ్మిది శతాబ్దాలు పాలించారని తెలిపాడు. ఈ రాజులు క్రీ.శ. 1750 వరకు గోండ్వానాని పాలించినట్లు ఆధారాలున్నాయి. క్రీ.శ. 1240 నుంచి 1751

వరకు పాలించిన ఇరవై మంది రాజుల వివరాలను కూడా ఆ గెజిట్‌లో ఇచ్చారు.

## కొమురం భీము తిరుగుబాటుకు పూర్వం..

మొగలు చక్రవర్తి ఔరంగజేబు మరణం తర్వాత గోండు రాజులు మొగలులను ధిక్కరించి కప్పం కట్టడం ఆపేసి, స్వతంత్రంగా వ్యవహరించారు. ఆ తర్వాత ఇది కొంత బ్రిటిష్ ప్రత్యక్ష ఏలుబడిలోనూ మరికొంత నైజాం రాజ్యంలోనూ ఉన్నట్లు తెలుస్తున్నది. బ్రిటిష్, నైజాం ప్రభుత్వాలపై సాగిన 1860ల నాటి రాంజీ గోండ్ తిరుగుబాటు ప్రభావం కొమురం భీము ఉద్యమం మీద ఉందని చెప్పవచ్చు.



**రాంజీ గోండును ఉరితీసిన ఉరులమర్రి** (పులుగు శ్రీనివాస్ నవల నుంచి)

అప్పుడు సిర్పూర్, ఆసిఫాబాద్, చెన్నూరు, లక్సెట్టిపేట, ఉట్నూర్, *ోథ్, తదితర ఏజెన్సీ ప్రాంతాలు బ్రిటిష్ దమనకాండతో అల్లకల్లోలంగా మారాయి. అప్పుడు వారి రాజు రాంజీ గోండు నాయకత్వంలో గోండులు యుద్ధవీరులుగా మారారు. బరిసెలు, బాణాలు, కర్రలు, కత్తులు, రాళ్ల రప్పలు వారి ఆయుధాలు అయ్యాయి. బ్రిటిష్ సైనికులపై తిరుగుబాటు చేశారు. అయితే, తుపాకులతో యుద్ధం చేయడం వల్ల బ్రిటిష్ సైనికులదే పైచేయి అయింది. గోండులు ఎంతో మంది ఈ తిరుగుబాటులో ప్రాణాలు అర్పించారు.

తమపై తిరుగుబాటు చేసిన రాంజీ గోండును బ్రిటిష్ సైనికులు బంధించారు. అతన్ని ఆదిలాబాద్ జిల్లాలోనే నిర్మల్‌కు తరలించారు. అతనితో పాటు ప్రతి గోండు వీరుడిని చెర పట్టారు. బ్రిటిష్ అధికారాన్ని, నిజాం

పాలనను ఎదిరించినందుకు జనగాం (ఆసిఫాబాద్) గోండు రాజూ రాంజీ గోండును మర్రి వృక్షానికి ఉరి తీశారు. అతనితో పాటు అతని సైనికులను కూడా ఆ వృక్షానికే ఉరి తీశారు. ఆ చెట్టుకు ఉరుల మర్రి అని పేరు పడింది. ఆ రాంజీ గోండు తిరుగుబాటు తర్వాత గిరిజనుల పోరాట స్ఫూర్తిని కొమురం భీము ఆధ్వర్యంలోని గిరిజనుల్లో చూస్తాం.

## అటవీ ప్రాంతాల్లో సమస్యలు..

1917లో భూ సంరక్షణ చట్టం రావడానికి ముందే షావుకార్లు ఆ ప్రాంతానికి చేరుకున్నారని ముందే అనుకున్నాం. గోండులు కోలామ్‌ల నుంచి వారి ఉత్పత్తులు కొంటూ ఉండేవారు. ఈ క్రమంలోనే గోండులకు కోలామ్‌లకు మైదానం ప్రాంతంలోని సరుకులను పరిచయం చేస్తూ వచ్చారు. తద్వారా విపరీతమైన దోపిడీ సాగించేవారు. ఈ సంపదకు జనగామ (ఆసిఫాబాద్) కేంద్రంగా ఉండేది.

భీముకు తెలివి వచ్చే నాటికే షావుకార్లు అప్పులు ఇవ్వడం, అప్పుల కింద కల్లం నుంచే గోండులు పండించిన పంటలను కొలుచుకుని పోవడం, అడవి నరికి వ్యవసాయం చేస్తే కేసులు పెట్టి కోర్టుల చుట్టూ తిప్పడం, అడవి ఉత్పతులను సేకరిస్తే జరిమానాలు వేయడం వంటివి అమలులోకి వచ్చాయి. జంగ్లాతోళ్లు (అటవీ శాఖ సిబ్బంది) గోండులను, కోలామ్‌లను హింసించడం సాగుతూ వస్తున్నది.

తమ మేకల కోసం చెట్ల మండలు నరికినప్పుడు జంగ్లాతోళ్ల చేతిలో శారీరకంగా, మానసికంగా కొమురం భీము పడిన సంఘర్షణ ఇంతా అంతా కాదు. తనకు అత్యంత సన్నిహిత మిత్రుడు కొండల్, జంగు, కొమురం భీము మేకలను మేపుతున్నప్పుడు జంగ్లాతోళ్లు వస్తారు. మేకలను, ఆ ముగ్గురుని తీసుకుని వెళ్తారు. మేకలను బందెల దొడ్డిలో పెడతారు. పిల్లలను హింసిస్తారు. కొమురం భీము తండ్రి చిన్ను, చిన్నాయనలు కుర్దు, యేసూ వచ్చి మేకల పుల్లరి, గడ్డి పన్ను, నాగలిపట్టి, మంచెపట్టి చెల్లించడానికి అంగీకరిస్తారు.

ఇలా పన్నులు కడుతూ, జంగ్లాతోళ్లకు లంచాలు ముట్టజెప్పి తమ పనులు సాగించుకోవడానికి గోండులు యాతనలు పడుతూ వస్తున్నారు. గూడెం పటేల్‌గిరి కొమురం భీము తండ్రి చిన్ను చేతిలోనే ఉంది. పటేల్ ఏ సమస్యలు వచ్చినా ముఖాసీలకు తెలిపి పరిష్కరించుకోవడం పరిపాటి. ముఖాసీల చేతుల కింద వందల గూడేలు ఉంటాయి.

కొమురం భీము తండ్రి చిన్ను విషజ్వరంతో మరణించిన తర్వాత ఆ జ్వరంతోనే మరో వారం రోజుల్లో ముగ్గురు చనిపోయారు. గూడెం ప్రజలు ఆకలి బాధతో అలమటిస్తున్నారు, విషజ్వరం భయం పట్టుకుంది. చిన్ను చనిపోయిన తర్వాత అతని కుటుంబం సంకెనపల్లి గూడేన్ని వదిలేసింది. వాళ్లు జనగాం, ధనోరా దాటి సుర్దాపూర్ చేరుకున్నారు. అక్కడ చెట్లు నరికి వ్యవసాయం చేశారు. ఆ స్థితిలోనే పట్టేదారు పేరు మీద వచ్చిన సిద్ధిఖి సంఘటన కొమురం భీము జీవితాన్ని మలుపు తిప్పుతుంది.

## సిద్ధిఖి హత్యోదంతం

కొమురం భీము కుటుంబం చెట్లు నరికి సాగు చేసుకుంటున్న భూమి సిద్ధిఖి అనే వ్యక్తిదంటూ పట్వారీ లక్ష్మణరావు అతన్ని తీసుకుని వస్తాడు. గూడెంలోకి వచ్చీ రావడంతోనే సిద్ధిఖి ఏదో అధికారం ఉన్నట్లుగా ఓ ఇంట్లోకి చెప్పులతో సహా దూరిపోయాడు. చెప్పులతో ఇంట్లోకి వెళ్లడం గోండు తెగలో తప్పు. అయినా వారు సహించారు. మీరు దున్నిన భూములన్నీ సిద్ధిఖీవే అని లక్ష్మణరావు వారితో అన్నాడు. దాంతో వారి గుండెల్లో రాయి పడింది. కౌలు ఇవ్వాలని చెప్పాడు. తాము ఇంత కాలం పని చేసి, సాగు యోగ్యం చేసుకున్నామని, కౌలు ఇచ్చేది లేదని చెప్పారు. దీంతో సిద్ధిఖి కోపంగా బయటకు వచ్చాడు. అయితే, వెంటనే ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని, పంట తనదే అని అన్నాడు. తన అనుచరులను వెంటేసుకుని వచ్చిన సిద్ధిఖి గట్టిగానే ఉన్నాడు. ఇదంతా కొమురం భీము గమనిస్తూనే ఉన్నాడు. తాము భూమిని వదిలేది లేదని అనడంతో సిద్ధిఖి కుర్దుపై చేయి చేసుకున్నాడు. దాంతో

గోండులు, కోలాములు సిద్దిఖి మనుషులపై తిరగబడ్డారు. దొమ్మీ జరుగుతున్న జరుగుతోంది.

ఈ సందర్భంలో సిద్దిఖి వైపు యేసు లట్టుతో కొట్టడానికి వెళ్తుండగా, సిద్దిఖి బందూక్ తీసి కాల్చబోయాడని, ఆ సమయంలో కొమురం భీము తన వద్ద ఉన్న లట్టుతో సిద్దిఖిని వెనక నుంచి కొట్టాడని, దాంతో సిద్దిఖి మరణించాడని ఓ కథనం ఉండగా (కొమురం భీము నవల - అల్లం రాజయ్య, సాహు), తన వద్ద ఉన్న కర్రతో దొంగచాటుగా సిద్దిఖిని కొట్టబోయాడని, అది గమనించి కొమురం భీము ఓ చేత్తో సిద్దిఖిని పట్టుకుని, మరో చేత్తో కర్రను లాక్కున్నాడని, దాంతోనే సిద్దిఖిని కొట్టాడని, దాంతో సిద్దిఖి చనిపోయాడని మరో కథనం ఉంది (కొమురం భీము - పిల్లల నవల, భూపాల్). ఏమైనా, కొమురం భీము చేతిలో సిద్దిఖి మరణించాడు. దీంతో భయపడిపోయి సిద్దిఖి మనుషులు, పట్వారీ పారిపోయారు. అయితే తర్వాత ఎదురయ్యే పరిణామాలను ఊహించుకొని భయంతో గూడెం చెల్లాచెదురైంది. అయితే, సిద్దిఖి మరణించకపోతే కచ్చితంగా యేసు చనిపోయి ఉండేవాడు. నిజానికి, సిద్దిఖిని చంపాలనేది భీము ఉద్దేశం కాదు. సిద్దిఖి దాడి నుంచి తన చిన్నాయను కాయడమే అతని ప్రతిక్రియ ఉద్దేశ్యం. కానీ, అనుకోని సంఘటన జరిగిపోయింది.

సిద్దిఖి తన చేతుల్లో మరణించడంతో భీము భయంతో వణికిపోయాడు. ఏం చేయాలో పాలు పోలేదు. ముందు అక్కడి నుంచి పారిపోయాడు. ఎటు వెళ్లాలో తెలియదు. తనను పోలీసులు పట్టుకుంటే ఏమవుతుందోననే భయం. కొండలు, కోనలు, చెట్లు పుట్టలు దాటి తాము అంతకు ముందు నివాసం ఉన్న సంకెనపల్లికి చేరుకున్నాడు. తన మిత్రుడు కొండల్‌ను కలుసుకున్నాడు. చేలో ఉన్న కొండల్‌ను కలుసుకున్న తర్వాత కాస్త భయం తగ్గింది. కొండల్ భీమును చూసి ఆశ్చర్యపోయాడు. కుటుంబ సభ్యుల గురించి ఆరా తీశాడు. అప్పుడు కొమురం భీము జరిగిందంతా మిత్రుడితో చెప్పాడు. తన మిత్రుడు ఆకలితో ఉన్నాడని గమనించిన కొండల్

పాలకంకులు విరిచి వాటిని కాల్చిన పలుగు రాళ్లతో వేయించి ఇచ్చాడు. వాటిని భీము ఆబగా తిని ఆకలి కొంత తీర్చుకుని కుదుట పడ్డాడు.

భీము సిద్దిఖిని చంపిన విషయం మర్నాటికల్లా దావానలంలా అన్ని గూడేలతో పాటు సంకెనపల్లికి కూడా పాకింది. అంతటా అదే చర్చ. ఈ స్థితిలో కొండల్ తండ్రి ముత్తు భీమును చూసి భయపడ్డాడు. తమ మీదికి ఏమైనా వస్తుందేమోనని ఆందోళన చెందాడు. ఇక్కడి నుంచి భీమును వెళ్లిపోవాలని చెప్పు అని కొడుకుకు చెప్పాడు. ఏం చేయాలో తోచక భీము తీవ్రమైన ఆలోచనలో పడ్డాడు. అప్పుడు తండ్రి చిన్ను చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి.

ఏదైనా సమస్య ఉంటే భారీలొద్దిలో ముఖాసీ ఉంటాడు, చెప్పుకోవాలని తన తండ్రి తాను మరణించే సమయంలో చెప్పాడు. దాంతో విషయం కొండల్‌కు చెప్పి బయలుదేరడానికి సిద్ధమయ్యాడు. అతనితో పాటు వెళ్లడానికి కొండల్ సిద్ధపడ్డాడు. తండ్రి వారించినా కొండల్ వినలేదు. ఇద్దరు మిత్రులు రోజుల తరబడి నడక సాగిస్తూ తమకు ఎదురైనవారిని భారీలొద్దు గురించి అడుగుతూ ప్రయాణం సాగించారు. చివరకు భారీలొద్దులోని ముఖాసీ ఇంటికి చేరుకున్నారు.

ముఖాసీకి తాను ఉండే పెద్ద పెంకుటిల్లు కాకుండా, మరో రెండు పెంకుటిల్లు ఉన్నాయి. ఒకదానిలో అధికారులు వచ్చినప్పుడు ఉంటారు. పెద్ద కొట్టాలుంటాయి. ఒకదానిలో పెద్ద ఆవుల మంద ఉంటుంది. మరో దానిలో మేకల మంద ఉంటుంది. అంత పెద్ద యెత్తున అవులను భీము ఒక చోట చూడడం అదే మొదటిసారి. చిన్న పెంకుటిండ్లు కూడా విడిగా ఉన్నాయి. వాటిలో ధాన్యం నిల్వ ఉంచుతారు. అంత పెద్ద ఇండ్లను, హడావిడిని, ఆర్భాటాన్ని భీముగానీ, కొండల్ గానీ అంతకు చూడలేదు. చాలా మంది పాలేర్లు పనులు చేస్తున్నారు. గోండులు ఇద్దరు ముగ్గురు భార్యలను చేసుకోవడమే

మహా ఎక్కువ, ఆ ముఖాసీకి పన్నెండు మంది భార్యలు. బహుశా, ఎంత మంది భార్యలు ఉంటే అంత పెద్ద స్థాయి ఉన్నట్లు కావచ్చు.

ఎప్పటికో గానీ ముఖాసీ దర్శనం కాలేదు. భీము విషయమంతా ముఖాసికి చెప్పాడు. అయితే, ముఖాసీ ఏమీ పరిష్కారం చూపలేకపోయాడు. ధనోరా నుంచి వచ్చిన అధికారులు తనకు ఆ విషయం ఇది వరకే చెప్పారని ముఖాసీ అంటాడు. పైకాజీలు (వెలమలు, బ్రాహ్మలు, అరబ్బీలు) సర్కారుకు నజరానాలు ఇచ్చి పట్టాలు చేయించుకుంటున్నారని, గోండోల్లను సర్కారువారు నమ్మడం లేదని, తాను ఏమీ చేయలేనని ముఖాసీ చెబుతాడు. పైగా, సిద్దిఖీని చంపినందుకు ఒక వైపు పట్టేదార్లు, మరో వైపు ప్రభుత్వం కోపంగా ఉన్నట్లు ముఖాసీ అన్నాడు. మళ్లీ సూర్దాపూర్ వెళ్లొద్దని భీముకు సలహా ఇచ్చాడు.

తమకు పెద్ద దిక్కు అని నమ్మి వస్తే తన చేతుల్లో ఏమీ లేదని ముఖాసీ దులిపేసుకోవడం భీముకు కోపాన్ని రగిలిస్తుంది. 'మీరు ముఖాసీలు. నూరు గ్రామాలు మీ చేతుల్లో ఉంటాయి. మీరు సరేనంటే అన్ని గ్రామాల వాళ్లను జమ చేస్తాం. తెల్లబట్టలవాళ్లు లేకుండా చేస్తాం. రాంజీ గోండులా యుద్ధం చేద్దాం' అని అంటాడు భీము. 'వద్దు.. నువ్వు ఇంకా చిన్నపిల్లవాడివి. నీకు తెలియదు' అంటాడు ముఖాసీ. తీవ్రమైన నిరసనతో భీము కొండల్‌తో కలిసి వెనుదిరిగాడు. దాంతో ఇద్దరు బయటపడి అడ్డదిడ్డంగా తమకు ఎదురైన మార్గమల్లా తొక్కుతూ ప్రయాణం సాగించారు. గమ్యం లేదు. ఎటు పోతున్నామనే ఎరుక లేదు. అలా నడుస్తూనే ఉన్నారు.

## మిత్రుడితో బలర్షా చేరిన భీము

నైజాంలోంచి మహారాష్ట్రలోకి అడుగు పెట్టారు. ప్రజల కట్టుబొట్లు మారాయి. భాష మారింది. మధ్యలో కనిపించిన ఊళ్లు దాటుకుంటూ, మధ్య మధ్యలో పనులేవో చేస్తూ కడుపును చల్లబరుస్తూ ప్రయాణం సాగిస్తూ బాలర్షా చేరుకున్నారు. మేడలు, మిద్దెలు, దుకాణాలు, ప్రజల సందడి చూసి మిత్రులిద్దరూ తెగ ఆశ్చర్యపోయారు. ఇటువంటి నగరాన్ని వాళ్లు ఇంతకు

ముందు చూడలేదు. చివరకు అక్కడి రైల్వే స్టేషనుకు చేరుకున్నారు. బాలర్షాలో పగలంతా చిన్న చితకా పనులు చేస్తూ రాత్రి రైల్వే స్టేషనుకు చేరుకుని నిద్రపోవడం వారికి దినచర్యగా మారింది. కొండల్ బాగానే నిద్రపోయేవాడు కానీ భీముకు నిద్ర పట్టేది కాదు. జంగ్లాతోళ్ల ఆగడాలు, పట్టాలు తమవేనంటూ పట్వారీలతో వచ్చే పెద్ద మనుషుల దుష్టవ్యవహారాలు గుర్తుకు వచ్చి గుండె కుతకుత ఉడికిపోతుండేది. అలా బలర్షాలో నెలకు పైగానే గడిచిపోయింది.

కొమురం భీముకు ఓ వైపు విసుగ్గా ఉంది, మరో వైపు తాను కష్టాల పాలు కావడమే కాకుండా మిత్రుడిని కూడా ఇబ్బందుల పాలు చేశానని బాధగా ఉంది. రోజూ రాత్రి పూట చివరి రైలు వెళ్లిపోయిన తర్వాత స్టేషన్‌కు చేరుకునేవారు. ఓ రోజు వారు స్టేషన్ చేరుకునే సరికి రాత్రి పూట రైలు రాలేదు. ఆ రోజు ఎందుకో ఆలస్యంగా వచ్చింది. ఏమీ ఆలోచించకుండా ఇద్దరూ రైలు ఎక్కేశారు. రైలు ఊయలలా ఊపుతుంటే వాళ్లు నిద్రపోయారు. రైలు ప్రయాణం వారికి కొత్త అనుభవం. కొత్తగా, గమ్మత్తుగా అనిపించింది. రైలు ఆగి అందరూ దిగుతుంటే వారూ దిగారు. టికెట్ కలెక్టర్ (టిసి) టికెట్లు అడిగితే తెల్లమొహం వేశారు. అతను ఏం అడుగుతున్నాడో కూడా వారికి అర్థం కాలేదు. చివరకు అర్థం చేసుకుని తమ వద్ద డబ్బులు లేవని చెప్పారు. దాంతో టిసి వారిని పోలీసులకు అప్పగించాడు. పోలీసులు వారి జేబులన్నీ వెతికారు. చిల్లిగవ్వ లభించలేదు. మీరెవరంటూ అడిగితే గోండులమని చెప్పారు. దాంతో ఓ రెండు దెబ్బలేసి వారిని పోలీసులు వదిలేశారు. అలా వారు చాందాలో కాలు పెట్టారు. కొత్త లోకంలోకి వచ్చి పడ్డారు. ఇక్కడే కొమురం భీము జీవితంలో మౌలికమైన మార్పు వచ్చింది.

## రహస్య ఉద్యమకారుడు విటోభాతో సాహచర్యం

ఇంతలో తమతో ప్రయాణం చేసిన ఓ ప్రయాణికుడు తనతో తెచ్చిన వస్తువులను మోయలేక ఇబ్బంది పడుతున్నాడు. వీటిని మోసుకొస్తారా అని

అతను కొమురం భీమును, కొండల్‌ను మరాఠీలో అడిగాడు. అప్పటికే బలర్షాలో కొమురం భీముకు మరాఠీ అర్థం చేసుకోవడం వచ్చింది. సరేనన్నాడు భీము. వారిద్దరూ మూటలు మోస్తూ ఆ వ్యక్తి ఇంటికి చేరుకున్నారు. అక్కడ చాలా మంది ఉన్నారు. ఏవేవో పనులు చేస్తూ ఉన్నారు. ఓ పెద్ద యంత్రాన్ని ఓ వ్యక్తి తిప్పుతూ, కాగితాలు పెడుతూ తీస్తున్నాడు. అది అచ్చు యంత్రమని భీముకు అప్పటికి తెలియదు. మూటలు దించిన తర్వాత వారికి కొంత డబ్బు ఇచ్చాడు. ఆ 'వ్యక్తిన దాంతో వారు అక్కడికి దగ్గరలో ఆ డబ్బుతో ఆహారం తినేసి ఎటు వెళ్లాలో తెలియక అక్కడే తిరగసాగారు. మళ్లీ వచ్చిన ఆ ఇద్దరిని చూసి తమతో మూటలు మోయించిన వ్యక్తి పలకరింపుగా నవ్వాడు. అచ్చు యంత్రాన్ని అలా చూస్తూ ఉండిపోయిన కొమురం భీము దాన్ని తిప్పడం పెద్ద పనేం కాదని భావించి, ఆ పని మాకిస్తారా అని అడిగాడు. అదే సమయంలో చక్రం తిప్పుతున్న వ్యక్తి అలసిపోవడంతో భీము దాన్ని అందుకున్నాడు. పని చాలా త్వరగా ముగిసింది. భీము బలిష్టమైన శరీరం, చురుకైన చూపులు గమనించి పనికి పెట్టుకుంటే బాగానే ఉంటుందని అనుకున్నాడతను.

తన పేరు విటోభా అని, పని ఇవ్వగలనని, అయితే ఎక్కువగా ఇచ్చుకోలేనని చెప్పాడు. తాము చాలా దూరం నుంచి వచ్చామని, తమకు కడుపు నిండితే చాలునని భీము చెప్పాడు. అలా పనిలో కుదిరారు ఇద్దరు. తమతో మూటలు మోయించిన విటోభాతో ఆ విధంగా భీముకు అనుబంధం ప్రారంభమైంది. ఆ రోజు ప్రెస్ మూసేసిన తర్వాత మిత్రులు ఇద్దరు అందులోనే పడుకున్నారు. అర్ధరాత్రి కొండల్ భీమును నిద్రలేపాడు. పొద్దుటి నుంచి కొండల్ ఏమీ మాట్లాడకపోవడం భీము కనిపెడుతూనే ఉన్నాడు. భీము మిత్రుడి కళ్లలోకి చూశాడు. అతను ఏడుస్తున్నాడు. ఏడుస్తున్నావా అంటూ భీము ప్రశ్నించేసరికి అతనిలో దుఃఖం కట్టలు తెంచుకుంది. భీమును పట్టుకుని బోరున ఏడ్చాడు.

తనకు ఇక్కడ ఉండాలని లేదని, సంకెనపల్లి వెళ్లాలని ఉందని కొండల్ చెప్పాడు. ఏం చేయాలో భీముకు మొదట తట్టలేదు. దాంతో కొండల్‌ను తిరిగి పంపించడం ఎలా అనే ఆలోచనలో పడతాడు అతను. భీము ఆలోచనను పసిగట్టి బలర్షా వరకు పంపిస్తే ఆ తర్వాత తాను ఒక్కడినే వెళ్లగలనని కొండల్ చెప్పాడు. తెల్లారి లేచిన దగ్గరి నుంచి తీరికే లేదు. అచ్చు యంత్రం నడుస్తూనే ఉన్నది. చివరకు సాయంత్రం కొండల్ విషయాన్ని భీము విటోభాకు చెప్పాడు. కొండల్ తన కోసం వచ్చాడని చెప్పాడు. తాను ఎందుకు గూడెం వదిలిపెట్టాల్సి వచ్చిందో వివరంగా చెప్పాడు. ప్రెస్ మూసేసే సమయంలో విటోభా వచ్చి కొండల్‌ను ఎలా పంపించాలో మాట్లాడాడు. మర్నాడు తాను అటు వెళ్లే పని ఉందని, బాలర్షాలో దింపుతానని విటోభా చెప్పాడు. మర్నాడు కొండల్ భీమును వదిలేసి తిరుగు ప్రయాణం కట్టాడు.

భీము ప్రెస్‌లో పనిచేస్తూ, అక్కడే రాత్రుళ్లు ఉండడం సాగించాడు. అయితే, తాను అచ్చేస్తున్న కాగితాల్లో ఏముందో తెలుసుకోవాలనే జిజ్ఞాస అతన్ని వెంటాడసాగింది. దీంతో భీము కాగితాలను అటూ ఇటూ తిప్పుతూ వాటిని పరిశీలనగా చూస్తూ ఉండేవాడు. దీంతో కొమురం భీముకు చదువుకోవాలనే ఆసక్తి ఉందని విటోభా గుర్తిస్తాడు. చదువుకుంటావా అని అడిగి, విటోభా ఆసక్తిని గమనించి భీముకు చదవడం, రాయడం నేర్పాడు విటోభా.

భీము వేషంలో అక్కడే మార్పు వచ్చింది. తెల్లటి పంచె, చొక్కా తొడుక్కుంటున్నాడు. మరాఠీ బాగానే వచ్చింది. అక్షరాభ్యాసం, ప్రెస్‌లో పని భీముకు తీరిక లేకుండానే ఉంది. అలా ఓ నెల రోజులు గడిచాయి. ఓ కాషాయ వస్త్రాలు ధరించిన వ్యక్తి విటోభా వద్దకు వచ్చాడు. ఆ రోజు రాత్రి పోలీసులు విటోభాను, కాషాయం ధరించిన వ్యక్తిని పట్టుకున్నారు. కొమురం భీమును కూడా తీసుకుని వెళ్లారు. పోలీసులు తాము పట్టుకున్న విటోభాను, కాషాయ వస్త్రధారిణి ఎటో తీసుకుని వెళ్లారు. వారిని ఎటు తీసుకుని వెళ్లారనే

విషయం భీముకు తెలియదు. ఎవరెవరో అక్కడికి వచ్చారో చెప్పాలంటూ భీమును రాత్రంతా ప్రశ్నించి, ఏ విధమైన సమాచారం రాబట్టలేక తెల్లవారు జామున వదిలేశారు. బ్రిటిష్ పాలకులపై సాయుధ తిరుగుబాటు కోసం రహస్యంగా పనిచేస్తున్న ఓ సంస్థలో విటోభా పనిచేస్తుండేవాడని దాన్ని బట్టి అర్థమవుతున్నది. విటోభా గానీ, కాషాయ వస్త్రధారి గానీ ఏ పార్టీ కోసం పనిచేసేవారో, వారు ఏమయ్యారో కొమురం భీముకు చివరి వరకు తెలిసినట్లు లేదు. ఉన్న ఆదరువు పోవడంతో ఏం చేయాలో తెలియక భీము రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు.

అస్సాం, తేయాకు తోటల్లో పని చేయడానికి వివిధ ప్రాంతాల నుంచి ఆ రోజుల్లో మనుషులను తీసుకుని వెళ్తుండేవారు. రికామీగా కనిపించేవారిని రైళ్లు ఎక్కించి తీసుకుని పోతుండేవారు. ఓ వ్యక్తి అలా మనుషులను తీసుకుని వెళ్తున్న వ్యక్తికి భీము రికామీగా కనిపిస్తాడు. దాంతో అతను దగ్గరకు వెళ్లి తనతో వస్తావా అని అడిగాడు. ఎక్కడని అడిగితే చెప్తాడు. సరేనంటాడు. దాంతో టికెట్ కొని మిగతా వాళ్లతో పాటు రైలెక్కించాడు. అలా కొమురం భీము చాయ్‌పత్తా దేశం (అస్సాం) చేరుకున్నాడు. అక్కడ తేయాకు తోటల్లో పని చేయడం ప్రారంభించాడు.

## చెల్లాచెదురైన కుటుంబం

సిద్ధిఖీ హత్యతో సూర్దాపూర్ గూడెం భయం గుప్పిట్లోకి వెళ్లిపోతుంది. అక్కడ ఉంటే అధికారుల తిప్పలు తప్పవని భావిస్తుంది. దీంతో సూర్ధాపూర్ నుంచి కొమురంభీము పారిపోయిన తరవాత ఆ కుటుంబం తలో దిక్కైంది. కొమురం భీము చిన్నాయన కుటుంబ సభ్యులు మరికొంత మంది కలిసి పట్టేదార్లు, జంగ్లాత్ వాళ్ళతో పడలేనని పంగడిలోని రాజుల సంతతికి చెందిన జంగబాబు వద్దకు వెళ్ళాడు. చంద్రాపూర్ గోండురాజ్యంగా ఉన్నప్పుడు అడవిలో [illegible] రాక్షసే. మహారాష్ట్రలోని పీష్వాలు బ్రిటీష్‌వాళ్ళపై పోరాటం చేసి ఓడిపోయారు. దాంతో జంగుబాబు తండ్రి చంద్రాపూర్

వదిలేసి పంగిడిలో స్థిరపడ్డాడు. కుర్దూ తనకు సాగుకు స్థలం చూపించాలని అడిగితే, తప్పదన్నట్లు అడవిని నరికి సాగు చేసుకుని తనకు కౌలు ఇవ్వాలని జంగుబాబు చెప్తాడు. చేసేది లేక కుర్దూ అందుకు అంగీకరిస్తాడు. జంగుబాబును ఒప్పించి కుర్దూ అడవి నరికి కౌలుకు సాగుచేయడం ప్రారంభించారు సగం పంటను జంగుబాబుకు ఇస్తూ కుటుంబాన్ని నడపసాగాడు.

ఇదిలా ఉంటే, కొమురంభీము మరో చిన్నాయన ఏసు ధనోరాకు చేరుకొని పాతపద్ధతిలోనే అడవులను నరికి సాగుచేయడం ప్రారంభించాడు. దీంతో అమీన్ సారేదారు, చౌకీదారువంటి అటవీ అధికారుల చేతుల్లో చిక్కి కేసుల పాలయ్యాడు. ఏసుతో పాటు అందరి మీద కేసులు బనాయించారు. చివరకు జంగ్లాతు వాళ్ళకు లంచాలు ఇస్తూ వ్యవసాయం కొనసాగించడం అనేదాన్ని ఏసు అలవాటు చేసుకున్నాడు. కేసుల కోసం కోర్టుల చుట్టూ తిరగక మాత్రం తప్పడం లేదు.

## అస్సాంలో కొమురం భీము

అస్సాం (చాయ్‌పత్తా దేశం) చేరుకున్న కొమురం భీము తేయాకు తోటల్లో పనిచేస్తూ నాలుగేళ్ళు గడిపాడు. ఈ సమయంలో భీముకు తెలుగు మాట్లాడే ఒక మన్నెదొరతో పరిచయం ఏర్పడింది. అతనే భీముకు అల్లూరి సీతారామరాజు నడిపిన మన్నెం పోరాటం గురించి చెప్పాడు. తాము ఎలా బ్రిటిష్ సైన్యంతో పోరాడిందీ చెప్పాడు. తుపాకులు ఉన్న సైన్యంతో గెరిల్లా యుద్ధం ఎలా చేశారో పూసగుచ్చినట్లు చెప్పాడు. దాన్నో సాహసగాథ మాదిరిగా మన్నెం దొర కథలు, కథలుగా చెప్పేవాడు. అక్కడే తుపాకులు గల సైన్యంతో సంప్రదాయ ఆయుధాలను ఉపయోగించుకోవాలో, ఆయుధాలను ఎలా సంపాదించుకోవాలో తెలిసి వచ్చింది భీముకు. అల్లూరి సీతారామరాజు వీరగాథ భీమును ఆకట్టుకుంది. ఆ తేయాకు తోటల్లో బెంగాల్ నుంచి వచ్చిన వాళ్ళు కూడా పనిచేస్తున్నారు. వారి ద్వారా భీముకి సంతాలుల

పోరాటం గురించి తెలిసింది. బ్రిటిష్‌వాళ్ళ వద్ద పనిచేసే వ్యక్తుల ద్వారా అప్పుడప్పుడు దేశంలో జరుగుతున్న పోరాటాల గురించి తెలుస్తూ ఉండేది.

తేయాకు, కాఫీ తోటల్లో బండ చాకిరి చేయించేవారు. మేస్త్రీలు కూలీలను శారీరకంగా హింసించేవారు. గుర్రాలపై తిరుగుతూ కూలీలను కొరడాలతో కొడుతూ ఉండేవారు. ఇటువంటి సందర్భంలోనే ఓసారి కూలీలు తిరుగుబాటు చేశారు. లభించిన సమాచారం ప్రకారం కూలీలు ఇద్దరు మేస్త్రీలను చితకబాదారు. ఈ విషయాన్ని మేస్త్రీలను యజమానికి చెప్పడంతో పోలీసులను పిలిపించాడు.

## అస్సాం నుంచి వెనక్కి...

పోలీసులు భీముతో సహా ఇరవై మంది కూలీలను అరెస్టు చేసి తీసుకుని వెళ్లారు. భీము నాలుగు రోజుల పాటు జైల్లో ఉన్నాడు. ఓ రోజు కొంత మంది సహాయంతో భీము జైలు గది కిటికీ ఊచలు వంచేసి బయట పడ్డాడు. ప్రహరీ గోడ దూకి రైల్వే స్టేషన్‌కు పరుగుతీసి గూడ్స్ రైలు డబ్బాలో తలదాచుకున్నాడు. తీవ్రమైన అలసట వల్ల నిద్ర పట్టేసింది. అది ఎప్పుడు కదిలిందో ఏమో గానీ భీముకు మెలుకువ వచ్చేసరికి బాలర్షా చేరుకుంది. బలార్షాలో మూటలు మోస్తూ కొంత కాలం గడిపేశాడు. దాదాపు ఐదేళ్లు అలా గడిచిపోయింది. తమ గూడేల వైపు భీము మనసు లాగింది. అక్కడి నుంచి బయలుదేరి రాజోరా మీదుగా అడవిలో కాలు పెట్టాడు. గూడేల్లో పడుకుంటూ నడక సాగించసాగాడు. ఈ క్రమంలోనే తన అన్నలు కాకన్‌ఘాట్‌లో ఉన్నట్లు ఓ గూడెంలో తెలిసింది. దాంతో కాకన్‌ఘాట్ వైపు దారి తీశాడు.

కాకన్‌ఘాట్ చేరుకున్న తర్వాత ఆరా తీసి తన అన్న సోము ఇంటికి వెళ్లాడు. గుడిసె ముందు వదిన కుకూబాయి కనిపించింది. వదిన వద్ద కొమురం భీముకు చిన్నప్పుడు చాలా చనువు ఉండేది. ఏ అనుమానం వచ్చినా, ఏదైనా తెలుసుకోవాలన్నా వదిననే అడిగేవాడు. అడవిలో సరుకులను కూడా వీరిద్దరే ఏరుకొచ్చేవారు. అప్పటి వదినకు ఇప్పటి వదినకు ఎంతో

తేడా కనిపించింది భీముకు. పూచిక పుల్లలాగా తయారైంది. ఎంతో వయస్సు మీరినట్లు కనిపించింది. ఇంట్లోకి వెళ్లగానే తల్లి కనిపించింది. భీమును గుర్తించి అతన్ని పట్టుకుని బోరున ఏడ్చింది.

భీము మాత్రం చాలా బలిష్టంగా తయారయ్యాడు. బహుశా అప్పటికి కొమురం భీముకు ఇరవై ఏళ్లు ఉండవచ్చు. కొమురం భీము 1901లో పుట్టాడని అంచనా వేస్తే, అతను 15 ఏళ్ల వయస్సులో ఉన్నప్పుడు సిద్దిఖీ చంపిన సంఘటన జరిగిందని అంచనా వేస్తున్నారు. మహారాష్ట్రల్లో అతను దాదాపు ఐదేళ్లు ఉన్నాడు. అంటే అతను అప్పటికి మంచి యవ్వనంలో ఉన్నాడు. పైగా, అతని వస్త్రధారణ మారింది. భీము మాత్రం కుకుభాయికి కొత్త మనిషిలా, ఎంతో ఎదిగినవాడిలాగా కనిపిస్తాడు కుకుబాయికి.

కుకుబాయి నుంచి వివరాలు తెలుసుకుని కొమురం భీము ఆ తర్వాత ఆ దగ్గరలోనే ఉన్న రెండో అన్న బొజ్జు ఇంటికి వెళ్తాడు. అక్కడి వాతావరణం హృదయవిదారకంగా ఉంటుంది. అప్పటికి బొజ్జు పెళ్లవుతుంది. అతనికి ఓ కొడుకు, కూతురు ఉంటారు. అనారోగ్యంతో బాధపడుతుంటాడు. అక్కడి వివరాలు, వారి పరిస్థితిని తెలుసుకుంటాడు భీము. ఆ తర్వాత తాను ఎక్కడెక్కడ తిరిగింది, ఏమేం చేసింది అన్నీ అన్నలకు వివరిస్తాడు. దాంతో దేశాలు పట్టి తిరగకుండా, జీవితంలో ఇప్పటికైనా స్థిరంగా ఉండడానికి దేవడలోని లచ్చువపటేల్ వద్ద ఉద్యోగానికి కుదురుకోవాలని అన్నలు సలహా ఇస్తారు. మొదట ఇష్టం లేకపోయినా, ఏం చేయాలనేది కూడా నిర్ణయించుకోలేదు కాబట్టి అందుకు అంగీకరిస్తాడు. సోము లచ్చువ పటేల్‌తో మాట్లాడి అక్కడ పనికి పెట్టిస్తాడు కొమురం భీమును.

కొమురం భీముకు ఉర్దూ కూడా రావడం తనకు కలిసి వస్తుందని లచ్చువపటేల్ అనుకున్నాడు. పైగా లోకజ్ఞానం కూడా అలవడింది. తెలుగు, మరాఠీ, ఉర్దూ భాషలను కొమురం భీము మహారాష్ట్రలో ఉండగానే మాట్లాడడం నేర్చుకున్నాడు. లచ్చువపటేల్ సాగులో భీము చాలా మార్పులు తీసుకుని వచ్చాడు. పత్తి, మిర్చి వంటి కొత్త పంటలను పరిచయం చేశాడు. నాటిని

జనగాం (ఆసిఫాబాద్) వెళ్లి మార్కెట్లో అమ్ముకురావడం వంటి వ్యవహారాలన్నీ భీము చేసేవాడు.

భీము వ్యవహార నిర్వహణపై నమ్మకం ఏర్పడిన లచ్చువ పటేల్ ఓ కార్య నిర్వహణను అతనికి అప్పగించాడు. గతంలో లచ్చువపటేల్ అడవి నరికించి 12 ఎకరాలు సాగు చేయిస్తాడు. దాంతో అమీన్ లచ్చువ పటేల్‌పై కేసు పెడతాడు. ఆ కేసును మాఫీ చేయించే పనిని లచ్చువపటేల్ భీముకు అప్పగిస్తాడు. లోలోపల బిడియపడుతూనే ఓ రోజు భీము జనగామ వెళ్లి అమీన్‌ను కలుస్తాడు. గోండులు, కోలామ్‌లకు అధికారుల ఉర్దూ భాష రాకపోవడం పెద్ద సమస్యగా ఉండేది. భీముకు ఉర్దూ రావడం కలిసి వచ్చింది. అమీన్‌తో ఉర్దూలో మాట్లాడతాడు. తాను వచ్చిన విషయం చెప్తాడు. భీము ఉర్దూలో మాట్లాడడం అనేది మిగతా గోండుల నుంచి భీమును వేరు చేసి అమీన్ చూసే వీలు కలిగింది. పైగా ఓ పది కుటుంబాలు లచ్చువపటేల్ భూములను కౌలుకు చేసుకుని బతుకుతున్నారు. అతను నూరు అరకలు కడతాడు. లచ్చువ పటేల్‌తో మంచిగా ఉంటే గోండులు తన మాట వినరని అమీన్ భావించాడు. దాంతో ఫైల్ తెప్పించి చూసి - దీన్ని మొదటి తప్పుగా భావించి కేసు కొట్టేస్తున్నామని కొమురం భీముకు అమీన్ చెప్పాడు.

తన వ్యవహారాన్ని చక్కబెట్టిన కొమురం భీము అంటే లచ్చువపటేల్‌కు గురి కుదిరింది. అతన్ని వదిలేయడం ఇష్టం లేదు. దాంతో దేవడలోనే అంబతి రావు అనే వ్యక్తి కూతురు సోంబాయితో కొమురం భీముకు లచ్చువ పటేల్ వివాహం జరిపిస్తాడు. అన్నలను ఒప్పించి ఆ పెళ్లి జరిపిస్తాడు. భీము సోంబాయితో కాకన్‌ఘాట్‌లో కాపురం పెట్టాడు.

అమీన్‌తో మాట్లాడి లచ్చువపటేల్ వ్యవహారాన్ని చక్కదిద్దడంతో కొమురం భీము పేరు గూడేల్లో మారుమోగుతుంది. అతని గురించి గోండులు గొప్పగా చెప్పుకుంటూ ఉంటారు.

ఓ రోజు లచ్చువపటేల్‌కు చెందిన పత్తిని అమ్మి రావడానికి కొమురం భీము రాజోరా అంగడికి వెళ్తాడు. ఆ అంగడికే వచ్చిన పైకూబాయి తనతో

పాటు వచ్చినవారి నుంచి తప్పిపోతుంది. ఒంటరిగా అందంగా ఉన్న పైకూ బాయిని చూసి జంగ్లాత్‌వాళ్లు వెంట పడతారు. దాంతో ఆమె వారి నుంచి తప్పించుకోవడానికి కొమురం భీము బండి ఎక్కుతుంది. పైకూ బాయి సమస్యను తెలుసుకుని బండిని వేగంగా తోలుతాడు. రాజోరా దాటిస్తాడు. ఈలోగా అతనెవరో తెలుసు కుంటుంది. కొమురం భీము అని తెలుసుకుని మురిసిపోతుంది. రాజోరా దాటిన తర్వాత బండి దిగిపోవాలని అతను వారికి చెబుతాడు. తనకు తల్లిదండ్రులు లేరని, చిన్నాన్న తనను సరిగా చూడడం లేదని చెప్పి తనను పెళ్లి చేసుకోవాలని అడుగుతుంది. దాంతో అతను పైకూబాయిని ఇంటికి తీసుకని వెళ్లాడు. అలా పైకూ బాయి రెండో భార్యగా కొమురం భీము జీవితంలోకి ప్రవేశిస్తుంది. గోండుల్లో అప్పటికి బహుభార్యాత్వం ఉంది. దాంతో సోంబాయి ఆమెను ఆహ్వానిస్తుంది. కొమురం భీముకు ముగ్గురు భార్యలు. మూడో ఆమెను జోడెన్‌ఘాట్‌లో పెళ్లి చేసుకుంటాడు. నైజాం సైన్యంతో జరిగిన పోరాటంలో సోంబాయి భీముకు ఆయుధాలు అందిస్తుంటే, పైకూబాయి వంటావార్పూ చూసేది. భీము భార్యల గురించిన సమాచారం కొంత గందరగోళంగానే ఉంది. అల్లం రాజయ్య, సాహు రాసిన కొమురం భీము నవలలో ముగ్గురు భార్యలున్నట్లు ఉంది. అతనికి ముగ్గురు భార్యలున్న విషయాన్ని పులుగు శ్రీనివాస్ తాను రాసిన 'అడవితల్లి' నవలలో చెప్పాడు. అయితే, ఆ ముగ్గురు భార్యల క్రమం మాత్రం భిన్నంగా ఉంది.




**కొమురం భీము భార్య సోంబాయి**

(పులుగు శ్రీనివాస్ అడవితల్లి నవల నుంచి)

పులుగు శ్రీనివాస్ కొమురం భీము భార్య సోంబాయితో ముఖాముఖి మాట్లాడి ఆ విషయాన్ని రికార్డు చేశాడు. ఒక భార్య పేరు భీంబాయి, మరో భార్య పేరు జంగుబాయి అని సోంబాయి చెప్పినట్లు పులుగు శ్రీనివాస్ రాశాడు. తాను ప్రేమించి కొమురం భీము రెండో భార్యగా చేసుకున్నాడని సోంబాయి చెప్పినట్లు ఆయన రాశాడు. బీంభాయి పోరాటానికి ముందే చనిపోయిందని, జంగుబాయి పోరాటం చేసేవారికి వంటావార్పు చేసి పెట్టేదని సోంబాయి చెప్పినట్లు పులుగు శ్రీనివాస్ రాశాడు. సోంబాయి కొమురం భీముకు, ఇతర పోరాట వీరులకు ఆయుధాలు అందించినట్లు చెప్పాడు. సోంబాయి కుమారుడు మాధవరావు పోరాట సమయంలో నెల పసివాడు. సోంబాయి 1994 జూన్ నెలలో మరణించినట్లు తెలుస్తున్నది. ఆమె మరణించిన నెల రోజుల తర్వాత గానీ ఆ విషయం బయటి ప్రపంచానికి తెలియలేదు. గోండ్వానా సంఘర్షణ సమితి అధ్యక్షుడు డాక్టర్ చందు మీడియాకు చెప్తే గానీ తెలియలేదు..

## 12 గ్రామాల ఏర్పాటు కథ

అదలా ఉంటే, పంగడిలో కౌలు చేస్తూ కొమురం భీము చిన్నాయన కుర్దు ఉండలేకపోతాడు. ధనోరాలోని తన తమ్ముడు యేసు వద్దకు కుర్దు చేరుకుంటాడు. తిరిగి సొంతంగా వ్యవసాయం చేసుకోవాలని అనుకుంటాడు.





బాబేఝరీ పాట్నాపూర్ ప్రాంతాలు

(సాహూ, అల్లం రాజయ్య కొమురం భీము నవల నుంచి)

ఇదే విషయాన్ని యేసుకు చెప్తాడు. అప్పటి వరకు యేసు అదే పద్ధతిని కొనసాగిస్తున్నాడు. ఇద్దరు అన్నదమ్ములు కలిసి ఇంకా కొంత మందిని పోగు చేసి బాబేఝరి లొద్ది (వాగు) పక్కన అడవి నరికి సాగు యోగ్యం చేస్తారు. కేసులను ఎదుర్కోవడానికి సిద్ధపడే ఆ పని చేస్తారు. అలా వాళ్లు బాబేఝరి, చల్‌బండి, గోగిన్‌మోవాడం, బొయికన్ మోవాడం, భీమన్ గొంది, కల్లేగామ్, మురికిలొంక, అంకుసాపూర్, నర్సాపూర్, దేమ్డీగూడ, జోడెన్‌ఘాట్, పట్నాపూర్ అనే పన్నెండు గూడేలను పొందిస్తారు.

ఆసిఫాబాద్, ఉట్నూర్ ప్రాంతాల్లో కూడా చట్టాలను ధిక్కరించి గిరిజనులు అడవులను నరికి వ్యవసాయం సాగించడం పెరుగుతుంది. ప్రత్యామ్నాయం లేక తెగించి, బతుకుతెరువు కోసం ఆ పనికి ఒడి గట్టారు. దీంతో ప్రభుత్వం కదులుతుంది. దాంతో అటవీ శాఖాధికారులు పంచనామాలు చేస్తూ కేసులు బనాయిస్తూ ఉంటారు. గిరిజనులు చాలా మంది కేసుల కోసం తిరగడం పరిపాటిగా మారిపోతుంది.

అదే క్రమంలో జంగ్లాత్‌వాళ్లు కుర్దు, యేసు రూపొందించిన గూడేలపై పడి వాటిని బూడిద చేశారు. చాలా మందిపై కేసులు పెట్టారు. దీంతో పన్నెండు గ్రామాల గోండుల, కోలామ్‌లు సర్వస్వం కోల్పోయారు. దాంతో వ్యవహార జ్ఞానం తెలిసిన కొమురం భీమును తమ తరఫున వ్యవహారాలు నడపడానికి తెచ్చుకోవాలని అనుకుంటారు. చిన్నాన్న కుర్దు, యేసు కాకన్‌ఘాట్ వెళ్లి బతిమాలడంతో కొమురం భీము వారితో రావడానికి అంగీకరిస్తాడు. దాంతో నైజాం ప్రభుత్వంపై కొమురం భీము ప్రత్యక్ష పోరాటానికి పునాది పడుతుంది. చట్టప్రకారం చేయాల్సిన పనులన్నీ చేసి వారి జీవితాలను మెరుగు పరచాలని అనుకుంటాడు. నైజాం ప్రభువుకు విన్నవించి తన వారిని గట్టెక్కించాలని అనుకుంటాడు. కానీ ఏదీ ఫలితం ఇవ్వకపోవడంతో సాయుధ పోరాటాన్ని ఎంచుకుంటాడు.

భీము జోడెన్‌ఘాట్‌కు వచ్చిన తర్వాత చేసిన మొదటి పని, అరెస్టయిన ముసలివాళ్లను విడిపించుకుని రావడం. కుర్దు, యేసు, కొమురం భీము మరికొంత మంది జనగామ వెళ్లి వారిని విడిపించుకుని వచ్చారు. మళ్లీ చెట్లు నరకవద్దని చెప్పి అధికారులు వారిని వదిలేశారు.

ఆ తర్వాత ఏం చేయాలనేది సమస్యగానే ఉంది. మళ్లీ చెట్లు నరికి వ్యవసాయం చేస్తే అదే పునరావృతం అవుతుంది. అలా కాదంటే బతకడం ఎలా అనేది తేలేది కాదు. తమ పని తాము చేసుకుంటూనే పోరాటం చేయాలనేది భీము ఆలోచనగా ముందుకు వస్తుంది. దీంతో భీము పోరాటం చేయాలనే నిర్ణయానికి వస్తాడు. ఇదే విషయం తన చిన్నాయన కుర్దుతో చెప్తాడు. అయితే, ముందు కేసులను పరిష్కరించే ప్రయత్నాలు చేస్తూనే పన్నెండు గూడేలను పునర్నిర్మించాలని అనుకుంటారు. దాంతో భీము, యేసు అంతా కలిసి చెల్లాచెదురైన ఆ పన్నెండు గూడేలవారిని కూడగట్టే ప్రయత్నం చేస్తారు. తమ న్యాయపోరాటానికి చదువు తెలిసి, రాతకోతలు వచ్చిన వ్యక్తి కావాలని అనుకుంటారు.

అటువంటి వ్యక్తి నావుదంలో ఉన్నాడని తనకు తెలిసిన ముత్తు చెప్పినట్లు కుర్దు చెప్పాడు. కేసుల పరిష్కారం కోసం పనిచేయడానికి అతని వద్దకు వెళ్దామని అంటాడు. దాంతో ముత్తును వెంటబెట్టుకుని మహదు వద్దకు వెళ్తారు. వాళ్లు నలుగురు కలిసి మహదుకు తెలిసిన జనకపురంలోని ఓ పంతులును కలుస్తారు. మహదు రాతకోతల పనిచేస్తూ, కేసుల వ్యవహారాలు చూస్తు చివరి దాకా భీముతో ఉన్నాడు. పంతులు సలహా మేరకు జనగాంలోని వకీలు రామచంద్రరావు వకీలు వద్దకు వెళ్తారు. భీమువాళ్లు తమ గోడు చెప్పుకుంటారు. ఆ పన్నెండు గ్రామాలపై జంగ్లాత్‌వాళ్లు పడడం, అరెస్టయినవారు బెయిల్‌పై విడుదల కావడం అప్పటికే రామచంద్ర రావు పైకాజీకి తెలుస్తుంది. ప్రభుత్వ ఆస్తులు నష్టపరిచారని, అడవులు నరికారని రెండు కేసులు ఆ పన్నెండు గూడేలవారిపై కేసులు నమోదైన విషయాన్ని రామచంద్రరావు చెప్తాడు. తాము తాతలకాలం నుంచి అదే పని చేస్తున్నామని,

తమ జీవితమే అది అని వారు చెప్తారు. దాంతో రామచంద్ర రావు సర్కారు తెచ్చిన చట్టం గురించి భీముకు వివరిస్తాడు. అలాంటప్పుడు తమకు భూమి ఎట్లా అని భీము అడుగుతాడు. పట్టాలుంటేనే భూమి అని చెప్తాడు.

ఆ పన్నెండు గ్రామాలకు పట్టాలు ఉంటే గానీ సమస్య పరిష్కారం కాదని అతను చెప్తాడు. అందువల్ల సమస్యను పరిష్కారం చేయడం సాధ్యం కాదని, పట్టాలు ఉంటేనే సాగు చేసుకోవడానికి వీలవుతుందని చెప్తాడు. అయితే, రామచంద్ర రావు ఓ సలహా ఇస్తాడు. పన్నెండు గ్రామాలకు సంబంధించి పట్టాల కోసం హైదరాబాద్ వెళ్లి స్వయంగా నిజాంను కలిసి విన్నవించుకోవాలని సూచిస్తాడు.

పరిస్థితి క్లిష్టంగానే ఉంది. ఒకటి అదాలత్‌ల చుట్టూ తిరగడం, రెండోది సర్కారు చట్టాలను ధిక్కరించి, సర్కారుపై పోరాటం చేయడం. అంటే, హైదరాబాద్ రాజ్యాన్ని పాలిస్తున్న నిజాంను ఎదిరించడం. విషయం స్పష్టమైన తర్వాత వివరాలు రైతులకు చెప్పడానికి కొమురం భీము సిద్ధమయ్యాడు. హవల్దార్ సూరును పిలిపించి పట్నాపూర్‌లో రైతుల సమావేశం ఏర్పాటు చేయించాడు. ఇతను కొమురం సూరు. చివరి వరకు కొమురం భీము వెంట ఉన్నాడు. ఇతని ఇంటి పేరు కూడా కొమురం.

## భీము ముఖ్య అనుచరుడు సూరు

కొమురం భీము కుటుంబంతో కొమురం సూరుకు రక్తసంబంధం లేదు. కొమురం భీముకు అత్యంత విశ్వాసపాత్రుడు కొమురం సూరు. కొమురం భీముకు అతను కోత్వాల్‌గా పనిచేశాడు. అతనితో కలిసి పోరాటం చేశాడు. అతన్ని నిజాం అధికారులు కొమురం భీము సొంత తమ్ముడిగా అనుమానించారు. దాంతో కొమురం భీమును హత్య చేసిన తర్వాత కూడా నిజాం సైనికులు అతని వెంట పడ్డారు. ఇతని కథనాన్ని పులుగు శ్రీనివాస్ రికార్డు చేసి తాను రాసిన 'అడవి తల్లి' నవలలో వివరించారు. సూరుది, భీముది ఇంటి పేరు, తండ్రి పేరు ఒకటే కావడంతో నిజాం సైనికులు అతన్ని అలా భావించారు.



కొమురం సూరు
(పులుగు శ్రీనివాస్ అడవితల్లి నుంచి)

సూరు కోలాం అయితే, భీము గోండు. నిజాం సైనికులతో జరిపిన పోరాటంలో కొమురం సూరు కుడి చేతికి, కుడికాలికి గాయాలయ్యాయి. ఆరు నెలల పాటు ఆయన అజ్ఞాతంలో గడిపారు. పోరాటం ముగిసి పరిస్థితులు సాధారణంగా మారిన తర్వాత జోడెఘాట్ అడవుల్లో జరిగిన పోరాటాన్ని సాటి గిరిజనులకు ఆయనే వివరిస్తూ వచ్చాడు. గిరిజనుల స్థితిగతులపై అధ్యయనం చేయడానికి వచ్చిన ప్రొఫెసర్ హేమన్‌డార్ఫ్‌కు కాల్పుల సంఘటన గురించి వివరించాడు. కొమురం సూరు 1977లో ఆసిఫాబాద్ మండలం శాకన్‌గోందిలో మరణించాడు.

## తుడుం మోగింది

రామచంద్ర రావు చెప్పిన మాటలను వివరించడానికి, భవిష్యత్తు కార్యాచరణ రూపొందించడానికి కొమురం భీము రైతులతో సమావేశం ఏర్పాటు చేయాలని అనుకున్నాడు. దాంతో అన్ని గూడేల రైతులను కూడగట్టడానికి పట్నాపూర్‌లో రఘు తుడుం మోగించాడు. అలా తుడుం కొమురం భీము పోరాటంలో చివరి వరకు ఓ ప్రధానమైన చర్యగా కొనసాగుతూ వచ్చింది. పండుగలకు మాత్రమే మోగించే నగారా పోరాటంలో ఓ భాగమైంది. రైతులంతా సమావేశమయ్యారు. వారికి తాము వకీలు రామచంద్ర రావుతో, పంతులుతో మాట్లాడిన విషయాలు, వారు తమకు చెప్పిన విషయాలు కొమురం భీము వివరించాడు. అడవి నరికి వ్యవసాయం చేస్తే కేసులు పెడతారు. వాటితో అదాలత్‌ల చుట్టూ తిరగడం, రెండోది సర్కారుపై యుద్ధం చేయడం - ఈ రెండే మార్గాలున్నాయని భీము మాటలతో వారికి అర్థమై పోయింది.

చర్చోపర్చల తర్వాత అడవులు నరకాల్సిందేనని, అవసరమైతే సర్కారుపై తిరగబడాలని నిర్ణయానికి వచ్చారు. అలా అడవి నరికి సాగు చేసుకున్నారు. పన్నెండు గూడేలను పునరుద్ధరించారు. ఆ ఏడాది అధికారులు ఎవరూ రాలేదు. ఇక, వారు రారనే అనుకున్నారు. కొమురం భీముకు భయపడి వారు కన్నేయడం లేదని భావించారు. దాంతో కొమురం భీముకు అతీత, అద్భుత శక్తులున్నాయని ప్రచారం జరిగింది. కొమురం భీముపై రకరకాలుగా కథలు ప్రచారమయ్యాయి. అదంతా అతను చేసే అద్భుతాల గురించే, అతనికి ఉన్న అతీతశక్తుల గురించే. అవేవీ అతనికి లేవని నమ్మడానికి వారు సిద్ధంగా లేరు. అందుకే తమ వైపు ఏ జంగ్లాత్‌వాళ్లు కూడా రారని అనుకుంటున్నారు. కొంత మంది కేసుల కోసం అదాలత్ చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. యేసు, మరికొందరు అప్పటికే అలా తిరగడానికి మానసికంగా సిద్ధమయ్యారు. కొమురం భీముకు మాత్రం అనుమానంగానే ఉంది. ఏదో ఒక రోజు వారు విరుచుకుపడతారని అతను అనుకుంటూనే ఉన్నాడు.

కొమురం భీము అనుమానించినట్లే జరిగింది. జనగామ అధికార యంత్రాంగమంతా కదిలింది. పట్వారీని వెంట పెట్టుకుని అమీన్, చౌకీదారు, సేరేదారు, గిర్దావర్ బాబేఝరి చేరుకున్నారు. అయితే, వారు వస్తున్న విషయం గూడెంలో ముందే తెలిసిపోయింది. కానీ, గతంలో మాదిరిగా వారు భయపడలేదు. వారికి ఇంతజామ్‌లు చేయలేదు. భీము ఉండే టోయినకల్‌కు చేరుకున్నారు. అప్పటికే వారికి సూరు దారి చూపడానికి వచ్చాడు. అడవులు నరికిన వద్దకు రావాలని కుర్దు తదితరులను అమీన్ అన్నాడు. పంచనామా చేయండి, మరిన్ని కేసులు పెట్టండని కొమురం భీము అంటూ వారిపై ధిక్కార స్వరం వినిపించాడు. తమపై దయ ఉంటే జంగల్ (అడవి) అని కాకుండా గైరాన్ (బంజరు) భూమి అని రాయాలని భీము అడుతాడు. అయినా అమీన్ వినడు. వద్దంటే అడవి నరుకుతున్నారంటూ అమీన్ బూతులు ఎత్తుకున్నాడు. దాంతో భీముకు, అమీన్‌కు మధ్య వాగ్వాదం జరిగింది. ఇటువంటి వ్యతిరేకతను చూడని అమీన్‌కు కోపం వచ్చి భీమును కొట్టాడు.

దాంతో మిగతా గోండులపై అతని బలగం విరుచుకు పడింది. రఘు తుడుం మోగించాడు. దాంతో గోండులు, కోలామ్‌లు పరుగెత్తుకొచ్చారు. జంగ్లాత్‌వాళ్లపై విరుచుకుపడ్డారు.

ఊహించని ప్రతిఘటనతో అమీన్‌తో వచ్చినవారంతా కింద పడిపోయారు. ఈ సమయంలో ఒకతను బర్మార్ పేల్చడంతో భీము గాయపడతాడు. ఆ అవకాశాన్ని ఆసరా చేసుకుని అమీన్ సహా అతని సహచరులు పారిపోతారు. కొమురం భీము పోరాటంలో ఇది మొదటి సాయుధ ప్రతిఘటన. జంగ్లాత్‌వాళ్లు సూర్దాపూర్‌లో రెండోసారి గూడేలను దగ్ధం చేయగలిగారు గానీ బాబేఝరిలో చేయలేకపోయారు. ప్రతిఘటన ఎదురు కావడంతో వారు ఆ పని చేయలేకపోయారు.

జంగ్లాత్‌వాళ్లను లట్టులతో ఎదుర్కున్నారు. కానీ భవిష్యత్తులో అది అంత సులభం కాదనే విషయం భీముకు తెలుసు. దాంతో సూర్దాపూర్‌లోని తన చిన్ననాటి మిత్రుడు కొండల్‌ను పలిపించి, బర్మాల్ తయారు చేయించాలని నిర్ణయించుకుంటాడు.

అలా కొన్ని రోజులు గడుస్తాయి. ఓ రోజు అంగడికి వెళ్లిన కుర్దు, సుద్దు, జంగు, మరికొంత మందిని పోలీసులు అరెస్టు చేస్తారు. ఆ విషయం కొమురం భీముకు తెలుస్తుంది. అప్పటికి తనకు తగిలిన తూటా గాయం మానలేదు. దాంతో మహదును పిలిపించి లచ్చువ పటేల్‌కు ఉత్తరం రాయిస్తాడు. భూముల పంచాయతీలో తమ చిన్నాయనను, ఇద్దరు తమ్ముళ్లను, మరో ఇద్దరు రైతులను పోలీసులు అరెస్టు చేశారని, తాను కదలలేని స్థితిలో ఉన్నానని, చన్‌పాలి నర్సింగరావు, డోంగుర్రావులతో కలిసి జనగామ వెళ్లి పైకాజీ రామచందరరావును కలవాలని, తమవారిని జామీను వచ్చి విడిపించాలని భీము ఆ ఉత్తరం రాశాడు. కొమురం భీము ఉత్తరం రాసిన మూడు రోజులకు అరెస్టయినవారు తిరిగి వచ్చారు. దాంతో తిరుగుబాటుకు సమాయత్తం కావాలని కొమురం భీము మానసికంగా సిద్ధపడినట్లే కనిపించాడు.

## కదలిన నైజాం అధికార యంత్రాంగం

కొమురం భీము నాయకత్వంలో గిరిజనులు తిరుగుబాటు చేసిన ఉదంతాన్ని అమీన్, గిర్దావర్ వివరాలు చెప్పడంతో ఆ రోజు సంఘటనకు సంబంధించి తాసిల్‌దారు అబ్దుల్ సత్తార్ ఆదేశాల మేరకు బాబేఝరిలో జంగ్లాత్‌వాళ్ల మీద దాడి చేశారని, అడవిని నరికారని డిఎస్‌పి కేసులు పెట్టాడు. కేసులో కొమురం భీమును మొదటి ముద్దాయిగా, మహదు, రఘు, జంగు, కుర్దు, యేసు, సుద్దులను తరవాతి ముద్దాయిలుగా చేర్చారు.

అధికార యంత్రాంగమంతా కదిలింది. మహ్మద్ అబ్దుల్ సత్తార్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ రెవెన్యూకు ఉత్తరం రాశాడు. ఆ తర్వాత సుబేదారు వరంగల్ నుంచి హైదరాబాద్ వెళ్లి హోం సెక్రటరీతో విషయమంతా వివరించాడు. అక్కడి నుంచి వెంటనే ఆదేశాలు వచ్చాయి. గూడేలన్నీ తిరిగి పూర్తి వివరాలు సేకరించాలని, బయటవాళ్లు ఎవరన్నా ఉన్నారేమో ఆరా తీయాలని, అడవిని నరికి తగువుకు కారణమైనవారిని వెంటనే అరెస్టు చేయాలని అక్కడి నుంచి డిఎస్‌పికి ఆదేశాలు వచ్చాయి. అంటే, బ్రిటిష్‌వారికి, నైజాంకు వ్యతిరేకంగా పోరాటాలు సాగిస్తున్న బయటివారి ప్రోద్బలంతో గిరిజనులు తిరగబడుతున్నారా అనే విషయాన్ని నిర్ధారించుకోవడానికి నైజాం అధికార యంత్రాంగం ఆరా తీసిందన్న మాట.

పై అధికారుల ఆదేశాల మేరకు నిందితులను స్థానిక అధికారులు అరెస్టు చేయాల్సి ఉంది. అయితే, అరెస్టు చేయడానికి వెళ్లేందుకు అధికారులు జంకారు. పైగా, అమీన్ కొన్ని పేర్లు మాత్రమే ఇచ్చాడు. వారిని అరెస్టు చేయాలని ఆదేశాలు వచ్చాయే గాని దాడి చేయడానికి ఆదేశాలు లేవు. వారి నాయకుడు కొమురం భీమును అరెస్టు చేస్తే ఎటువంటి పరిణామాలు ఎదురవుతాయో తెలియదు. దీంతో అబ్దుల్ సత్తార్ ఆలోచనలో పడ్డాడు. ఇంతలో అంగట్లో ఆరుగురు గిరిజనులను అరెస్టు చేశామని అమీన్ సమాచారం ఇచ్చాడు. గోండుల గురించి వివరిస్తూ ఆరుగురిని అరెస్టు చేసిన విషయాన్ని

తెలియజేస్తూ సత్తార్ హోం సెక్రటరీకి వర్తమానం పంపాడు. ఆ మర్నాడే హోం శాఖ నుంచి వర్తమానం వచ్చింది.

భూచట్టాల గురించి గిరిజనులకు తెలియజేయాలని, అదే సమయంలో భీము, అతని అనుచరుల కార్యకలాపాలను, ఇతర గిరిజనుల కార్యకలాపాలను ఎప్పటికప్పుడు తమకు తెలియజేయాలని, ఎవరైనా ముందుకు వస్తే బెయిల్ మంజూరు చేసి, నైజాం సర్కారు అందరినీ సమానంగానే చూడాలని అనుకుంటోందని, కానీ సర్కారుకు వ్యతిరేకంగా పనిచేయకూడదని, మీమీ గూడేల్లో మీవాళ్లకు విషయాలు చెప్పండని వారికి చెప్పాలని, ఇది మిగతా ప్రాంతాలకు విస్తరించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎంత అడవిని నరికి, వారు సాగు చేసుకుంటున్నారో వివరాలు తెలపాలని హోం సెక్రటరీ వర్తమానం పంపాడు. ఆ విషయాలను మిగతా అధికారులకు సత్తార్ వివరించాడు. దాంతో భీము, మహదు, రఘు, నాను, సుద్దు, కుర్దు, జంగు కోర్టు నుంచి విడుదలయ్యారు.

భీము, కుర్దు తదితరులు జనకపురంలోని పంతులు ఇంటికి వెళ్లారు. కేసులతో కోర్టుల చుట్టూ తిరగడం నుంచి ఎలా తప్పించుకోవడం అనేదాని కన్నా సమస్యకు ఏమైనా పరిష్కారం లభిస్తుందా అని తెలుసుకోవడానికి పంతులుతో మాట్లాడారు. అయితే, పంతులు నుంచి వాళ్లకు లభించిన ఒకే మార్గం హైదరాబాద్ వెళ్లి స్వయంగా సర్కారుకు విన్నవించుకోవడం. దాంతో తిరిగి గూడేనికి వెళ్లి రైతులను సమావేశపరిచారు. నైజాం సర్కారు వద్దకు వెళ్లాలనే అభిప్రాయం సమావేశంలో వ్యక్తమైంది. దాంతో ఎవరెవరు వెళ్లాలి, ఎలా విన్నవించాలి, ఏయే విషయాలు చెప్పాలనే విషయంపై చర్చ జరిగింది.

నైజాంకు ఇవాల్సిన వినతిపత్రాన్ని 12 గ్రామాల తరఫున తయారు చేయడానికి సిద్ధపడ్డారు. మహదు వినతిపత్రం రాశాడు. ఆ వినతిపత్రం ఇలా ఉంది.

మహా ఘనత వహించిన నైజాం రాజుగార్కి పదివేల దండాలు,

మేము జనగామ (ఆసిఫాబాద్) జిల్లాకు చెందిన ధనోరా ఇలాకా (ప్రాంతం) గోండ్లము, మాకు భూములు లేక బాధపడుతున్నాము. మేము ఎక్కడికి పోయి గైరాన్ నరికి పంటలు పెట్టుకున్నా తీరా పంట చేతికొచ్చే సమయానికి ఈ భూములు మావి అని పట్టేదార్లు వస్తున్నారు. రైతులమైన మాకు భూమి లేకుంటే బతుకలేమని ఘనత వహించిన సర్కారుకు తెల్సు కదా. రైతులకు భూమి తల్లితో సమానం. మేము పండిస్తేనే లోకానికి తిండి. మాకు భూమి లేకుంటే ఎట్లా? ఏనాడు నాగలి పట్టని, ఏనాడు భూమి ముఖం తెలియని పట్టేదార్లు ఎక్కడి నుంచో వచ్చి మా భూములన్ని వాళ్లవే అంటున్నారు. వాళ్లకు వేల ఎకరాల పట్టాలున్నాయి. మన్ను బుక్కి మన్నులో బతికి పంటలు తీసే మాకు భూముల లేవు.

మేము ఎన్నో సార్లు తాసీలుదారుకు, కలెక్టరుకు వినతి చేసుకున్నాము. మా గోడు సర్కారుకు చెప్పండని వేడుకున్నాము. అయినా మా మొర ఎవలూ పట్టించుకోలేదు. జంగ్లాతువాళ్లు లంచాలు ఇస్తే అడవి నరికి భూములు చేసుకోండని అంటున్నారు. అట్లా లంచము ఇచ్చి నరుక్కోవడానికి మేము దొంగలం కాదు. మీరు కూడా దొంగ పని చేయకండని అన్నాం. ధర్మ ప్రభువులైన రాజుగారికి తెల్పండని ఎన్నో సార్లు చెప్పాము.

అయినా వినకుండా మా గూడేల మీద పడి నానా హంగామా ఎన్నో సార్లు చేశారు. మా గుడిసెలను కాల్చారు. మా పంట చేలల్లో పశువులను తోలారు ఆకు తెంపినా, కొమ్మ ముట్టినా వేళ్లు నరికారు. మా స్త్రీలను చెరబట్టారు. మా పసిపిల్లలను కొట్టారు. మాపైన కేసులు పెట్టారు. మేము కేసుల చుట్టూ తిరిగి తిరిగి దారుణపడ్డాం..

దయాళువులైన మీరు విచారించి మేము పొందించిన పన్నెండు గూడాలకు పట్టాలిచ్చి మమ్ములను ఆదుకుంటారని - మీ దాసులమైన మీ ప్రజలము. వినతి చేసుకు న్నాము' (అల్లం రాజయ్య, సాహు రాసిన

కొమురం భీము నవల నుంచి) అని రాసి పన్నెండు గ్రామాల పేర్లు రాశాడు మహదు. తమ ముగ్గురి చేవ్రాలు అంటూ కొమురం భీము, కొమురం రఘు, మడావి మహదు పేర్లు రాశారు. ఆ వినతిపత్రాన్ని జనకపురం పంతులకు చూపించి ఆ ముగ్గురు హైదరాబాద్ బయలుదేరారు.

అప్పటికే హైదరాబాద్ రాజ్యం తిరుగుబాట్లతో అట్టుడికిపోతున్నది. కమ్యూనిస్టులు, కాంగ్రెస్‌వాళ్లు తిరుగుబాటు చేస్తున్నారు. బ్రిటిష్‌వాళ్లు డిమాండ్లు పెడుతున్నారు. ఈ స్థితిలో ముగ్గురు కొమురం భీము, కొమురం రఘు, మడావి మహదు కూడా దర్బారు వద్దకు చేరుకున్నారు. లోనికి వెళ్లడానికి వారికి అనుమతి లభించలేదు. తీవ్రంగా శ్రమించిన తర్వాత మంత్రి వద్దకు వెళ్లడానికి అనుమతి దొరికింది. వజీరు (మంత్రి)కి తమ సమస్యను విన్నవించుకోవడానికి ప్రయత్నించారు. వారి ముగ్గురి మాటలను పట్టించుకోకుండా మంత్రి తిట్టి పంపించాడు. కుతకుత ఉడుకుతున్న గుండెలతో వాళ్లు వెనుదిరిగారు.

## ఆ ముగ్గురు...

నిజాం ప్రభువును కలవడానికి కొమురం భీము హైదరాబాద్ వెళ్లినప్పుడే కొమురం భీముకు సిరాజుల్ హసన్ అనే పత్రికా సంపాదకుడు తిర్మయిజీ పరిచయమై ఉంటాడనే ఓ కథనం ఉంది. అలాగే, రామచందర్ రావు పైకాజీ తిర్మాయిజీని పరిచయం చేశాడనే వాదన కూడా ఉంది. కొమురం భీము పోరాటానికి సిరాజుల్ హసన్ తిర్మయిజీ అనే పత్రికా సంపాదకుడు మద్దతు ఇచ్చాడు. ఈయన 1931లో అకోలాలో జరిగిన 4వ హైదరాబాద్ రాజకీయ సదస్సుకు ఆహ్వాన సంఘం అధ్యక్షుడిగా వ్యవరించారు. కొమురం భీము భూపోరానికి సంబంధించిన వార్తలను సేకరించి అతను తన పత్రికలో అచ్చేశాడు.

కొమురం భీము తిరుగుబాటుకు పిలుపునివ్వడానికి ఏర్పాటు చేసిన గిరిజనుల సభకు తిర్మయిజీ వచ్చినట్లుగా ఉంది. (కొమురం భీము నవల, ఎస్ఎమ్ ప్రాణ్‌రావు). ప్రముఖ రచయిత భూపాల్ కథా నాయకుడిగా

నటించి, అల్లాణి శ్రీధర్ దర్శకత్వం వహించిన కొమురం భీము సినిమా కోసం ప్రాణ్ రావు క్షేత్ర పర్యటన కూడా చేశారు.

మొత్తం, కొమురం భీము పోరాటంలో మడావి మహదు, జనకపురం పంతులు, రామచందర్ రావు తెర వెనక వ్యక్తులుగా కనిపిస్తారు. మహదు బయటి ప్రపంచానికి, గిరిజనులకు మధ్య వారధిగా పనిచేస్తే, పంతులు గిరిజనులకు పోరాటానికి సంబంధించిన ఆలోచనా జ్ఞానాన్నీ అందించినట్లు, రామచందర్ రావు గిరిజనుల కేసులను చూస్తూ వారికి నైజాం ప్రభుత్వ యంత్రాంగాన్ని ఎదుర్కోడానికి సహకరించినట్లు అర్థమవుతున్నది. అందుకే, రామచందర్ రావును గిరిజనులు మన లాయర్ అని పిలుచుకునేవారు. రామచందర్‌రావుపై కూడా నైజాం సర్కారు గుర్రుగానే ఉంది. కానీ ఏమీ చేయలేక వదిలేసింది.

## గూడేలపై మరో దాడి..

కొమురం భీము, మహదు, రఘు హైదరాబాద్ వెళ్లిన సమయంలోనే ఇక్కడ అధికారులు గూడేలపై దాడి చేశారు. కుర్దు పటేల్ (కొమురం భీము చిన్నాయన కుర్దు కాడు) తోవ చూపుతుండగా ముగ్గురు జంగ్లాత్ అమీన్‌లు, ఆరుగురు సారేదార్లు, 12 మంది పోలీసులు, అయిదుగురు చౌకిదార్లు జోడెన్‌ఘాట్ చేరుకున్నారు. మొక్కజొన్న చేను చేతికి అంది వచ్చింది. అటువంటి సమయంలో వారు గూడేనికి వచ్చారు. కొమురం భీము కోసం ఆరా తీశారు. గూడెంలో నానా హంగామా చేశారు. హవల్దార్ సూరు వాళ్ల ఎదుట ఉన్నాడు. కదలడానికి వీలు లేకుండా ఉంది. జంగ్లాత్ సిబ్బంది తాగారు, తిన్నారు, జల్సా చేశారు. మర్నాడు ఉదయానికల్లా ఒక్కరొక్కరే రైతులు అక్కడికి చేరుకున్నారు. జంగ్లాత్‌వాళ్లు, పోలీసులు నిరాయుధులైన రైతుల మీద పడ్డారు. గూడానికి నిప్పు పెట్టారు. పంటలను గుర్రాలతో తొక్కించారు. వాళ్లని చూసి పరుగెత్తడానికి ప్రయత్నించిన స్త్రీలను చెరపట్టారు. పిల్లలను, ముసలివాళ్లను – దొరికినవాళ్లను దొరికినట్లు కొట్టారు. కొంత మందిని తమ వెంట పట్టుకెళ్లారు.

జోడెన్‌ఘాట్ సర్వనాశనమైంది. హైదరాబాద్ నుంచి తిరిగి వచ్చిన తర్వాత పరిస్థితి చూసి కొమురం భీముకు పిచ్చి పట్టినట్లే అయింది. జంగ్లాత్‌వాళ్ల నుంచి, పట్టేదార్ల నుంచి ఎలా తప్పించు కోవాలో రైతులకు అంతు పట్టకుండా ఉంది.

చివరకు గుండె దిటవు చేసుకుని 12 గ్రామాల ప్రజలను కొమురం భీము సమావేశపరిచాడు. హైదరాబాద్‌లో తమకు ఎదురైన పరిస్థితిని వివరించాడు. ఏం చేయాలనే విషయంపై చర్చ జరిగింది. ఇక పోరాటం తప్ప మరో మార్గం లేదని తీర్మానించుకున్నారు. తమ 12 గ్రామాల ప్రజలనే కాకుండా ఇతర గూడేల గోండులను, కోలామ్‌లను సమీకరించాలని అనుకున్నారు. గోండు రాజ్యం కోసం రాంజీ గోండు తరహాలో పోరాటం చేయాలని నిర్ణయించుకున్నారు. పోరాటానికి జోడెన్‌ఘాట్‌ను కేంద్రంగా చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. మిగతా గూడేల కన్నా ఇది ఎత్తు మీద ఉంటుంది. శత్రువు చేరుకోవడం కష్టమవుతుంది. ఆ తర్వాత కీలకమైన 12 మంది సమావేశమై పోరాట రూపాన్ని, కార్యాచరణను సిద్ధం చేశారు.

సమావేశంలో ఈ కింది నిర్ణయాలు తీసుకున్నారు. (అల్లం రాజయ్య, సాహు రాసిన 'కొమురం భీము' నవల ఆధారంగా)

1. జోడెన్‌ఘాట్ నుంచి పట్టుకుపోయినవాళ్లను విడిపించాలి. వాళ్లు వచ్చిన తర్వాతనే పోరాటానికి అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలి. వారిని విడిపించుకుని రావడానికి మహదు అన్ని ఏర్పాట్లు చేయాలి.

2. అన్ని గ్రామాల యువకులను సమీకరించి జోడెన్‌ఘాట్‌లో కేంద్రీకరించాలి. ఈ యువకుల సమూహం ఫౌజు (సైన్యం)గా పని చేస్తుంది. ఈ ఫౌజు తిండి ఖర్చులు, ఆయుధాల ఖర్చులు అన్ని గ్రామాలవాళ్లు భరించాలి. అన్ని గ్రామాల్లో ప్రచారం

చేయడానికి గొంగళ్లు కప్పుకుని వెళ్లాలి. కొమురం భీము సందేశాన్ని వినిపించాలి. గోండు రాజ్యం కోసం పోరాటం సాగుతున్నదని చెప్పాలి. తుడుంను ఒక గూడెం నుంచి మరో గూడేనికి సమాచారం అందించడానికి సంకేతంగా వాడాలి.

3. ప్రతి గూడెంలో బడితెపూజ నిర్వహించాలి. (బడితెపూజ అంటే గ్రామంలో ప్రతి ఒక్కరు తన ఎత్తుగల కర్రను తీసుకొని అందరు ఆ కర్రలను ఒక స్థలంలో ఉంచి పూజ చేసి ఒక ఎల్లప్పుడు ఎవరికి వారు తమ తమ కర్ర (లట్టు)ను ధరించి ఉండాలి. సాంప్రదాయకమైన గొడ్డళ్లు, ఈటెలు, బాణాలు, వొడిసెళ్లను సిద్ధం చేసుకోవాలి.

4. జోడెన్‌ఘాట్‌లో ఫౌజు ఉంటుంది. చుట్టుపక్కల రక్షణగా కొంత మందిని పెట్టాలి. కీలకమైన ప్రాంతాల్లో కూడా ఫౌజు మోహరిస్తుంది. గ్రామాల్లో రక్షక దళాలు ఉండాలి.

5. ప్రతి గ్రామానికి వార్తలు తెచ్చేందుకు ఒకరు ఉండాలి. అదే విధంగా అధికారుల సంగతులు తెలుసుకోవడానికి కొంత మందిని ప్రత్యేకంగా నియమించాలి.

6. కేసుల పెట్టడానికి జోడెన్‌ఘాట్ నుంచి పట్టుకుపోయినవాళ్లు తిరిగి వచ్చిన తర్వాత ప్రభుత్వపు కేసులకు ఇక తాము రాబోమని చెప్పాలి. దీనికి పూర్తి బాధ్యత సర్కారు వారిదే అని చెప్పాలి.

7. అడవిలోని అన్ని భూములను గోండులకు, కోలామ్‌లకు సర్కారు వారు ధారాదత్తం చేసే వరకు మేం లడాయి చేస్తామని వర్తమానం పంపాలి.

8. రహస్యంగా పనిచేయాలి.

9. గోండు రాజ్య స్థాపనలో భాగంగా లడాయి చేయాలి.

10. మన జెండా రగల్‌జెండా.

ఒక్కొక్క ప్రాంతానికి ఒక్కొక్కరు నాయకత్వం వహించాలి. అంతటికీ భీము నాయకత్వం వహిస్తాడు. ఈ విషయాన్నీ పన్నెండు మందిలోనే ఉండాలని నిర్ణయించుకున్నారు. ఇదంతా అయిన తర్వాత కేసుల పెట్టడానికి పట్టుకుపోయిన తమ వారిని విడిపించుకురావడానికి మహదు జనగామ వెళ్లాడు.

ఆ తర్వాత రఘును వెంట పెట్టుకుని భీము జోడెన్‌ఘాట్ చుట్టుపక్కల ఉండే గూడేలన్నీ తిరిగాడు. రఘు కొమురం భీముకు అంగరక్షకుడిలాగా పనిచేస్తున్నాడు. పంటలను చూశాడు. చాలా మందితో మాట్లాడాడు. గోండు రాజ్య స్థాపన కోసం తలపెట్టిన పోరాటం గురించి పెద్దలతో మాట్లాడాడు.

ఇదంతా జరుగుతున్న క్రమంలోనే బర్మార్లు చేయడం నేర్చుకోవడానికి చాందా వెళ్లి కొండల్ తన ఇద్దరు సహచరులు ఖాత్రి, వడేలతో కలిసి జోడెన్‌ఘాట్ చేరుకున్నారు. నిజానికి వాళ్లను విటోబా వద్దకు భీము పంపించాడు. అయితే, అక్కడి వాళ్లతో కలిసి బర్మార్లు తయారు చేయడం నేర్చుకుని ఆ ముగ్గురు తిరిగి వచ్చారు.

## కొమురం భీము అణచివేతకు సర్కార్ సన్నద్ధత

పన్నెండు గ్రామాల ప్రజలు అడవులు నరికి, మళ్లీ సాగు చేయడానికి తాత్కాలికంగా విరామం ఇచ్చి పోరాటానికి సన్నద్ధమయ్యే పనిలో పడ్డారు. ఇదంతా జరుగుతున్న సమయంలో అధికార వర్గాలు ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి, వారి భవిష్యత్తు కార్యకలాపాలను అంచనా వేసే పనిలో పడ్డారు. హైదరాబాద్‌లోని నిజాం సర్కారు అధికారులు కూడా ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

ప్రస్తుతం గోండుల పరిస్థితి ఏమిటో చెప్పాలంటూ తాహసిల్దార్

అబ్దుల్ సత్తార్‌కు డైరెక్టర్ జనరల్ ఆఫ్ రెవెన్యూ నుంచి వర్తమానం వచ్చింది. దీంతో జోడెన్‌ఘాట్‌పై జంగ్లాత్‌వాళ్లు దాడి చేసిన తర్వాత పరిస్థితి ఏమిటని తాలూక్‌దారును, డిఎస్‌పిని అడిగి సత్తార్ తెలుసుకున్నాడు. అయితే, గోందులు ఏమీ చేయడం లేదని, పరిస్థితి ప్రశాంతంగానే ఉందని వారు చెప్పారు. దాంతో సత్తార్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ రెవెన్యూకు ఉత్తరం రాశాడు.

ఆ ఉత్తరం ఇలా ఉంది. (అల్లం రాజయ్య, సాహు రాసిన కొమురం భీము నవల ఆధారంగా)

డైరెక్టర్ జనరల్ ఆఫ్ రెవెన్యూ,
హైద్రాబాద్ దక్కన్‌గారికి,

సెషన్స్ కోర్టు వరంగల్ వారు పంపిన సమన్సు మేరకు నేను నిన్నటి రోజు సెషన్సు జడ్జి ముందు హాజరైతిని. నేను కోర్టులోకి వెళ్లి కూర్చుండగానే ముద్దాయిలు నా కాళ్ల మీద పడి ఈ రెండు దరఖాస్తులు తమ తరఫున సర్కారుకు పంపాల్సిందిగా వేడుకుంటూ ఇచ్చారు. ముద్దాయిల్లో కొందరు ఏడుస్తున్నారు. మరికొందరు దీనంగా వేడుకోలుతో నా వైపు చూశారు. వాళ్లంతా చలించిపోయినట్లుగా కనిపించారు. వీళ్ల వ్యవహారం చూసి సెషన్సు జడ్జిగారే కదిలిపోయి అలాంటి పని చేయవద్దని వారించారు... ఆ కోర్టులో ఉన్నవారంతా ముద్దాయిల దీన పరిస్థితికి కదిలిపోయారని నేను గమనించాను.

నాకిచ్చిన రెండు దరఖాస్తుల్లో ముద్దాయిలు తమకు విన్నవించుకున్నది ఏమిటంటే ... 'మేము సర్కారు అధికారులను ఏ రూపకంగా గానీ విసిగించాలని గానీ, మరే విధంగా ధిక్కరించాలని గానీ అనుకోలేదని, భీము అతని అనుచరులు వాళ్లను తమ దిక్కు తిప్పుకోవడానికి బలవంత పెట్టారు' అని రాశారు.

నాకు ఏ విషయంలో ఈ నిర్ణయం తీసుకోవాలో తెలియడం లేదు. సెషన్సు జడ్జిగారు నా అభిప్రాయం అడిగారు. నేను ఈ దరఖాస్తులను సర్కారు వారికి పంపించడం తప్ప నాకై నేను ఏ నిర్ణయమూ తీసుకోవడానికి అధికారం

లేదని చెప్పాను. ఆ తర్వాత వాళ్ల తరఫున వకీలు రామచందర్ రావు పైకాజీ వాదిస్తూ ఆ దరఖాస్తులు సర్కారుకు పంపవలసిందిగా కోరారు. కాబట్టి ఈ విషయంలో సర్కారు వారి నిర్ణయం వచ్చే వర్లకు కోర్టు కేసు వాయిదా వేయడం జరిగింది.

వాళ్ల దీన స్థితిని పరిగణనలోకి తీసుకుని, ముద్దాయిలందరూ వ్యవసాయం మీదనే ఆధారపడినవాళ్లు కాబట్టి .. వాళ్లను జైలుకు పంపితే పంటలు చూసేవాళ్లు లేక ఖరాబు అవుతాయని భావించి వాళ్ల కటుంబాలన్నీ ఆకలిచావులు చావగలవని కేసును 26వ తేదీకి వాయిదా వేసి వాళ్లందరిని బెయిల్‌పై విడుదల చేశారు.

ఈ విషయంలో నా వ్యక్తిగత అభిప్రాయం మీ సమాచారం కోసం రాస్తున్నాను. ముద్దాయిలందరినీ క్షమించాలి. బెయిల్ మంజూరైన తరుణంలో వాళ్లంతా ఎక్కడ లేని సంతోషంతో కనిపించారు. జడ్జిగారికి కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా మేమంతా నేరస్థులం కామని, భూములు ఇప్పిస్తామన్న భీము మాటలకు మోసపోయామని చెప్పారు.

ఆ ముద్దాయిల మీద సర్కారువారు దయ చూపితే ఆ ప్రాంతంలో సర్కారు ప్రతిష్ట పెరుగుతుంది. ఇంకా ఈ ప్రాంతంలో సర్కారు వివక్ష పాటించడం లేదని అనుకుంటారు. అవసరమైతే ఇతర వర్గాలపై కూడా దయ చూపుతారని భావిస్తారు.

బుద్ధి వచ్చేంత వరకు ముద్దాయిలు జైలు జీవితం గడిపారని నేను భావిస్తున్నాను. ఈ ఆదివాసుల మీద సర్కారు వారు తప్పకుండా దయ చూపగలరని భావిస్తున్నాను.

మీ ఆజ్ఞలను తలదాల్చే
మీ నమ్మకమైన సేవకుడు
పస్టు తాసీల్దారు
ఆసిఫాబాద్

మడావి మహదు వ్యవహారాలన్నీ చూస్తుంటే, రామచందర్ రావు గోండుల కేసులు వాదిస్తూ వస్తున్నాడు. వారికి బెయిల్ ఇప్పించేందుకు అనువైన విధానాన్ని ఎంచుకుంటూ గోండులకు రామచందర్ రావు చెబుతూ వస్తున్నాడు. అందుకే, కొమురం భీముకు వ్యతిరేకంగా బెయిల్ పొందడానికి రామచందర్ రావు వ్యూహం ప్రకారమే గిరిజనులు మాట్లాడారు. కాగా, మొత్తం వ్యవహారంలో తాహసిల్దార్ సత్తార్ గోండుల సమస్యల పట్ల కాస్తా సానుభూతితో వ్యవహరించినట్లు అర్థమవుతుంది.

## ధిక్కారం ప్రారంభం

జోడెన్‌ఘాట్ ఘటనలో నిందితులు తర్వాతి కోర్టు వాయిదాకు వెళ్లకుండా ధిక్కరిస్తారు. దాంతో సమన్లు తీసుకుని అమీన్ జోడెన్‌ఘాట్‌కు వస్తాడు. అమీన్ తన సిబ్బందితో రావడం గమనించి గోండులు, కోలామ్‌లు కర్రలతో తయారవుతారు. తాను యుద్ధానికి రాలేదని, కోర్టుకు హాజరు కాకపోవడంతో సమన్లు తీసుకుని వచ్చానని చెబుతాడు అమీన్. గోండులు అప్పటికే కోర్టులను బహిష్కరించాలనే నిర్ణయానికి వచ్చారు. ఆ నిర్ణయం మేరకే కోర్టు వాయిదాకు వెళ్లరు.

అప్పటికే నిర్ణయం తీసుకోవడం వల్ల తాము సమన్లు తీసుకోబోమని గోండులు తెగేసి చెబుతారు. ఆ కొత్త రకం పరిణామానికి ఆశ్చర్యపోయిన అమీన్ - వారి తరఫున మాట్లాడేవారెవరైనా ఉంటే తీసుకు రమ్మని చెప్తాడు. దాంతో కొమురం భీము వద్దకు మనిషిని పంపిస్తారు. కొమురం భీము అమీన్‌నే తన వద్దకు రమ్మని కబురు పెడతాడు. లోలోన అమీన్ ఉడికిపోతుంటాడు. అయితే, పరిస్థితి తనకు అనుకూలంగా కనిపించడం లేదు. చూస్తే గోండులు తెగించి తన పైకి దూకేట్లుగా ఉన్నారు. దాంతో కోపాన్ని అణచుకుంటూ కొమురం భీము ఇంటి వద్దకు వస్తాడు. కొమురం భీము బయటకు వచ్చి ఏమిటని అడుగుతాడు. కేసులకు హాజరు కావడం

లేదని సర్కారు తాఖీదులు పంపిందని అమీన్ చెప్తాడు. తాము కేసులకు హాజరు కాదలుచుకోలేదని భీము జవాబిస్తాడు.

సర్కారువాళ్లు పెట్టే దొంగ కేసులకు తాము రాదలుచుకోలేదని, పట్టేదార్లూ, జంగ్లాత్‌వాళ్లూ చేసే దౌర్జన్యాలకు విసిగిపోయామని, తమ పన్నెండు గ్రామాలను కలిపి గోండు రాజ్యంగా ప్రకటించుకున్నామని, నైజాం సర్కారును వ్యతిరేకిస్తున్నామని, నైజాం సర్కారు చట్టాలను తాము పాటించదలుచుకోలేదని సర్కారుకు చెప్పాలని భీము గట్టిగా చెప్తాడు.

కొమురం భీము మాటలతో ఉడికిపోయిన అమీన్ భీమును బెదిరించాలని భావిస్తాడు. నాయకులను అరెస్టు చేయాలని తనకు ఆదేశాలున్నాయని, లొంగిపోవాలని భీముకు చెబుతూ అమీన్ గాలిలోకి పేలుస్తాడు. అంతే, అప్పటికే సిద్ధంగా ఉన్న గోండులు, కోలామ్‌లు అమీన్ మీద పడుతారు. రఘు అమీన్ తల మీద కొడతాడు. జవాన్ల బందూకులు లాక్కుంటారు. అందరినీ చితక బాదుతారు. అమీన్‌తో పాటు వచ్చిన పటేల్ కుర్దును పెరున పేన్కు (భీందేవర) వద్దకు తీసుకుని వెళ్లి ముక్కుకు నేలకు రాయించి, సర్కారుకు మద్దతుగా మరోసారి రావద్దని హెచ్చరించి పంపించి వేస్తారు. అందరినీ తరిమికొడ్తారు. భీము నాయకత్వంలో పోలీసులను తరిమికొట్టారనే వార్త గూడేలన్నింటికీ వ్యాపిస్తుంది. అడవిలోని అన్ని తెగలవాళ్లు కొమురం భీము స్ఫూర్తితో తిరుగుబాటుకు సన్నద్ధమవుతారు. ఖాత్రి బర్మార్లు తయారు చేయడంలో నిమగ్నమయ్యాడు. కొండల్ బర్మార్లు పేల్చడం నేర్పుతున్నాడు. రఘు వొడిసెల విసరడం, బాణాలు వేయడం నేర్పుతున్నాడు. అన్ని గూడేలవాళ్లు యుద్ధానికి సన్నద్ధమవుతున్నారు. ఓ వైపు అడవులు నరుకుతూ, మరో వైపు సమరానికి గూడేలు సన్నద్ధమవుతున్నాయి.

ఆ తిరుగుబాటుతో అధికార యంత్రాంగంలో మంట పుట్టింది. వకీలు రామచంద్రరావు ఇంటి చుట్టూ పోలీసులు తిరుగుతుంటారు. అతని సహాయసహకారాలు గిరిజనులకు ఏ మేరకు ఉన్నాయనే విషయాన్ని

పసిగట్టడానికైనా కావచ్చు, అతని ఇంటికి గిరిజనులు వస్తే అరెస్టులు చేయడానికైనా కావచ్చు. గిరిజనులను అణచి వేయడానికి మరిన్ని బలగాల కోసం కలెక్టర్ నుంచి సుబేదారుకు సమాచారం వెళ్తుంది. బలగాల కోసం జిల్లా అధికారులు వేచి చూస్తారు. పెద్ద యెత్తున జోడెన్‌ఘాట్‌పై దాడి చేయాలనే ఎత్తుగడలో అధికార యంత్రాంగం ఉంది. తిరుగుబాటును సాయుధంగా అణచివేయాలనే నిర్ణయానికి వస్తుంది.

పన్నెండు గ్రామాలకే కాకుండా అన్ని గ్రామాలకు కొమురం భీము తన ప్రకటన పంపిస్తాడు. తమ రాజు రాంజీ గోండు కలను సాకారం చేయడానికి పోరాటం చేద్దామని పిలుపు ఇస్తాడు. గూడేలు పోరాటానికి సిద్ధమవుతాయి.

## దాడిని తిప్పికొట్టిన భీము

భీము ఊహించినట్లుగానే ఎక్కువ సైనిక బలగాలు దాడికి బయలు దేరాయి. వావుదం నుంచి యాభై మంది నిజాం సైన్యం పెద్దవాగు మీదుగా జోడెన్‌ఘాట్ వైపు కదులుతుంది. కుర్దు పటేల్ దారి చూపుతుండగా సైన్యం కొండలు కోనలు దాటుతూ నడక సాగించింది. కెప్టెన్ యాభై మంది సైనికులను మూడు దళాలుగా విభజించి ఒక దళం ఎడమ వైపు నుంచి, కుడి వైపు ఒక దళం, సూటిగా ఒక దళం కొండ మీదికి సాగాలని ఆదేశించాడు. వారు కొండ ఎక్కుతుండగా తుడుం మోగింది. సైనికులపైకి తెంపు లేకుండా వడిశెల రాళ్లు వచ్చి పడసాగాయి. కొండ మీంచి రాళ్లు జారుతూ మీదికి వచ్చాయి. దీంతో సైనికులు వెనక్కి పరుగుల తీశారు. సైన్యం కకావికలమైంది. ఆ రకంగా సైనికదాడిని కొముర౦ భీము దళాలు గెరిల్లా పద్ధతిలో తిప్పికొట్టాయి. గోండులు, కోలామ్‌ల్లో విజయ ఉత్సాహం వెల్లివిరిసింది. ఆనందం పట్టలేకపోయారు.

కొమురం భీము నాయకత్వంలోని తిరుగుబాటుకు ఆసిఫాబాద్ జిల్లా యంత్రాంగం కంగు తిన్నది. ఆ సమాచారం తెలుసుకుని నైజాం

సర్కారు బిత్తరపోయింది. ఆసిఫాబాద్ తాహసిల్దార్ అబ్దుల్ సత్తార్ జరిగిన సంఘటన గురించి వివరంగా రెవెన్యూ డైరెక్టర్‌కు రాసి, వెంటనే ఓ మనిషిని హైదరాబాద్ పంపించాడు. అదనపు బలగాలను పంపాలని పోలీసు డిఎస్‌పి హిదాయత్ అలీ కలెక్టర్‌కు ఆర్జీ పెట్టుకున్నాడు. కలెక్టర్ వెంటనే వరంగల్ వెళ్లి సుబేదారు అజర్ హసన్‌ను కలిశాడు.

సుబేదార్ అప్పటికే అలవి కాని సమస్యలతో సతమతమవుతున్నాడు. వరంగల్ గ్రామీణ ప్రాంతాల్లో, నల్లగొండలో జాగీర్దార్లకు దేశ్‌ముఖ్‌లకు వ్యతిరేకంగా పోరాటాలు ఊపందుకున్నాయి. వాటిని ఎలా అణచాలో అర్థం కాకుండా ఉంది. పరిస్థితి అల్లకల్లోలంగా ఉంది. దానికితోడు, ఈ సమస్య. ఆంధ్ర మహాసభ కార్యక్రమాలు ఊపందుకుంటున్నాయి. జైళ్లు నిండిపోతున్నాయి. నిజాం ప్రభువు నుంచి ఫర్మానాల మీద ఫర్మానాలు వస్తున్నాయి.

కొమురం భీము తిరుగుబాటుపై సుబేదార్ హసన్‌కు ఏం చేయాలో తెలియలేదు. హోం శాఖకు, పోలీసు డైరెక్టర్ జనరల్‌కు వర్తమానం పంపాడు. తనకు ఏం చేయాలో తోచడం లేదని, ఆలోచించడానికి సమయం లేదని, ఏం చేయాలో తక్షణమే తెలపాలని కోరుతూ ఆ వర్తమానం. ఆసిఫాబాద్ స్వయంగా వెళ్లి పరిస్థితిని తెలుసుకుని అన్ని వివరాలతో హైదరాబాద్ రావాలని సుబేదార్‌కు ఐదు రోజుల తర్వాత పైనుంచి ఆదేశాలు వచ్చాయి.

హసన్ ఆసిఫాబాద్ వచ్చాడు. తాహసిల్దార్ సత్తార్‌తో వివరంగా మాట్లాడాడు. గిరిజనుల తిరుగుబాటుకు భూమి సమస్యనే ప్రధాన కారణంగా కనిపించింది. వివరాలు తెలుసుకుని హసన్ తిరుగు ప్రయాణానికి సిద్ధపడ్డాడు. గోండులను ఓసారి కలిస్తే బాగుంటుందేమోనని సత్తార్ అంటాడు. దాంతో హసన్ అగ్గి మీద గుగ్గిలం అవుతాడు. ఆ తర్వాత ఓసారి ఆలోచనలో పడి – వకీలు రామచందర్ రావును పిలిపిస్తాడు. రామచందర్ రావును చూడగానే హసన్‌లో ఆగ్రహం ద్విగుణీకృతం అవుతుంది. గిరిజనుల్లో తిరుగుబాటు

లేపావంటూ ఆరోపిస్తాడు. తాను వకీలునని, ఎవరు పైసలిస్తే వారి తరఫున వాదిస్తానని, తిరుగుబాటుతో తనకేమీ సంబంధం లేదని రామచందర్ రావు చెప్తాడు. భీము ఎక్కడుంటాడని హసన్ అడుగుతాడు. తనకు తెలియదని రామచందర్ రావు సమాధానమిస్తాడు. కాసేపటికి సుబేదారు హసన్ చల్లబడి రామచందర్ రావును వెళ్లిపొమ్మంటాడు. అదే రోజు హసన్ హైదరాబాద్ బయలుదేరి వెళ్తాడు.

సుబేదారు ఆసిఫాబాద్ జిల్లాలోని గోండుల తిరుగుబాటు గురించి ఉన్నతాధికారులకు వివరించాడు. దాంతో సైన్యాన్ని పెద్ద యెత్తున పంపి గోండులను అణచి వేయాలనే నిర్ణయానికి వచ్చారు. ఇంతలోనే బ్రిటిష్ ప్రభుత్వ ప్రతినిధి ఉస్మాన్ అలీఖాన్ వద్దకు వస్తున్నట్లు వర్తమానం వచ్చింది. బ్రిటిష్ అధికారి ఉస్మాన్ అలీఖాన్‌తో సమావేశమయ్యారు. నిర్మల్ నుంచి, చాందా నుంచి తమకు అందిన సమాచారాన్ని అతను నిజాంకు వివరించాడు. నేరుగా కొమురం భీము దళాలు ఉన్న కేంద్రాన్ని ముట్టడించి అణచివేయడం కష్టమని, గుట్టల మీది దళాలను దెబ్బ తీయడానికి కింది ప్రజలను హింసించాలని సూచించాడు. గుట్టల మీదికి ఆహారం వంటి సరుకులు వెళ్లకుండా దిగ్బంధం చేయాలని సూచించాడు. దీంతో నైజాం పోలీసులు, జంగ్లాత్‌వాళ్లు, గుండాలు మైదాన ప్రాంతంలోని గూడేల మీద పడి ప్రజలపై హింసాకాండకు పూనుకున్నారు. గూడేలు అల్లకల్లోలమయ్యాయి. సర్వం కోల్పోయినవాళ్లు జోడెన్‌ఘాట్‌కు వెళ్లసాగారు. దీంతో జోడెన్‌ఘాట్ జనంతో నిండిపోసాగింది. కింద పంటలు నాశనమవుతున్నాయి.

నాలుగు నెలల పాటు నైజాం మూకలు గ్రామాలపై పడి విధ్వంసం సృష్టించాయి. దీంతో కొమురం భీముకు గిరిజనులు తమ బాధలను చెప్పుకోవడం ప్రారంభించారు. గ్రామాలపై విరుచుకుపడుతూనే జోడెన్‌ఘాట్ మీద దాడికి నిజాం సైన్యం ప్రయత్నాలు సాగిస్తూనే ఉన్నది. భీము దళాలు ఆ ప్రయత్నాలను తిప్పికొడుతూనే ఉన్నారు. జోడెన్‌ఘాట్‌కు సరుకులు అందడం

కష్టమైంది. ఈ స్థితిలో సమావేశమై కొమురం భీము అందరి సూచన మేరకు రెండు నిర్ణయాలు తీసుకున్నాడు. ఒకటి - గ్రామాల్లో రహస్యంగా సంచరిస్తూ సరుకులు పోగు చేసుకోవడం, రెండోది - తాము కావాలని యుద్ధం చేయడం లేదని, పన్నెండు గ్రామాల మీద అధికారం ఇస్తే నైజాం విధేయులమై ఉంటామని సర్కారుకు వర్తమానం పంపడం. వెంటనే కార్యరంగంలోకి దిగారు. పాటలు పాడుతూ కొంత మంది గ్రామాల నుంచి సరుకులు తీసుకుని వచ్చే కార్యక్రమాన్ని సాగించారు. అధికారుల వద్దకు నైజాం సర్కారుకు చేరవేయడానికి సూరును పంపించాడు భీము. గ్రామాల్లోకి భీము దళాలు ప్రవేశిస్తున్నాయని తెలుసుకుని నిజాం మూకలు సోదాలు నిర్వహించడం ప్రారంభించారు. పన్నెండు గ్రామాలకు రాజ్యాధికారం ఇస్తే తిరుగుబాటు ఆపేస్తామని చెప్పడానికి కొమురం భీము తరపున రాయబారిగా వెళ్లిన సూరును తాహసిల్దార్ దూషించి వెనక్కి పంపించాడు. ఆ సమాచారం అందంగానే కొమురం భీము ఫౌజును అప్రమత్తం చేశాడు.

నిజానికి పన్నెండు గ్రామాలపై తమకు హక్కులు ఇస్తే నిలదొక్కుకోవడానికి వీలవుతుందని, ఆ తర్వాత భవిష్యత్తు కార్యక్రమాన్ని ఆలోచించుకోవచ్చునని భీము ఆలోచన. అంటే, కాస్త విరామం దొరికితే, ఊపిరి సలువుతుందని అనుకున్నాడు. కానీ, తాహసిల్దార్ దానికి అంగీరించకపోవడంతో ప్రతిఘటన కొనసాగించాల్సిన పరిస్థితే ఉందని భీము గ్రహించాడు.

## చర్చలు విఫలం..

ఇలా సమాయత్తమవుతున్న సమయంలోనే కొమురం భీము వద్దకు ఓ రోజు సబ్ కలెక్టర్ నాజం సాబ్ వస్తాడు. పది మందిని వెంట పెట్టుకుని గొండి గూడెం వచ్చి సబ్ కలెక్టర్ నాజం కొమురం భీముకు వర్తమానం పంపించాడు. ఒక్క నాజం సాబ్‌ను మాత్రమే రమ్మనుమని వర్తమానం తెచ్చిన

వ్యక్తికి చెప్పాడు. దాంతో నాజం సాబ్ కుర్దు పటేల్‌ను వెంట తీసుకుని వచ్చాడు. బేతాళ చెట్టు కిందికి వారిద్దరిని తీసుకుని సూరు వచ్చాడు.

కొమురం భీముకు, నాజర్ సాబ్‌కు మధ్య చర్చలు జరిగాయి. కొమురం భీముకు, అతని చిన్నాయనలకు దున్నుకోవడానికి భూములు ఇప్పిస్తానని, వాటికి పట్టాలు ఇప్పిస్తామని, తిరుగుబాటు మానుకోవాలని నాజర్ సాబ్ చెప్పాడు. అందుకు భీము అంగీరించలేదు. తాము పన్నెండు గ్రామాల కోసం పోరాటం చేస్తున్నామని, తన ఒక్కడి కుటుంబం కోసం కాదని కచ్చితంగా చెప్పాడు. పోనీ, పన్నెండు గ్రామాలవారికి పట్టాలిప్పిస్తామని నాజర్ చెప్పాడు. అప్పటికే అక్కడికి పెద్ద యెత్తున గోండులు, కోలామ్‌లు చేరుకున్నారు.

సత్తార్ వద్ద జరిగిన వ్యవహారంపై సూరు చెప్పిన మాటలతో వేడెక్కి ఉన్న కొమురం భీము నాజర్ సాబ్ మాటలను వినదలుచుకోలేదు. లడాయి చేస్తామని కచ్చితంగా చెప్పాడు. పన్నెండు గ్రామాలపై అధికారం కావాలని కొమురం భీము అడిగాడు. లడాయి ప్రారంభించి ఏడు నెలలు గడిచాయి. కొమురం భీము సంకల్పం తెలిసిన నైజాం సర్కారు గోండులను దెబ్బ తీయడానికి అవసరమైన చర్యలకే పూనుకుంది.

## అంతిమపోరు..

పోరాటం కారణంగా పటార్ల మీద వ్యవసాయం దెబ్బ తిన్నది. నిజాం సర్కారు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసింది. రహస్య దళాలు గ్రామాల్లో తిరగలేని వాతావరణం ఏర్పడింది. జోడెన్‌ఘాట్‌కు సరిగా ఆహార పదార్థాలు అందడం లేదు. పోరాటాన్ని మరింత విస్తరిస్తే తప్ప వెసులుబాటు లభించిందని కొమురం భీము ఆలోచిస్తున్న సమయంలో సూరు ఓ సమాచారం తెచ్చాడు. నిజాం సైన్యం పెద్ద యెత్తున తరలి వస్తుందనేది ఆ సమాచారం. మూడు వందలకు పైగా సైన్యం వావుదం వరకు చేరుకుంది. వారికి కుర్దు పటేల్ దారి చూపుతున్నాడు.

యుద్ధానికి పూర్తిగా సమాయత్తం కాకముందే నిజాం సైన్యం దాడికి పూనుకోవడం పెద్ద సమస్యగా మారింది. ఆయుధాలను సేకరించుకునే పని పూర్తి కాలేదు. సైన్యం జోడెన్‌ఘాట్ కొండను సమీపించారు. పైకి చేరుకోవాలంటే 800 అడుగుల గుట్టను ఎక్కాలి. కుర్దు కొండపైకి ఎలా వెళ్లాలో చూపించాడు. అలీ రజా బ్రాండన్ సైన్యానికి కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు.

అప్పటికే తుడుం మోగించి ఫౌజును సిద్ధం చేశాడు కొమురం భీము. కొండపైకి ఎగబాకుతున్న సైనికుల మీదికి గోండులు, కోలామ్‌లు బండలు దొర్లించారు. దాంతో సైనికులు చెల్లాచెదురై తమను తాము కాచుకోవడానికి ప్రయత్నించారు. సైనికులు పైకి ఎగబాకడం ఆగిపోవడంతో రాళ్లు దొర్లడం కూడా ఆగిపోయింది. ఆ తర్వాత చాలాసేపటికి కెప్టెన్ పలుమార్లు హెచ్చరించడంతో సైనికులు పైకి ఎక్కడం సాగించారు. పై నుంచి బండలు దొర్లుతున్నాయి. రాళ్ల వర్షం కురుస్తుంది. బర్మార్లు పేలుతున్నాయి. అయినా బండలను రక్షణ చేసుకుంటూ సైనికులు పైకి రావడం ప్రారంభించారు. సైనికులు తుపాకులు పేలుస్తూ పైకి వస్తున్నారు.


తాము పైకి వస్తున్నామని, దాడులు ఆపాలని, ఆపితే తాము పట్టాలిస్తామని కెప్టెన్‌తో పాటు ఉన్న తాహసిల్దార్ అరిచి చెప్పాడు. పట్టాలిస్తామని చెప్పడంతో గిరిజనుల్లో ఆశ పుట్టింది. ఒక్కసారిగా బయటకు వచ్చారు. ఎదురుదాడికి విఘాతం కలగడంతో సైన్యం పైకి చేరుకోగలిగింది. పైకి వచ్చిన సైనికులు కుర్దు సహాయంతో ముఖ్యులను గుర్తించి కాల్పులు జరపడం ప్రారంభించారు. కొమురం భీము అనుచరులు తిప్పికొట్టే ప్రయత్నం చేశారు. అయితే, గందరగోళంలో సైనికులది పైచేయి అయింది. రఘు, ఇంకా కొద్ది మంది కాల్పుల్లో గాయపడి కింద పడిపోయారు. కుర్దు పటేల్ భీమును చేయెత్తి చూపించాడు. దాంతో కెప్టెన్ భీము మీదికి కాల్పులు జరిపాడు. భీము కుప్పలా కూలిపోయాడు. 1940 సెప్టెంబర్ 1వ తేదీన కొమురం భీము అమరుడయ్యాడు.

నైజాం సైనికుల కాల్పుల్లో 12 మంది మరణించారు. వాళ్లు: 1. కొమురం భీము, 2. మడావి భీము, 3. కొమురం రఘు, 4. ముత్తు 5. డొంగు రావు, 6. బాదు 7. కొమురం మాను 8. రాపురం బాపురావు 9. అత్రం భీము 10. వంగడి భీము 11. సిడాం భీము 12. దేవుడపల్లి భీము.

సైనికుల దాడితో అప్పటికే చాలా మంది చెల్లాచెదురవుతారు. కొమురం భీము భార్య సోంబాయి ఏడాది కొడుకు మాధవరావును తీసుకుని అడవుల్లో పడుతుంది. సోంబాయి 1994 జూన్‌లో మరణించింది. కొమురం భీముకు ఒక కూతురు కూడా ఉంది. ఆమె పేరు రత్తుబాయి.

కొమురం సోంబాయి తన మనవళ్లు, మనవరాళ్లతో ఆదిలాబాద్ జిల్లాలోని సిరిపూర్ (యు) మండలంంలోని పెదదోబ అనే గ్రామంలో నివసిస్తూ వచ్చింది. ఆ ఊళ్లో భీము కుటుంబాలు తప్ప వేరే కుటుంబాలు లేవు. సోంబాయి కుమారుడు ఆమె కన్నా ముందే విషజ్వరంతో మరణించాడు. అతని భార్య భాగుబాయి. వాళ్ల కుమారులు సోనేరావు, భీంరావు, హన్మంతరావు, కూతురు రత్నాబాయి.

## హైమన్‌డార్ఫ్ అధ్యయనం



హైమన్ డార్ఫ్ దంపతులు (పులుగు శ్రీనివాస్ అడవితల్లి నవల నుంచి)

కొమురం భీము తిరుగుబాటును అణచివేసిన తర్వాత నైజాం గోండుల, కోలామ్‌ల పరిస్థితులపై అధ్యయనం చేసి, నివేదిక సమర్పించాలని హెమన్‌డార్ఫ్‌ను ఆదేశిస్తాడు. దాంతో హెమన్‌డార్ఫ్ రంగంలోకి దిగి విస్తృతంగా అధ్యయనం చేసి నివేదిక సమర్పిస్తాడు. భారతదేశంలోని వివిధ ప్రాంతాల గిరిజనులపై అప్పటికే అతను విశేషంగా కృషి చేసి ఉన్నాడు.

సమస్యకు కారణాలను అతను సరిగానే గుర్తించాడు. ఆదివాసుల్లోని తీవ్ర అలజడికి పట్టేదార్లు, షావుకార్లు, అధికారులేనని అతను గుర్తించాడు. ఆదివాసుల సమస్యను అంతిమంగా భూమి సమస్యగా గుర్తించాడు. తిరుగుబాటుకు కారణం గోండుల, కోలామ్‌ల్లోని విద్యావిహీనత, చట్టాల పట్ల ఎరుక లేకపోవడం అని చెప్పాడు. పైగా, కొమురం భీము నడిపిన పోరాటం పట్ల కొంత విసుగును కూడా అతను ప్రదర్శించాడు. మానవ పరిణామ శాస్త్రవేత్త అయిన హెమన్‌డార్ఫ్ గిరిజనుల్లో కలిసి బతికాడు, అతని భార్య జైనూరు మండలంలోని మార్లవాయిలో సమాధి అయింది. (పులుగు శ్రీనివాస్, అడవితల్లి నవల).




కొమురం భీము మరణించిన స్థలం, స్మారక స్థూపం

(సాహు, అల్లం రాజయ్య నవల నుంచి)

### అణచివేత తర్వాత...

కొమురం భీము తిరుగుబాటు అణచివేత హైదరాబాద్ రాజ్యంలో తీవ్ర సంచలనం సృష్టించింది. పైగా, కొమురం భీము నాయకత్వంలోని గిరిజనులపై 1 సెప్టెంబరు 1940 నాడు నైజాం సైనికులు జరిపిన దాడిలో మరిణించిన వారు ఎంత మంది అనేది వివాదస్పదమైంది. కాల్పుల సంఘటన తెలియగానే ఆంధ్ర మహాసభ బద్దం ఎల్లారెడ్డిని పరిశీలనకు పంపింది. బద్దం ఎల్లారెడ్డి గారు సమగ్ర విచారణచేసి తయారు చేసిన నివేదికను గోల్కొండ పత్రికలో ప్రకటించారు. అప్పటి ప్రకటనలను కొన్నింటిని కూడా సురవరం ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో నడిచిన గోల్కొండ పత్రికలో ప్రకటించారు.

# అనుబంధం

## బద్దం ఎల్లారెడ్డి సమర్పించిన నివేదిక (23.9.1940)

శ్రీయుత బద్దం ఎల్లారెడ్డి గారి క్రింది నివేదికను గోండుల పైన జరిగిన కాల్పుల గురించి ఆసిఫాబాదుకు పోయి ప్రకటనార్థమై పంపించినారు. ----- బాబెఝరీ గ్రామం ఆసిఫాబాదు తాలూకా -----, అ గ్రామపు రైతులకునవీ అడవిశాఖ ఉద్యోగులకును తగాదా వచ్చి దాని ఫలితంగా సుమారు 250 రైతులగు గోండ్లపైన కాల్పులు జరిగినవి, దానిలో సుమారు 100 మందిపోలీసు కానిస్టేబుల్సును సమారు20 మంది అరబ్బు లను తాలూకాదారు, పోలీసు మొహతెమీం,దు ----- తాలూకాదారు మున్నగు అధికారుల ఆధిపత్యంలో తుపాకులు పేల్చిరి సర్కారి లెక్క ప్రకారము 10 మంది ఆ స్థలములోనే మరణించినారు. గాయపడ్డ పద ముగ్గురు ఆసిఫాబాదు దవాఖానా ----- బడగా వారిలో 4 గురు ఇటీవల మరణించినారు. ఝండాగూడ గ్రామములో మరి ఇద్దరు గాయపడినవారు చచ్చినారని 11

ఆ. ------ నాడు పంచనామా చేయబడినది. ఇట్లు మొత్తం 16 గురు చచ్చినారని సర్కారి వారి ------ ఇక ఇక్కడి ప్రజల అంచనా 100 మంది పైగా అచోటనే చచ్చినారని.

నాకు ఇప్పటివరకు, అసిఫాబాదులో తెలిసిన కొంత వరకు ఆగ్రమ చరిత్ర, తగాదా భూముల చర్తిపోట్లాట వివరాలు, ఈ క్రింద ఉదహరించుచున్నాను.

బాబెఝరీ గ్రామములో 1327 ఫసిలీకిపూ ------ గోండుకులానికి జెందిన రైతులు పొందు ------ స్థిరనివాసము చేసికొని అచటి భూములను సేద్యము చేసుకుంటూ ఉండిరి. ఆ రైతుల పేర 50 ఏకరాల పట్టా యైనది. పట్టాభూములను కలు ------ హద్దులు జేయబడలేదు. ఇప్పటికి బందోబస్తుగా లేదు. అందుచే వాస్తవములో సేద్యము చేయబడు భూమి ఇప్పటికే 50 ఏకరాల కంటె ఎక్కవగానుండెను. 1327 వ ఫసలీలో విష (------) జ్వరాలు వచ్చి రాదులలో కొందరు చచ్చిరి. మిగిలినవారు ఆ గ్రామాన్ని ------ వదిలిపెట్టిపోయిరి. తర్వాత 1330 ఫ.లో పట్వారీ ప్రోద్బలముచే ఇప్పటి రైతులు ------ అ గ్రామానికి వచ్చి స్థిరనివాసమేర్పాటు చేసు------ ఆ భూములును సేద్యముచేసికొంటున్నారు ------ రాజు పట్టాభూములసిస్తును యిప్పటివరకు ------ రైతులు చెల్లిస్తూనే ఉన్నారు, 7 ఏండ్ల క్రింది ------ పొరంబోకు నుండి మరి కొంత భూమి ------ సేద్య చేసుకుంటున్నారు. ఇదం------ సుమారు 250 ఎకరాలు వుటుంది, 200 ఎకరాలు పొరంబోకు సేద్యం చేస్తున్నారు. షరాలలో ప్రతిఏడు ఈ భూమి నుండి రైతులు బేదఖల చేయవలసినపని లేకుండా వ్రాస్తున్నారు. 1347 ఫసిలీలో కూడా ఇట్టి షరానే ఇప్పటిదువ్వం తాలూక్దారే వ్రాసినాడు. 1331 ఫసిలీలో ఆదిలాబాదు ------ తాలూకాలలో బందోబస్తు కొలతలై ------ ఫసిలోలో సున్వాయి ఐనది. 50 ఎకరా పట్టా పూర్వపు రైతుల పైరుల మీదనే స్థిరపడినది. తమ భూములచుట్టున్న చెట్లను కొట్టి పొరంబోకు భూములను

కలుపుకొను సంఘటన ---- సర్వసాధారణంగా ఆసిఫాబాదు జిల్లాలో జరుగుచుండును.

1346 ఫ॥ ఆబాన్ నెలలో పై బాబేఝరీ గ్రామపు భూములు అన్నియు పట్టాభూములతో సహా, మహసూరాలో చేర్చబడెనని ప్రభుత్వం వారు ప్రకటించిరి. చట్టాన్నిబట్టి ఆరు మాసాల లోపల ఎవరికేమైన ఆక్షేపణలున్న తెలుపుకోవలయును. పై రైతులు అడవి జాతి వారుగుట చేతను, ప్రభుత్వము వారి ప్రకటన విషయము తెలియకపోవుటచేతను ఆక్షేపణ తెలుపుకోలేదు. ప్రభుత్వోద్యోగుల పై రైతులకు తెతీయజెప్పవలసిన బాధ్యాతయున్నను తెలియజెప్పబడిలేదు. ఆరు మాసాల తర్వాత ప్రభుత్వ ప్రకటన స్థిరపరుప బడినది. ఇది గూడా రైతులకు దెలియదు, అందుచేత, రైతులు మామూలుగా ఏప్పటియట్లె సేద్యం చేసుకుంటూ వస్తున్నారు. 1346 ఫ॥లో అడవిశాఖ అమిను మహమూరా భూమిని సేద్యం చేస్తున్నారని న్యాయస్థానంలో చాలాన చేసిరి. (మొదటినుండి అడవి ఉద్యోగులు 1347 ఫ॥ వరకు ....... ఊరుకున్నారని 1346 ఫ॥లో అడవి అమీను తృప్తిపడక .............. .............. చాలాన్ చేసెననియు ఇక్కడి వాదుక, కేసు జరిగి నాజిం స్థలపరీక్ష కూడ చేసిరి. అప్పుడు నాజింసాహో మీద ఈ భూమికి బదులుగా వేరొక చోటభూమి చూపించెదమని అడవి అమీను ఒప్పుదల పత్రాన్ని, పై గ్రామపు రైతులు భూమిని వదలి పెట్టెదమని మరొక ఒప్పంద పత్రమున్ను వ్రాసి దాఖలు జేసిరి. దానిపై కేసు కొట్టివేయబడినది. ఈ తీర్పు 1346 ఫ అర్ది బెహస్తు మాసములో జరిగింది.

ఒప్పుదలననుసరించి బదులు భూమి చూపవలసియుండెను కాని అట్లు చూపించక నడుమ రైతులను పొమ్మని నిర్బంధింపసాగిరి. సుమారు 15 గురు రైతులు .... నుండిరి. ఈ రైతులకు భీమా యను గోండు పెద్ద రైతు. అందరును గోండు జాతివారలే. వీరిలో 12 గురి భూమిని భాగస్వామ్యంగా అనుభవిస్తుండిరి. సుమారు 6 ఏండ్ల క్రిందట మరి ఇద్దరు రైతుల వచ్చి

వారిని కలుసుకొనగా భూములు తమ పట్టా అని చెప్పి భీమాయను పెద్ద మనిషి కొంత పైకము ఆ ఇద్దరి నుండి వసూలు చేసికొనుచుండెను. వీరందరిని గుడిసెలను లేపుకొని గ్రామమునుండి లేచిపొమ్మని అడవి ఉద్యోగులు నిర్బంధింపసాగిరి. బదులు భూమి చూపించుడని రైతులనిరి. ... నెల ఆఖరులో రైతుల గుడిసెలకు అడవి ఉద్యోగలు నిప్పంటించి కాలబెట్టిరట, దానిలో రైతుల సర్వస్వము ధాన్యం సహా భస్మీపటలమైనది. ఇట్లు చేసిన యెడల రైతులు ఆ గ్రామం వదలి పెట్టిపోయెదరని అడవి ఉద్యోగుల తలంపు కాబోలు. వారెటు బోవుటకును యేమియు ఆధారము లేదు. అప్పటికి రైతులు బదులు భూమి ఇవ్వుడని కోరిరి, వర్షాకాలం అరంభం వరకును వారు వేచియుండి మరల ఆ చోటనే గుడిసెలు నిర్మించుకొని సేద్యం అరంభించిరి. పైర్లు మోకాలు ఎత్తు పెరిగిన తర్వాత జంగ్లాతు ఉద్యోగులు అ గ్రామానికి వెళ్ళి రైతుల పైర్లను పెరికివేసియు, పశువులనుతోలియు, ప్రక్క గ్రామమ రైతులతో దున్నించియు, చెరిచిరి దానిపై రైతులు ఓపిక చెడి ఉద్యోగులతో పోట్లాటకు దిగిరి. దానిలో కొందరి ఉద్యోగులకు గాయములు తగిలినవి. వారి రిపోర్టుపై సర్కారీ ఉద్యోగుల మీద తిరుగబడినారను నేరము మోపబడి ఆరెస్టు కొరకు, సుమారు 15 గురు పోలీసు జవానులు అమీనుతో సహా పంపబడిరి. రైతులొక గుట్ట మీద నుండి పశపడుటకు నిరాకరించిరి. పోలీసువారు అకాశానికి జూపి తుపాకులు కాల్చిరి. రైతులు రాళ్లు విసిరిరి. దానితో పోలీసు వారు తమవశం కాదని తిరిగిపోయిరి. అప్పుడు ఆ గ్రామ రైతులు మాత్రమే యుండిరి. తర్వాత మొహ తమీం పోలీసు, దువ్వం తాలూక్దారు న్యాయస్థాన నాజిం తహసీల్దారు గారులు 50 మంది పోలీసు జవానులతో పోయిరి. ఇట్లు చేయుట కూడదని జాబితా ప్రకారము వ్యవహారము చేసికొండని మీరు మా వద్దికి వచ్చినచో మీ కష్టాలను విచారించి నివారిస్తామని పోలీసు మొహతెమిం మున్నగువారు నచ్చ చెప్పిన మీదట రైతులు అధికారుల దగ్గరకు వచ్చిరి. పేషీపైన హాజరగుటకు జమానతుపై విడుదల చేసి వదలిపెట్టి వెళ్ళిపోయిరి. తర్వాత కోర్టు నుండి సమనులు

వచ్చినవి. సమనులు తామిలు చేయబడినవి. సమనులు తీసికొనిపోయిన జవానును వారేమియు అనలేదు. పేషీపైన హాజరు కాలేదు. దానిపై వరంటు హుకుమును బట్టుకొని గోండులవారి లక్షణము తెలియని కొత్తగా వచ్చిన పోలీసు అమిను 56 కానిస్టేబిల్లతో ఆ గ్రామానికి వెళ్లెను. వెళ్లుటతోడనే సానునయ వాక్యములతో పట్టుకనుటకు బదులు బూతులు తిట్ట నారంభించెను. దానిపై రైతులు ఎదురు తిరిగి, అమీను గుర్రాన్ని కట్టిరి. అందుచేత అమీను జవానులతో సహా తిరిగి పోయెను. దానిపై అమీను సర్కారివారిపైన తిరుగుబాటు చేసినారనీ ఎంత వరకైతే తుపాకి కాల్పులు జరుగవో అంతవరకు రైతులు దారికి రారనియు రిపోర్టు ఇచ్చెను.

ఆ రిపోర్టుపై తాలూక్దారు దువ్వం తాలూక్దారు, తహసీల్దారు, జంగ్లాతు మదద్గారు మున్నగువారులు సమారు 100 మంది జవాను 50 మంది అరబ్బులను వెంట తీసుకణిపోయి ఆ గ్రామానికి 4 మైళ్ల దూరములోనున్న వావుధన్ అనే గ్రామంలో డేరాలు వేసుకొని 4 అబాన్ నాడు మొకాం చేసిరి. బాబెఝరీ గ్రామ రైతులను తమ వద్దికి రమ్మని చెప్పి అంపిరి- వారు రాలేదు- 6 అబాను నాడు రైతులు బాబెఝరీ గ్రామపు గుట్టమీద గ్రామ దేవిత కొలుపులు కొలచుకొని, ఆ సాయంత్రం త్రాగి తిని ఆచారము ప్రకారము అ దేవత దగ్గరనే అందరు నిద్రించిరి. సుమారు 250 గోండులా సమూహమున నుండిరి. రాత్రి అయిన తర్వాత అధికారులు తమ సిబ్బందితో గుట్ట ఎక్కి రాత్రి 4 గంటలకు నిద్రబోవుచున్న రైతులచుట్టు ముట్టడి వేసిరి అప్పుడప్పుడే రైతులు నిద్ర మేలుకొనుచుండిరి వారు పూర్తిగా లేవకముందే, నలు దిక్కుల నుంచి ఒకేసారిగా పెటపెటమని కాల్చిరి-మూడు రౌండులు అనగా సమారు 600 తుపాకి దెబ్బలు రైతుల గుంపు మీద కాల్చబడినవి- పోలీసు వారు పట్టుకపోయిన 3000 తోటాలలో 1600 మాత్రమే వాపసు వచ్చినవని ఒక సమాచారము తెలియుచున్నది. అరబ్బు వారి కాల్పులు వేరే పోరుచున్న వారి మీద గూడా తుపాకులు కాల్చిరట-ఫైరింగు (....) అయిన తర్వాత గూడా చెట్లచాటున దాగుకున్న రైతులను గురిపెట్టి కాల్చిరట. దారి

పొడుగున వచ్చునప్పుడు గ్రామాలలో అరబ్బులు పోలీసులు బలవంతముగా కోళ్ళు, కొర్రెలు, తమకు కావలసినవి లాగుకొనిరి- దోచుకొనిరని జనులు చెప్పుచున్నారు.

చచ్చినవారి సంఖ్య సరిగా తెలియదనియు, సమారు నూరు మంది అ చోటనే చచ్చినారనియు అనేకులు తీవ్రముగా గాయపడినారనియు అనుకోబడుచున్నది. అనేకులు గాయపడి అరణ్యములోకి పారిపోయి ఏక్కడి వారక్కడనే పడి చచ్చినారనీ రెండు మైళ్ల దూరము నుండి అరణ్యమంతా మురుగు వాసన కొట్టుచున్నదనియు, చాలామంది పీనుగులను పోలీసు వారు కట్టెలతో కాల్చి బూడిద చేసినారనియు చెప్పబడుచున్నది.

ప్రభుత్వమువారికెవరికిని గాయాలు తగులలేదు. మొదటిసారి ఆ గ్రామానికి వెళ్లి రైతులను బుజ్జగించి అరెస్టు చేసి జామీనుపైన వదిలి పెట్టిన పోలీసు మొహతెమీం ఇంతలో తబదిలా అయ్యి బీదరు దహనముప్పుడు బీదరులో నున్న పోలీసు మెహతమిం ఇచ్చటికి తబాదిలా అయివచ్చినాడు. ఈ కాల్పులు ఈయన అధిపత్యంలోనే జరిగినది.

ప్రభుత్వ పక్షాన చెప్పబడుచున్నది వేరు విధముగా నున్నది. బీము యనువాడు తన వద్ద గొప్ప మంత్ర బలమున్నదనియు దానితో అధికారులను తమవద్దకే రప్పించి తమకున్న బంచెరాయిపన్ను, అడవి సంబంధమైన కష్టాలు, ఉద్యోగులు తమ నుండి ఆన్యాయంగా వసూలు చేస్తున్న ఘర్ పట్టి నాగరుపట్టి మున్నగు అక్రమపన్నులు మాపు చేయించెదనని నమ్మించి రైతులను గుంపు చేసినాడనీ, రైతులను తమ వద్దికి రానివ్వక తిరుగుబాటు చేసినాడనియు అఖరు కాల్పులునాడు తాలూక్దారు, తన పరివారముతో రాత్రిపూట చుట్టు ముట్టడివేసి మరునాడు ఉదయము పదిగంటలవరకు రైతులను బుజ్జగించుచుచండెననియు, భీమ యనువాడు వినక తాలూక్దారును తిట్టుచుండెననియు, చివరకు రైతులు ఉద్యోగులపైకి తుపాకులు ప్రేల్చిరనియు, ఒక తుపాకి దెబ్బ తాలూక్దారు చెవులవద్దినుండి పోయినదనియు, దానిపై

పోలీసు మొహతమీం దువ్వం తాలూక్దారు కోర్కెమీద కాల్పులకు తాలూక్దారు హుకం ఇచ్చెననియు చెప్పబడుచున్నది.

టాస్కరు, హోలిన్సుగారలు, ఆసిపాబాదుకు 10 అబాన్ నాడు వచ్చి అధికారులను అడిగి వెళ్లిపోయినారు.

## బాబెఝరీ కాల్పుల గురించి కొన్ని సవరణలు

### మరణించినవారు

ఆ రోజే కాల్పులు జరిగినప్పుడు బాబెఝరీలో 127 మంది చచ్చినారని రూఢిగా ఒక పోలీసు పటేలువల్ల చెలియుచున్నది. వీరందరిని పోలీసు అక్కడనే దహనంచేసి గురుతు లేకుండా చేసిరని కూడ తెలియుచున్నది. అస్పత్రిలో 4 గురు మరణించినారు. మంద్రుమాడలో నొక గాయపడినవాడు మరణించినాడు. గోండు ఝుండాగూడలో నిద్దరు గాయపడినవారు మరిణించినారు. వీరందరి పంచనామా కూడ అయినదని తెలియుచున్నది. గడ్లపల్లిలో ఇద్దరి గాయపడ్డవారు మరణించినారని పోలీసు పటేలు రిపోర్టు. చద్రకుంటలో ఇద్దరు మరణించినారని పోలీసు పటేలు రిపోర్టు. మొత్తం ఇప్పటికి 137 మంది చచ్చినారని తెలియుచున్నది. పగలు 11 గంటలకు కాల్చినారని తెలిసినదని చచ్చినవారు నూటికిపైగా నుండవట్టునని పైకాజీగారంటారు.

### రైతులకున్న కష్టాలు

ఘర్ పట్టీ, నాగర్‌పట్టీ, చౌబీనా, (లంచాలు) ఫసల్ పట్టీ, కోళ్ళు గొర్రెలు, నెయ్యి, వెట్టి చాకిరి, బంచరాయిపన్ను గ్రామములకు కలిపి... మహసూరా అడవులను నిర్దేశించుటవలన రైతులకు, వారి పశులవులకు కదలుటకు మెదలుటకు కష్టముగును. దీనివకాశముగా గొని జంగ్లాతు ఉద్యోగుల బాధలు రైతులకు సుఖము లేకుండా చేసినారు. పశువుల హద్దులను దాటిన బంజర దొడ్డిలో తోలుట, రైతులు మహసూరాలో అడుగుపెట్టి కట్టెపుల్ల

లేరుకొని తెచ్చుకున్న చాలాన్ చేస్తామని భయపెట్టుట జరుగును. ఈ విషాద సంఘటనలో పాల్గొన్న వారందరును ఇట్టి మహసూరా గ్రామాలకు చెందినవారె.

సుమారు 10-12 సంవత్సరములనుండి రైతులు ఆ గ్రామపు భూములను కాస్తు ఉండిరని సామాన్యంగా అందరు అనుకోవడం 1345 ఫసలీ నుండి భూములు కాస్తు చేస్తున్నట్టు దాఖలాగలదని, అభూమి అన్ని అరణ్యాన్ని నరకి చేసినవి కావనీ ఖారజాఖారాలనీ అందులో సమారు 50 యెకరాల పట్టా భూములు కలవనీ తెలుస్తున్నది.

నేనిదివరకు పంపించిన రిపోర్టునందు, ఈ కాల్పులకు బాధ్యుడైన, పోలీసను మొహతెమీం బీదరు నుండి తబాదలా అయ్యి వచ్చినాడని వ్రాసియుంటిని. కాని అది పొరపాటు. మరు రెండు సంవత్సరములకు ముందు కాంగ్రేసు సత్యాగ్రహములో మహబూబునగరము జిల్లాలో అరెస్టులు జేయించిన మహబూబునగరము పోలీసు మొహ...మింగారు, ఆసిపాబాదుకు మార్పబడి యున్నట్టి వారు ప్రస్తుతమున్న తాలూక్దారు గూడా మహబూబునగరము నుండి వచ్చినవారే.

*బి. ఎల్లారెడ్డి*

# బాబేఝరీ గోండ్లపై కాల్పులు
# ఆంధ్ర మహాసభ కార్యకారిణీ సభ సమావేశము

తేది 26 ఆబాన్ 1346 ఫస్లి శుక్రవారము సాయంత్రము 3 గంటలకు పై సమావేశము ప్రారంభమై సాధారణ సభా చర్చ జరిగి, లెక్కలు మొదలు గునవి అంగీకరించిన పిదప ఈ క్రింది తీర్మానములు తీర్మానింపబడెను.

1. బాబెఝరీ (ఆసిఫాబాదు)లో గోండ్లవారికిని ప్రభుత్వాధికారులకును కలిగిన దుర్ఘటనం సందర్భమున వెలువడిన ప్రభుత్వ ప్రకటనలను (కమ్యూనిక్) ఇతర బాధ్యతగల కార్యకర్తలు పత్రికలో ప్రకటించిన విషయములను ఈ

సభవారు శ్రద్ధతో గమనించిరి. ఆటవీ జాతివారును, న్యాయశాస్త్రములు తెలియక అతి అమాయక స్థితిలోనున్న వారును అయిన గోండులపై ఇంత ప్రతీకార చర్యలు తీసికొనవలసిన అవసరము ప్రభుత్వోద్యోగులకెందుకు కలిగెనో దురూహ్యము. ఈ దుర్ఘటన సందర్భమున ప్రభుత్వమువారు తెలపిన మృతినొందిన వారి యొక్కయు, గాయపడినవారి యొక్కయు సంఖ్యలకును పత్రికా వార్తలవలన తెలియువాటికిని అత్యంత వ్యత్యాసమున్నది. దీని యధార్ధమేమి? కాల్పులవంటి దారుణ చర్యలు గైకొనదగిన అవసరముండినదా? అవసరముండినచో దాని ఉపయోగమును అవసరమున్నంత వరకే వినియోగింపబడెనా? ఇట్టి విషయములన్నింటిని ఒక నిష్పక్షపాత కమీషన్ ద్వారా బహిరంగ విచారణ చేయించుట అవసరమని ఈ సభ వారు ప్రభుత్వము వారికి తెలుపుచున్నారు.

ఇట్టి పరిస్థితి పంజాబులో ఖాక్సారు ఉద్యమం సందర్భమున సంభవిల్లినప్పుడు ఇట్లు విచారణ చేయనైనది. అంతేకాక ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థులకును రైల్వే వారికిని ఘటించిన విషమ పరిస్థతులను బాబెఝరీకన్న తక్కువ ఘోరమైనవిగా నున్నప్పటికిని మన ప్రభుత్వము వారు కమిషను ఏర్పాటు చేయించు పద్ధతిని బాబెఝరీ గోండ్ల దుర్ఘటనలను గురించి అవలంబించుట దేశీయులకు తృప్తి కలిగించగలదని ఈ సభ వారు ప్రభుత్వము వారికి తెల్పుచున్నారు.

## గోండుల గోడు (3-10-40)

## పూర్వప్రకటనలో కొన్ని సవరణలు

ఆసీఫాబాదు ఆబాన్ 22 బాబెఝరీ గోండుల దురంతములును గురించి యుదార్థమును పత్రికాముఖమున కందించినట్టి శ్రీయుతలు బి.ఎల్లా రెడ్డి గారికి మాకృతజ్ఞాతాభివందనములు. వారింత దూరము విచ్చేసి శ్రమయనక మాకై యింత త్యాగమును చూపరచినందులకు మేము మా హార్ధిక సంతోషమును వెల్లడించుచున్నాము. (పై వారు నాకు చిరపరిచితులు. నేను

వారిపై గల బాధ్యతను సరిగా గ్రహించియే యున్నాను.) మీరు వ్రాసినదాంట్లో అతిశయోక్తియును, అసత్యమును ఏ మాత్రములేదని ఘోషించగలము. అయినను కొన్ని విషయాలల్లో బయలుపడినట్టి నిర్ధారణ ఆనవసరమనియే భావము కావున సవరణకు కొంత ఆవశ్యకము కలదు. వాటినీ దిగువ వ్రాయుచున్నాను.

## ప్రథమ సవరణ

నూతన పోలీసు మొహ తెమింంగారగు హిదాయతలీ ఖాన్ గారు బీదరు దహన సందర్భమున బీదరులో నుండిరనియు ఆసిఫాబాదుకు తబాదిలా అయిన వారనుట సరికాదు.

## ద్వితీయ సవరణ

రెండు వందల పోలీసులును 50 మంది అరబ్బులును న్యాయాధికారి తప్ప తక్కిన అధికారులందరును సివిల్ సర్జనుతో సహా వెళ్లియుండిరనుటలో ఏలాంటి అతిశయోక్తిలేదు.

## తృతీయ సవరణ

మరణించినవారి సంఖ్య వందకు పైగా గలదు అని వదంతులు కలవు. బీదర్ సందర్భమున ఒక వారమువారు 56 లక్షల నష్టము వాటిల్లినదినియు రెండవ పక్షము వారు 60 లక్షలకుపైగా నష్టము వాటిల్లినదనియు యిరు పక్షములవారు తమ తమ ప్రకటనలపైననే యదార్థమున్నదనుచు బలపచుచుండిరి. అది ధనవిషయము కాని. యిందు అలాంటి పొరపాటునకును ఆతిశయోక్తికిని వీలుండదని రూఢిపరచగలను. సాహుల వలనను పటేల్ పట్వారీల వలనను చాకలి, మంగలి మున్నగువారి వలనను యదార్థము తేటపడును.

## చతుర్థ సవరణ

ఆటవిశాఖకు సంబంధించినవారు గోండుల గుడిసెలను, చెట్లను భస్మీపటలము చేసినందులకు గోండలు ఓపిక చెడిరి అని కొందరి ఊహ.

కాని నాకేదారు గారు ప్రయోగించినట్టి బందూఖ్ గుండు భీమును పక్కనుంచి గాయపరచకుండ పోయియుండెను. అదుంచేవారు ఉద్రేకపరితుడైనా కేదారును చౌకీదారు మున్నగు వారలను గాయపరచియుండిరి.

**పంచమ సవరణ**

పూర్వపు మహతమీమ్ పోలీసుగారగు ఆలీ రజా(బ్రాండన్ గారికి ప్రజలపైన ప్రేమానురాగములు మెండు. ప్రజాక్షేమమును తమ క్షేమమువలె చూచుచుండెడివారు. కావుననే గదా యిప్పటికిని అతని బహు సంఖ్యాకుల తలచుకొనుచున్నారు, గోండలు వశపడుటకును, జావిూన్‌పై విడువబడుటకును వీరి గుణవిశేషములే కారణములనక తప్పదు వీరే యుండిన యింతటి అన్థాకము వాటిల్లకుండెడిదెమో.

**షష్ఠమ సవరణ**

ప్రభుత్వ ప్రకటనలో 11 గం॥ పగలు అనియు గోండుల నుంచి వచ్చినట్టి వందంతులలో రాత్రి 4 గంటల సందర్భమున అనియు రెండింటిలో యేది నిజమైయుండునో నిష్పాక్షిక విచారణ సంఘమేర్పాటైనచో తెలియగలదు.

**సప్తమ సవరణ**

గోండులు నూతన పోలీసు అమీన్‌గారిపై తిరుగబడి గుల్లమును గాయపరచిరని విషయమంతయు వటికల్లు, అమీన్‌గారు పోతుపోతూనే బూతులు కక్కుచు పురుషులనేగాక స్త్రీలను కూడా కారాగృహమున కంపెదనని బెదరుపెట్టి నందులకు గోండలు మేము ప్రభుత్వముతో కయ్యమునకు దిగుట మా ధర్మము కాదు. మా భూమి మాకు పట్టా చేసి యిస్తే మేము ఊరకొందుము. మేము మా ప్రాణములలో ప్రాణమ్మున్నంతమట్టుకు కారాగారముకు రాము. ఇది ముమ్మాటికి నిజము అని చెప్పినంతనే అమీన్ సాహెబు గారు తిరిగి వచ్చి దానికొక ప్రత్యేక స్వరూపమును కలిగించిరి.

# గోండుల పై కాల్పులు (23-9-40)

## ప్రభుత్వ ప్రకటన

ఆసిఫాబాదు జిల్లాలో గోండులపై పోలీసువారు తుపాకులను కాల్చినందున 10 మంది చచ్చినారు తెలుపబడియండెను. అటుపై ప్రభుత్వము ఈ క్రింది విధముగా ప్రకటించుచున్నారు. పోలీసు మంత్రియున్ను పోలీసు నాజమున్ను ఆసిఫాబాదుకు పోయి విచారణ చేసి వచ్చుట చేత తె ----- ఇంతవరుకు 10 గురు గోండులు చనిపోయినారు.

----- ఏండ్ల క్రిందట ఒక గోండు ఈ రాష్ట్రంలో ----- వచ్చి ఆసిఫాబాదుకు 12 మైళ్ళ దూరములో ఒక అడవిలో పీఠము వేసినాడు. అచ్చుట వాడు ----- వ్యవసాయం సాగించినాడు. క్రమంగా 300 ఎకరాలను స్వాధీనం చేసుకున్నారు. కొందరు శిష్యులు కూడ జతకూడినారు. అడ ----- నవ్యవసాయాన్ని ఆపివేయ ----- కాని వాడు వినలేదు. 2 నెలల ----- కొందరు అడవిశాఖవారు వానిని నిరో ----- అందులో ఇద్దరికి దెబ్బలు ... ఈ మనిషిని పట్టెది కష్టమని మొహతమీం ----- వెళ్ళి వానినిన్నీ మరివాని వద్దనుండే ----- మందిని పట్టుకొని వారు పట్టుకొన్న ఆయుధాలను క్రింద పెట్టించి జమానతుపై అచ్చుట---- ఇక్కడి కంతాతృప్తికరంగా పరిష్కారమైందని జిల్లా అధికారులు నివేదించి కొనిరి. వారణదినం నాడు కోర్టుకు గోండులు రాకపోయిరి. అందుపై వరంటు పంపబడెను. దానిన వారిపై ప్రయోగించుట కష్టసాధ్యమయ్యే ----- ప్రయోగింపుచో జవానులను చంపుచున్నారు. ఈ గోండు మరీ బిర్రబిగిసి తాను గోండు రాజానిన్ని తనకు 5 జాగీరులిచ్చి అడవి ----- కాలన్నీ వదలు కోవలెనిన్ని తాలుక్దారుకు పోలీసు అధికారికి చిట్టీలు వ్రాసినాడు. తనవారి పై ప్రభావం వేసినాడు తనకు మంత్రశక్తి ఉన్నదన్నాడు. తుపాకీ గుండ్లు తమపై పారవన్నాడు.

ఆ మార్గంగా పోవు వానిన్ని చేయి విసరి క్రింద పడగొడ్తాను చూడమన్నాడు. ఇట్టి ముచ్చట్ల చేత వాని అనుయాయివర్గం 1000 మందివరకు పెరిగిరని వదంతి. ఇక శ్రుతిమించనీయు గూడదని తాలూక్దారు 100 పోలీసులను తుపాకులతో లారీలతో తీసుకొని వెళ్ళినాడు. జిల్లా పోలీసు అధికారిని, జిల్లా ఆటవీశాఖాధికారిని జిల్లా డాక్టరును వెంటబెట్టుకున్నాడు. గాయాలకు చికిత్సచేసే మందు డబ్బాలను కూడ పట్టించుకున్నాడు. ఇంకా ఇద్దరు రెవిన్యూ అధికారులను వెంటబెట్టుకున్నాడు. గోండులుండే గుట్టవద్దకు 4 అబాన్‌నాడు వెళ్ళి డేరావేసినాడు. ఆ గ్రామం పటేలు ద్వారా గోండులకు రాయబారాలంపినారు. కాని గోండులు పటేలును మళ్ళివస్తే చంపివేస్తామని చెప్పంపినారు. మరునాడు గోండులు నగారాలు మోగించినారు. 6 అబాన్ నాడు పోలీసు వారు 700 అడుగులయెత్తు గట్టును భద్రముగా ఎక్కినారు. అచ్చట 500 గోండులు ఆయుధాలతోనుండినారు.

4 గంటలకాలం తాలూక్దారు వారికి బుద్ధి రావలెనని చాలా ప్రయత్నం చేసినాడు కాని లాభము లేకపోయింది. వారు ఆయుధాలను విసర్జించమన్నారు. పైగా మీరు వెళ్లుతారా లేక అందరిని నరికివేస్తుమా అని బెదిరించినారు. తుదకు మాటల కాలం పోయింది. వారు కూతలు పెట్టుచు 70 గజాలు వెనుకకు తగ్గినారు. అనేక గోండులు ఆవేశంతో ఊగుటకు మొదలు పెట్టినారు. ఇక ప్రమాదమే అని తాలూక్దారు గాలిలో రెండు మారులు బెదరించేదానికి కాల్పించినాడు. దానివల్ల లాభం లేక పోయినప్పుడు గుండ్లను కాల్పించినాడు. గోనిడు నాయకుడు పోలీసువారికి 10 గజాల దూరంలో చచ్చి క్రిందపడినాడు వాని ప్రక్కనే వాని చుట్టమొకడు చచ్చిపడినాడు, మరి 7 మంది అప్పుడే చచ్చిపడినారు. 13 మందికి గుండుదెబ్బలు తగిలెను. మిగతవారు అడువులలోనికి పారిపోయినారు. గ్రామంలోని కొందరు గోండులు తుపాకులతో నుండగా అరెస్టు చేయబడినారు. డాక్టరు గాయాలు పొందినవారికి వెంటనే కట్లు కట్టినాడు. మరునాడు తాలక్దారు గారున్ను వారి సిబ్బందియున్ను పరివారమున్నూ ఆసిఫాబాదుకు గాయాలు పొందిన

వారిని పట్టుకున్న గోండువారిని తీసుకొని వెళ్ళిరి. విచారణలు జరుగుచున్నవి.

## గోండుల గోడు (21.10.1940)

గోండుల గోడునకుగల కారణములు ఇంతకుపూర్వము వివరింపబడినవి. ఇందులో అధిక సంఖ్యాకు .. పాల్గొన్న వారు మహసూరా వలన బాధింపబడువారే, నేను స్వయంగా పర్యటన సందర్భమున గైర్ మహసూరాలో నున్నట్టి భూములను పరంపోకుగాను బంజరు గాను ఉన్నట్లు చూచినాను. చూపగలము, లంచాలు, గ్రామపట్టి మున్నగునవి ముఖ్యాంశములు, 12 రూపాయలు వేతనముగల చౌకీదారులు ముగ్గురుని లేక నలుగురిని ఆరేసిరూ జోగ్రహించదగిన విషయము. గొండులు ప్రభుత్వము వారితో పోటికై సమ్మె కట్టినట్లయితె నలుగురికి ..గా వెళ్లీ ఆవ్వల్ సాహెబు గారి పాదములపైబడి తమ కష్టములను దూరము చేయవలసినదనుటకు గల కారణమేమో బోధపడకున్నది. అయితే యీ గోండులు మిలిటరీ శిక్షణ పొందినవారా? కారు కానూనిక, సైనిక మరుయు మిషనరీ బలములు తేలేదు. తుపాకులు మందుగుండు కూడా లేనట్లు ------- తెలుపుచున్నవి. ముట్టడించుటకు పోవు గంటకుపైగా ఆవ్వల్ సాహెబు గారి ఆజ్ఞ లేకుండానే మొహ్తామిమ్ మరియు దువ్వము సాహెబు గారిట్లు చేసిన విషయ ----- జమైతె గొప్ప అత్యాచారమే గాక పదుగురే చచ్చినారను విషయల ---- దేహాస్పదముగా నున్నది. స్థానికాధికారులకు ప్రజలపైన ప్రేమ యుండిన యుట్లు తొందరపడుటకునీ, అనర్థమునొడిగట్టుటకును వీలే చిక్కకుండెడిని గొండులనరెస్టే జేయవలెనను కుతూహలము గాలవారైనచో సాహులు, రాజగొండులు, స్థానిక ప్రఖ్యాతి వకీళ్ల సహాయము తప్పకుండా పూర్వపు మొహ్తామిమ్ గారివలె గైకొనెడివారు కాని వారికట్లు నచ్చకుండెను కాబోలు గోండులు సమ్మెకట్టిన వారైనచో ముట్టిడింపబడుటకును, మైదానములో గుమిగూడుటకును వీలే యుండక పోయెడిది. ఒక మాసము కావచ్చినను తక్కిన నా మాలుమ్ శవముల పేర్లు బహిరంగపడకుండుటకు యేదైనాని

శేషము ఉండవచ్చును. అట్లు వెల్లడించుటకుముందు మేముకూడా ... పేర్లను వెల్లడించుట బాగుండదు. స్థానకాధికారులు ఆడినదే ఆట పాడినదేపాట అన్నట్లయితే ముందు మా గతి కూడా యేమి కానున్నదో? మాలో ప్రభు భక్తి దేశభక్తి యెంత యుండినను మాకును, స్థానకాధికారుల అడుగులకు మడుగులొత్తక వారి ఫర్మాయిషీలను తామిల్ చేయక నిలుచుండ జకుండినచో గోండుల గతియే సంభవించక తప్పదేమొ? నేను స్థానికాధికారులపైన ఈర్ష్యా ద్వేషములను గలిగిఇట్లు వ్రాయుటలేదు. యదార్థం యెంత మట్టుకు దాగి యుండగలదు. వేయేల దయామయులును ప్రజానురంజకులైనట్టి మ.ఘ.వ.నైజాం ప్రభువరేణ్యులవారు తక్షణమే ఒక నిష్పాక్షిక కమిషన్ ద్వారా యదార్థమును గ్రహించి తగు న్యాయమును చేకూర్చి కన్నబిడ్డలవలె మమ్ము కాపాడెదరు గాక.

ఇట్లు

*జి. యన్. గుప్త*

# గోండుల గోడు

## కమిషన్ కావలెనని స్థానిక నాయకుల మొర

ఆసిఫాబాదులోని శ్రీనివాసాచారి. లక్ష్మణ్ అను వకీళ్ళు ఈ క్రింది విధముగా ముషీరె దక్కన్‌లో అభిప్రాయ ప్రకటనము గావించియున్నారు.

“ఆసిఫాబాదు గోండుల విచారకరమగు పరిస్థితులు చాల విషాదకరముగా నున్నవి. ప్రభుత్వంవారు ప్రకటించిన వార్తతో తృపి పడుచుంటిమి, కాని యిప్పుడు నమ్మకమైనవారి ద్వారా వినవచ్చిన వార్తలనుబట్టి స్థానికాధికారులు గోండులకు వ్యతిరేంకంగా చాలా ఘోరమగు విధానమ వలంబించినారు. పరిస్థితులను బట్టి అట్టి కాఠిన్యత కవసరము లేకుండెను. ప్రభుత్వ ప్రకటన ప్రకారము చచ్చినవారి సంఖ్య కేవలం 10 లేక 11 కాని మాకు వచ్చిన వివిధ వార్తలనుబట్టి చచ్చినవారు సంఖ్యకు పరిమితి లేనట్లున్నది

పోలీసువారి కాల్పులవలన అనేక గోండులు చెట్లక్రిందను వివిధ ప్రదేశాలలోను చచ్చిపడినారు. ఇంతేకాక అధికారులు కొందరు కొన్ని శవాలను ఇదివరకే కాల్పించి వేసినారని తెలియవచ్చినది. అట్లు కాల్చినను చుట్టుపట్టుల స్థలాలో చెప్పరాని దుర్వాసన (ఈ పీమగులవలన) వ్యాప్తించుకొని యున్నది. జనులు కాని మరెవ్వరైన అధికారేతరులు కాని ఈ ఘోరాలు జరిగిన స్థలములలోనికి పోకుండా ప్రభుత్వాధికారులు చక్కందీలు చేసివారని కూడా తెలియ వచ్చుచున్నది. దీనినిబట్టి జరిగినఘోరాలను చచ్చిన శవాల సంఖ్యను తెలుసుకొనుటలో అడ్డంకులు కల్పించుచున్నారని విశదమగును. ప్రభుత్వ ప్రకటనలో చూపించినవారకింటె ఎక్కువగానే గాయాలు తలిగినవారు ఆసుపత్రిలో చికిత్స పొందుచున్నారని తెలియవచ్చింది.

బీదరు ఘోరం, విద్యాపీఠ విద్యార్థుల ఘోరం తర్వాత ఈ గోండులపై ఘోరం అను యీ మూడు ప్రజలలో ఆశాంతికి కారణాలుగా నున్నవి.

**కమిటీ ఏర్పాటు చేయండి.**

విద్యార్థుల అల్లరిని గురించి ఒక కమిషన్ ద్వారా విచారించుట యుక్తమని ప్రభుత్వము వారభిప్రాయపడిరి. అదే విధంగా గోండులపై జరిగిన ఘోరాలను విచారించుటకు నిష్పక్షపాతమైన కమీటిని ఏర్పాటు చేయుదురని ప్రభుత్వమువారిని వినయపూర్వకంగా ప్రార్థించుచున్నాము.

**లీడర్లేమైరి?**

ఒక్క ప్రజానాయకుడూ ఇంతవరకు తమ దృష్టిని ఈ గోండుల అతిగతి విషయంలో ప్రసరింపకపోవుట మాకు చాలా విచారం కలిగింది. కావున ఏ మతమువారైను ఏ సంఘమువారైనను సరే నాయకులందరికిని మనివి చేసుకొనుటయే మన తామీ వివిధ ఘట్టాలను గురించి శ్రద్ధతీసుకొనగలరు. మరియు బాబెహుకూమతు వారు విచారణ కమిటీని యేర్పాటు చేయవలసినదిని గట్టిగా కోరవలసినదని ప్రార్థించుచున్నాము.

## గోండులగోడు
## క్రొత్తగా తెలిసిన సంగతులు

ఆసిఫాబాదు, ఆజూరు 7 గోండులగోడు యందలి యదార్థమును గ్రహించుటకై ఆయా గ్రామాలకు వెళ్ళియుంటిని. ప్రేమ్‌కుమార్‌గారు గిన్నెధరి నుంచి తిరిగి భాగ్యనగరము వెళ్లియుండిరి. తర్వాత కొందరు గోండులను వెంబడించుకొని మోయిందా, చింతన్ మాదర, మాడర, దుర్కగూడెం (మామిడిగూడెం), కవుడాన్ మొవడము, మోడము, జోడేఘాటు, నావుథం, గుండగూడెం. బాందర్ గూడా, అడేదసనాపురం, ఖాఫ్రీ, బేల్కావు మున్నగు గ్రామాలకు వెళ్ళి, అక్కడి వారి వాంఙ్మూలములను గైకొని, ముఖ్య సారాంశమును యీ దిగువ వ్రాయుచున్నాను.

ఈ గోండులలలో రెండు చీలికలై ఒక పక్షము పోలీసువారిని కలిసికొని యున్నది. కొన్ని స్థానిక ఉర్దూ పత్రికలు జోడేఘాటుకు బదులు బాబేఝరీలో దురంతములు జరిగినట్లు బహిరంగ పరచియుండెను. అదంతయు కల్ల.

200 మంది పోలీసులును, 50 మందివరకు అరబ్బులును, న్యాయాధికారి తప్ప స్థానికాధికారులు సివిల్ సర్జనుతోసహా 30 మందికిపైగా బేగారిబండ్లను, మనుష్యులను, చేతలో పని యుండినను ఏ మాత్రము కనికరము చూపకుండా 4 రోజులు తమపలిలో నుంచియుండిరి. మొదలు వావథమ్ జోడేఘాటుకు 2 మైళ్లు గుట్ట క్రింది భాగమున విడిదులు వేయించి ఆ తదుపరి ఉదయం 5 గంటల సమయమున గోండులను మూడుదిక్కుల నుంచి ముట్టడించుకోగల్గిరి.

ఆవ్వల్ తాలూక్దారుగారు కొందరు గోండులను వచ్చుటకై ఆజ్ఞాపించినంతనే నల్గురు వచ్చి జంగ్లాత్, ------, పోలీసు ఉద్యోగుల నగలిగెడి కష్టములను తెలుపుకొనిరి. ఆవ్వల్ తాలూక్దారు గారు భీముకు అనగా (బాబేఝరీ వారికి) గల కష్టములన్నియు తొలగింపబడును. తత్క్షణమే ........ అని సెలవిచ్చియుండిరి. అందులకు భీము "ఒకేలా బాబేఝరీ

కష్టములు దూరమవుటవల్ల నేమిలాభము? యీ జిల్లాలోని అన్ని తాలూకాలవారికి ఘర్ పట్టి, నాగర్ పట్టి, జౌబీసా, బంచరాయి మున్నగు శిస్తులలో తగ్గింపులును మాఫీలును గావించిన బాగుండునని సమాధానమును చెప్పుకొనుటకై మళ్లీ పంపినట్టి నలుగురు గోండులను పోలీసువారు అరెస్టు చేసుకొనిరి. ఇందులకు గోండులు వారిని విడవవలసినదని విన్నవించుకొనిరి. ఆవ్వల్ తాలూక్దారు గారు గోండులను ఆసిఫాబాదు వస్తే మీ కష్టములన్నియు తొలగింపబడునని సెలవిచ్చియుండిరి. కాని అది వారికి నచ్చలేదు.

ఇక కాల్పులు తప్ప మరో త్రోవ అరెస్టుకై కన్పించనందుచే తన్వేడు జయన్నలు విసరే పర్యంతము, భర్తికచ్చడయును ఒక మైలుకుపైగ గుట్ట నెక్కించినంత సేపు కుంభవర్షమువలె తుపాకి గుండ్లు కురియు మొదలిడెను. 200 గోండుల సమూహముండెను.

అడవిలోపడి చచ్చినవారెందరో బోధపడుటలేదు కాని కాష్ఠములు వేసి కాల్వబడినట్టి శవములు నాలుగు బండ్లలో రేకులమట్టము నింపబడ యుండను. ప్రతి బండిలో 5-6-7 మందికి పైగా అనగా మొత్తము 20-30 మందికి పైగ నుండినట్లును కాష్ఠము ఒక పెద్ద యిల్లంత యెత్తు ఉండినట్లును, మొదట కట్టెలను పేర్చి వాటిపైన కొన్ని శవములు వేసి, మళ్లీ కట్టెలను పేర్చి, వాటిపైన ఎక్కి తతిమ్మ శవములను వేసి మళ్లీ కట్టెలను పేర్చి ఒక దిక్కు పోలీసు వారున్ను, యితర దిక్కులకు ఆ బేగారుదార్లును నిప్పంటించి యుండిరి. తుపాకులు ప్రేల్చబడినప్పుడు మైలుకుపైగా మబ్బువలె పొగ వ్యాపించి చీకట్లు క్రమ్మనట్లుండెనటు. బేగారీ బండ్లు గుట్టను తొందరగా ఎక్క జాలనందుకు పోలీసువారొకనిపై బడితన్ని గ్రుద్దిరి. అందువలన నడుముపై యిప్పటి వరకు నొప్పియున్నట్లు నేను స్వయముగా చూచినాను.

జోడేఘాటులో వారు రెండు రోజులుండినట్లును, 2 మైల్లకుపైగా మురుగు వాసన అపారిముగా వ్యాపించినందుచే నీళ్లు కూడా త్రాగుటకు అసహ్యాము

కలిగినట్లుకు, జోడేఘాటునకు దక్షణమున పడమటగల లొద్దివైపు గుంపులు గుంపులుగా గ్రద్దలు పోయినట్లును, ప్రేల్చబడిన మరుపటి రోజు పోలీసువారు కొద్దు, భీము మున్నగువారి యిండ్లలో జొరడి గడ్డపారులు, కొడవండ్లు, తుపాకులు, కత్రలు, ఢోల్ నగారాలు, ముల్లు కత్రలు, బర్చీలు మున్నగునవి జప్తు గావించినట్లును, కోళ్లు, మేకలు, నెయ్యి, పాలు, పెరుగు కూడా బేగారీలోకి తీసికొనినినట్లును, బేగారీవారిని ఆ రెండురోజులు తిన్నారా లేదా యని యడుగూ వారే లేకుండినట్లును, భయమువలన వారు ఉపాసము చేసి యుండినట్లును తెలిసినది. పోలీసు అమీన్‌గారు 10 మందికి పైగా చచ్చినట్లును 12 మందికి పైగా గాయిపడినట్లును, చెప్పవద్దని బెదురు పెట్టియుండిరని అక్కడి వారు వాంజ్మూలములను యిచ్చి యున్నారు.

ఇందులో యేలాటి జోక్యము కలిగించుకోనట్టి నిరపరాదులగు గోండులు కూడా వివిధ దౌర్జన్యములకు, దోపిడిలకు, రుష్వతులకు గురియగుచున్నారు. కొందరు అమీన్ గారికి లంచము ఒప్పుకొని జమానతుపైన విడువబడినట్లును తెలిసినది. ఒక గోండు వద్దినుంచి వచ్చినట్టి పత్రమువల్ల పోలీసు అమీను గారు ఆయా గ్రామ ప్రజలనుంచి 700ల రూపాయిలు.... గైకొనినట్లు తెలిసినది.

ఇంక యితర గ్రామాదుల విషయములు సరిగా తెలియకున్నవి. చచ్చినవారి సంబంధులును భార్యపిల్లలు ఏడ్చుటకు కూడా భయపడి మానుకన్నారు.

ఈ విషయములను గ్రహించుటకై ఆయా గ్రామములకు వెళ్ళినందులకు నాపైన నిగ్రానా యేర్పాటు అయినది. బంచరాయి పన్ను వసూలు చేయుట యందు ఆటవిశాఖోద్యోగులగు చౌకీదార్లు మున్నగు వారలు తాపాకులు (శస్త్రములు) శత్తులు, మున్నగువాటిని ధరించి, పై నుండి ఆజ్ఞ గైకొని వచ్చినాము. తక్షణమే చెల్లిసేక్తనే బాగుండును. లేకుండిన గొంతులు కోసెదమని బెదరించుచు దోచుకొనుచున్నారు.

ప్రతి శనివారము ఆసిఫాబాదులో సంత జరుగుచుండుట గలదు. నిరపరాధులగు గోండులు కూడా భయపడి వచ్చుట లేదు. వందలకు బదులు పదులు కూడా రాక సంత అంతయు పాడుపడిపోయినది. కూరగాయులు విక్రయించువారు మిగుల బాధింపబడుచున్నారు. సరిగా పైకము అభించుట లేదు.

నేడు అనగా శనివారము 7-1-50 రోజున పేషీయుండెను. శ్రీయుతులు పూజ్యమాన్ రామచంద్రరావు పైకాజీ గారున్ను శ్రీయుతులు గౌరవనీయులైనట్టి రాంచదర్ రావు ఆమ్టే గారున్ను గోండుల పక్షమున వకీళ్లయినారు.

మరియు ఇద్దరు గోండులు పైకాజీగారికి వారికి పూర్వమునుంచి వైరమున్నట్లును అంతేగాక రెండవ పక్షమునకు సంబంధిచినవారగుట చేతను, బషీరొద్దీన్ గారిని తమ వకీలుగా యేర్పాటుచేసుకొన్నారు. పేషీ 14-1-50 ఫసలీ శనివారము యేర్పాటు అయినది. భాగ్యనగరము నుంచి ఒక ప్రఖ్యాత వకీలుగారు దయ చేయుదురని శుభలేఖల వలన తేటబడుచున్నది. ఇంత మట్టుకు వ్రాసినదంతయు సత్యము. నేను స్థానికాధికారులపై ద్వేషమును కలిగి యట్లు వ్రాయుటలేదు. సర్కారీ రిపోరుటలో మరణించినవారి సంఖ్య 10 యే వ్రాయుబడినది మరియు 7-6-10వ వారి పేర్లు యేర్పాటు లేవనియు నా మాలూమ్" అనియు వ్రాసియుంచినారు. అయితే యింకో ముగ్గరి పేర్లను తెలియబరచిను వెల్లడింతురు. అయినను యిద్దరు నూతనుల పేర్లు ఏవైతె సర్కారీ రిపోర్టులో లేవో వారి పేర్లను గ్రామములను మవుదం హవల్దారు వాజ్మూలము తెల్పుచున్నది. వానికి గర్బాపురం అన్ని యను గోండు స్త్రీ చెప్పినదట. వాజ్మూలము అడవులు పట్టినవారిలో నొకరం చింతన్ మాదర లచ్చు నిరపరాధుడైనను పోలీసు వారి బాధల సహింపజాలక అడవులు పట్టినాడు.

# ఉపయుక్త గ్రంథాలు


**1. సాహు, అల్లం రాజయ్య** : నైజాం గుండెల్లో నగారా మోగించిన కొమురం భీము (నవల) అదివాసి ప్రచురణలు జోడెన్ ఘాట్, 2004.

**2. పులుగు శ్రీనివాస్** : అడవితల్లి నవల (కొమురం సోంబాయి) చేతన పబ్లికేషన్స్, హైదరాబాద్ - ఆగష్టు 1999

**3. భూపాల్** : ఆదివాసీ వీరుడు (కొమురం భీము), వెన్నెల ప్రచురణలు - జులై, 2012.

**4. ఎస్. ఎమ్. ప్రాణ్‌రావు** : కొమరం భీమ్, రమణ పబ్లికేషన్, ఆగష్టు 2010

**5. డా॥ సుంకిరెడ్డి నారాయణరెడ్డి** : తెలంగాణ చరిత్ర, తెలంగాణ ప్రచురణలు, హైదరాబాదు. సెప్టెంబర్, 2011.

**6. కుర్రా జితేంద్రబాబు** : ఆంధ్ర మహాసభ మూడవ సంపుటి, అముద్రితం.

Blank Page

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రాష్ట్ర సాంస్కృతికశాఖ, సాంస్కృతిక మండలి

ప్రచురణ, ముద్రణ & పంపిణీ
తెలుగు అకాడమి
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగు భాషా సంస్థ
హిమాయత్‌నగర్, హైదరాబాదు

email : info@teluguacademy.net
web : www.teluguacademy.net